# ఆంధ్రభూమి

www.andhrabhoomi.net

సంపుటి 60 | సంచిక 99 | హైదరాబాద్ సిటీ | హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, రాజమహేంద్రవరం, అనంతపురం, కరీంనగర్, నెల్లూరు

బుధవారం, 8 జనవరి 2020 | 20 పేజీలు | ధర: రూ.3.00


శుభోదయం: కలియుగం-5121 • శాలివాహన శకం-1941 • శ్రీ చాంద్రమాన వికారి నామ సంవత్సరం • దక్షిణాయనం • హేమంతఋతువు • పుష్య మాసం • శుక్లపక్షం • తిథి: శుద్ధ త్రయోదశి రా.2.26 • నక్షత్రం: రోహిణి మ.2.44 • శేషవర్జ్యం: ఉ.8.03 వరకు, తిరిగి రా.8.26నుండి 10.03 వరకు • దుర్ముహూర్తం: ఉ.11.36 నుండి 12.24 వరకు • రాహుకాలం: ఉ.12.00 నుండి 1.30 వరకు



వైకుంఠ ద్వాదశి పురస్కరించుకుని మంగళవారం తిరుమలో శ్రీవారికి చక్రస్నానం 6



# 'నిర్భయ' దోషులకు 22న ఉరి

## డెత్ వారెంట్ జారీ చేసిన పటియాలా హౌస్ కోర్టు

న్యూఢిల్లీ, జనవరి 7: దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించి, ఏడేళ్లుగా దోషులకు శిక్ష ఎప్పుడు పడుతుందా అన్న ఉత్కంఠ రేపుతున్న నిర్భయ హత్యాచారం కేసులో ఎట్టకేలకు డెత్ వారెంట్ జారీ అయింది. నలుగులు దోషులకు ఈనెల 22వ తేదీ ఉదయం 7 గంటలకు ఉరి తీయాల్సిందిగా పటియాలా హౌస్ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ముఖేష్ (32), పవన్ గుప్తా (25), వినయ్ శర్మ (26), అక్షయ్ కుమార్ (25) సింగ్ (31)కు ఉరి శిక్షను అమలు చేయాలని కోర్టు ఇచ్చిన డెత్ వారెంట్‌పై నిర్భయ తల్లి స్పందిస్తూ, ఇన్నేళ్లకు తన కుమార్తెకు న్యాయం జరిగిందని వ్యాఖ్యానించారు. దేశ వ్యాప్తంగా కూడా ఈ వార్తపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. విచారణ సమయంలో, ఈ కేసులో నలుగులు నిందితులకు రాష్ట్రపతి క్షమాభిక్షసహా అందుబాటులో ఎలాంటి న్యాయ పరమైన ప్రక్రియలు లేదా అంశాలు లేవనీ, కాబట్టి వెంటనే డెత్ వారెంట్‌ను జారీ చేయాలని ప్రాసిక్యూషన్ వాదనకు డిఫెన్స్ లాయర్లు అడ్డు తగిలారు. తమ క్లయింట్ల వద్ద ఇంకా కొన్ని మార్గాలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రత్యేకించి ముఖేష్, వినయ్‌కి సంబంధించిన కొన్ని పత్రాలు అందాల్సి ఉందని, ఆతర్వాత క్యూరేటివ్ పిటిషన్ దాఖలు చేస్తామని అన్నారు. అయితే, ప్రాసిక్యూషన్ న్యాయవాదులు ఈ అభ్యంతరాలను తోసిపుచ్చారు. క్యూరేటివ్ పిటిషన్లు ఉన్నప్పటికీ, డెత్ వారెంట్‌ను జారీ చేయవచ్చన్న విషయాన్ని న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లారు. ఉన్నత కోర్టుల్లో సవాలు చేయడం నుంచి రాష్ట్రపతి క్షమాభిక్ష వరకూ అన్ని ప్రయత్నాలు పూర్తయ్యాయి కాబట్టి, వారెంట్ జారీ చేయడానికి ఎలాంటి ఆటంకాలు లేవని స్పష్టం చేశారు. ప్రాసిక్యూషన్ వాదనతో పటియాలా హౌస్ కోర్టు ఏకీభవించింది. డెత్ వారెంట్‌ను జారీ చేసింది. న్యాయపరమైన అంశాలు లేదా మార్గాలు ఇంకా ఏవైనా మిగిలి ఉండే రెండు వారాల్లోగా దాఖలు చేసుకోవాలని ప్రతివాదుల తరఫు లాయర్లకు సూచించింది. అంతకు ముందు, నిర్భయ కేసులో దోషులకు ఉరి శిక్షను అమలు చేసేందుకు వీలుగా వారెంట్‌ను జారీ చేయాల్సిందిగా ఆమె తల్లిదండ్రులు పటియాలా పిటిషన్‌ను దాఖలు చేశారు. దీనిపై కోర్టు వెంటనే స్పందించింది. నలుగురు దోషులు రాష్ట్రపతికి చేసుకున్న క్షమాభిక్ష పిటిషన్ పెండింగ్‌లో ఉన్నదా? లేదా? అనే విషయాన్ని ఖరారు చేసుకోవాల్సిందిగా తీహార్ జైలు అధికారులను పటియాలా హౌస్ కోర్టు ఆదేశించింది. లేదన్న సమాధానం వచ్చిన తర్వాత, ఇతరత్రా అంశాలను కూడా పరిశీలించింది. ఢిల్లీ సెషన్స్ కోర్టు, హై కోర్టు, సుప్రీం కోర్టు కూడా ఉరి శిక్షను - మిగతా 6లో

## న్యాయ వ్యవస్థపై నమ్మకం పెరుగుతుంది



న్యూఢిల్లీ, జనవరి 7: తన కుమార్తెపై దారుణానికి ఒడిగట్టిన దోషులను ఉరి తీస్తే, న్యాయ వ్యవస్థ పట్ల ప్రజలకు, ప్రత్యేకించి మహిళలకు నమ్మకం ఏర్పడుతుందని నిర్భయ తల్లి ఆశా దేవి వ్యాఖ్యానించింది. మంగళవారం పటియాలా హౌస్ కోర్టు నలుగురు దోషులకు డెత్ వారెంట్‌ను జారీ చేసిన తర్వాత ఆమె విలేఖరులతో మాట్లాడుతూ ఈనెల 22న, దోషులకు మరణ శిక్ష అమలు జరిగిన తర్వాత, ఆ రోజు తన జీవితంలోనే చిరస్మరణీయమైనదిగా ఉండిపోతుందని పేర్కొంది. డెత్ వారెంట్‌ను జారీ చేసిన అడిషనల్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి సతీష్ కుమార్ అరోరాకు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది.

## బీజేపీలోకి మోత్కుపల్లి

• నడ్డా సమక్షంలో పార్టీలో చేరిక



బీజేపీ తాత్కాలిక అధ్యక్షుడు జేపీ నడ్డా సమక్షంలో ఢిల్లీలో మంగళవారం పార్టీలో చేరుతున్న మోత్కుపల్లి నర్సింహులు. చిత్రంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్, ఎంపీ సుజనా చౌదరి 6

## మున్సిపోల్స్‌కు గ్రీన్ సిగ్నల్

• ఎన్నికల పిటిషన్లను కొట్టేసిన హైకోర్టు

• తప్పులు సవరించుకోమన్న సింగిల్ బెంచ్

**ఆంధ్రభూమి బ్యూరో**

హైదరాబాద్, జనవరి 7: రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఎన్నికల షెడ్యూలుకు సంబంధించి దాఖలైన అన్ని పిటిషన్లను కొట్టివేసింది. దాంతో గతంలోనే షెడ్యూలు విడుదల చేసిన ఎన్నికల కమిషన్ తదుపరి దశకు చేరుకుంది. ఎన్నికల నోటిఫికేషన్‌ను సైతం విడుదల చేసింది. వనపర్తి మున్సిపాలిటీ, మహబూబ్‌నగర్ మున్సిపాల్టీల ఎన్నికలపై మాత్రం హైకోర్టు సింగిల్ బెంచ్ తప్పులను సవరించుకోమని ఆదేశించింది. దీంతోపాటు కరీంనగర్ కార్పొరేషన్‌లోని కొన్ని డివిజన్ల ఎన్నికలపై కూడా పొరపాట్లు సరిదిద్దుకోవాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. రిజర్వేషన్ల ప్రక్రియను సక్రమంగా అమలు చేయలేదన్న పిటిషనర్ల వాదనలతో సింగిల్ బెంచ్ ఏకీభవించింది. దాంతో ఈ మున్సిపాల్టీలను విడిచిపెట్టి మిగిలిన వాటికి నోటిఫికేషన్‌కు ఎన్నికల కమిషన్ ఏర్పాట్లు చేస్తున్నట్టు సమాచారం. అవసరమైతే నామినేషన్ల గడువు వరకూ సమయం తీసుకుని పొరపాట్లు దిద్దుకోవాలని సింగిల్ బెంచ్ సూచించింది. గతంలోనే మున్సిపల్ ఎన్నికలపై హైకోర్టు వివిధ బెంచ్‌లు స్టే విధించగా, వాటన్నింటినీ ప్రధాన న్యాయమూర్తి బెంచ్ ముందు ప్రభుత్వం వాదనలు వినిపించి స్టే తొలగించి ఎన్నికలకు ఏర్పాట్లు చేశారు. అయితే ఎన్నికల షెడ్యూలును కమిషన్ ప్రకటించిన వెంటనే పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ కుమార్ రెడ్డి తదితరులు వేర్వేరు పిటిషన్లు దాఖలు చేస్తూ రిజర్వేషన్లు ఖరారు చేసిన తర్వాత వాటిపై అభ్యంతరాలను చెప్పేందుకు కనీసం వారం రోజులు గడువు ఇవ్వాలని పేర్కొన్నారు. దీనిపై ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ వాదనలు వినిపించాయి. అందరి అనుమానాలను నివృత్తి చేసినట్టు ప్రభుత్వం పేర్కొనడంతో అన్ని పిటిషన్లను హైకోర్టు కొట్టివేసింది. దాంతో ఎన్నికల నిర్వహణకు మార్గం సుగమమైంది.

# షెడ్యూల్ ప్రకారమే 'పుర' పోరు

## 9 కార్పొరేషన్లు, 120 మున్సిపాలిటీలు

• డోలాయమానంలో కరీంనగర్ కార్పొరేషన్

• నోటిఫికేషన్ జారీ • ప్రకటించిన ఎస్ఈసీ



**ఆంధ్రభూమి బ్యూరో**

హైదరాబాద్, జనవరి 7: రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఇటీవల ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే ఎన్నికలు నిర్వహిస్తామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వి. నాగిరెడ్డి స్పష్టం చేశారు. ఎన్నికల కమిషన్ కార్యాలయంలో మంగళవారం రాత్రి మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ, మంగళవారం సాయంత్రం హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను దృష్టిలో ఉంచుకుని తాజాగా ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేశామన్నారు. ఈ నోటిఫికేషన్‌లో కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌ను తొలగించారు. ఇటీవల జారీ చేసిన షెడ్యూల్‌లో కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఉండగా, ఇప్పుడు దీనిని తొలగించారు. అంటే తొమ్మిది మున్సిపల్ కార్పొరేషన్లు, 120 మున్సిపాలిటీలకు ఎన్నికలు నిర్వహించేందుకు వీలుగా నోటిఫికేషన్ జారీ అయింది. కరీంనగర్ పట్టణంలో ఓటర్ల జాబితాలో తప్పులు ఉన్నాయని హైకోర్టు గుర్తించిందని, అందుకే ఈ కార్పొరేషన్‌కు ఇప్పటికిప్పుడే నోటిఫికేషన్ ఇవ్వలేదని స్పష్టం చేశారు. మున్సిపల్ శాఖను ఈ అంశంపై వివరణ కోరామని, మంగళవారం అర్థరాత్రిలోగా సరైన సమాధానం వస్తే, కరీంనగర్ కార్పొరేషన్‌కు ప్రత్యేకంగా నోటిఫికేషన్ జారీ చేస్తామన్నారు. లేకపోతే తర్వాత తేదీ ప్రకటించి ఎన్నికలు నిర్వహిస్తామని నాగిరెడ్డి వివరించారు.

ఇలాఉండగా హైదరాబాద్ గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) 13వ వార్డు (దబీర్‌పురా)కు కూడా - మిగతా 6లో

## అమాత్యులకు గండం లేనట్టే!

• ఒకరిద్దరికి మాత్రం వెన్నుపోటుపై భయం

• మంత్రుల పరిధిలో గెలుపు నల్లేరు మీద నడకే..

**ఆంధ్రభూమి బ్యూరో**

హైదరాబాద్, జనవరి 7: మున్సిపల్ ఎన్నికల్లో ఎక్కడైనా తేడా వస్తే మంత్రి పదవులు ఊడుతాయంటూ టీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు చేసిన హెచ్చరికతో మంత్రుల్లో భయాందోళనలు నెలకొన్నాయి. ఒక్క పార్లమెంట్ ఎన్నికల్లో మినహా మిగతా పంచాయతీ, పరిషత్, జిల్లా పరిషత్ అన్ని ఎన్నికల్లోనూ టీఆర్ఎస్ తిరుగులేని అధిపత్యాన్ని కొనసాగించింది. తాజాగా మున్సిపల్ ఎన్నికలు రావడంతో గతం లో జరిగిన ఎన్నికల మాదిరిగా అన్ని స్థానాలను గెలుచుకోవడానికి మంత్రు లు తమ సర్వశక్తులను ఒడ్డుతున్నారు. సీఎం చేసిన హెచ్చరిక రెండువైపులా పదునున్న కత్తిగా పరిణమించింది. మంత్రులు తమ పరిధిలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను గెలుచుకోవడం ద్వారా తమ పదవిని పదిలపరుచుకోవడం కత్తికి ఒకవైపు కాగా, మరోవైపు ఈ ఎన్నికల్లో పార్టీని ఓడిస్తే ప్రస్తుత మంత్రిని పక్కకు తప్పిస్తే తమకు అవకాశం దక్కుతుందన్న లాజిక్కుతో సొంత పార్టీవారే వెన్నుపోటు పొడిచే అవకాశం లేకపోలేదన్న భయాందోళనలు కూడా వారిలో నెలకొన్నాయి. ఇలాఉండగా జిల్లాల విభజన వల్ల మెజారిటీ మంత్రుల పదవి గండం తప్పిందనే చెప్పవచ్చు. కొత్త జిల్లాల ఏర్పాటు తర్వాత ఉమ్మడి జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలకు కాకుండా కేవలం తమ జిల్లాల్లో గెలిస్తే చాలని మంత్రులు భావిస్తున్నారు. మున్సిపాలిటీలను గెలుచుకోవడం మంత్రులకు పెద్ద కష్టమేమీ కాదు. తమ ప్రభుత్వానికి ఇంకా నాలుగేళ్ల కాలపరిమితి ఉండడంతో ప్రజలు పాలక పక్షానికి వ్యతిరేకంగా ఓటు వేయరని మంత్రులు ధీమాగా ఉన్నారు. అయితే మున్సిపల్ కార్పొరేషన్లలో మాత్రమే నగర ప్రాంత ప్రజలు ఎటువైపు మొగ్గ - మిగతా 6లో

## ఫనగామా





నిన్న కొనడానికే కన్నీళ్లు పెట్టుకున్నారు.. ఇక ఆనందంగా తినండమ్మా!!

# 13న ఇద్దరు ముఖ్యమంత్రుల భేటీ

• తాజా రాజకీయాలు, విభజన అంశాలు, నదీ జలాల పంపిణీపై కేసీఆర్, జగన్ చర్చ

**ఆంధ్రభూమి బ్యూరో**



హైదరాబాద్, జనవరి 7: తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు, వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఈ నెల 13న మరోసారి హైదరాబాద్‌లో భేటీ కాబోతున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం ప్రగతిభవన్ వీరి భేటీకి వేదిక కానుంది. ఇదివరకు వీరిద్దరు రెండు పర్యాయాలు భేటీ అయిన విషయం తెలిసిందే. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పరిపాలన వికేంద్రీకరణ కోసం మూడు రాజధానుల ఏర్పాటుపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ ప్రకటన చేశాక జరుగబోతున్న వీరి భేటీకి రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. వీరి భేటీలో ఆంధ్రప్రదేశ్ రాజధాని మార్పు అంశం కూడా చర్చకు వచ్చే అవకాశం ఉంటుందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇలాఉండగా గోదావరి జలాలను కృష్ణా బేసిన్‌కు తరలించే అంశంపై గతంలో ఈ ఇద్దరు సీఎంల భేటీల్లో ప్రధానంగా చర్చ జరిగింది. ఇరు రాష్ట్రాల ఇంజనీరింగ్ నిపుణులతో కమిటీ ఏర్పాటు చేసి సాధ్యాసాధ్యాలపై నివేదిక కోరిన విషయం తెలిసిందే. అయితే ఆ తర్వాత మళ్లీ వీరి మధ్య భేటీ జరగలేదు. కాగా, అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం, తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి ఇద్దరి మధ్య కూడా సమావేశాలు జరిగాయి. అయితే ప్రస్తుతం వీరిద్దరూ మారారు. ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నీలం సహానీ, తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా సోమేష్ కుమార్ బాధ్యతలు చేపట్టిన తర్వాత మళ్లీ వీరి మధ్య పెండింగ్‌లోని అంశాలపై కూడా సమావేశం జరగాల్సి ఉంది. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం ఇరు రాష్ట్రాల మధ్య ఇంకా వివిధ సంస్థల విభజన జరగాల్సి ఉంది. షెడ్యూల్ 9, 10 ఆస్తులకు సంబంధించి ఇరు రాష్ట్రాల మధ్య వివాదం ఏర్పడడంతో పలు సంస్థల విభజన, - మిగతా 6లో

# గ్రేటర్ రాయలసీమలోనే ఆంధ్ర రాజధాని

## హైపవర్ కమిటీని కోరిన 'సీమ' నేతలు

**ఆంధ్రభూమి బ్యూరో**

హైదరాబాద్, జనవరి 7: గ్రేటర్ రాయలసీమ వాసులు తెలుగు వారి ఐక్యతకు చేసిన త్యాగాలను గుర్తించి, వారి మనోభావాలకు అనుగుణంగా గ్రేటర్ రాయలసీమకు రాజధానిని సిఫార్సు చేస్తారని విశ్వసిస్తున్నట్లు ఆ ప్రాంతానికి చెందిన పలువురు రాజకీయ ప్రముఖులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సమర్పించిన వినతిపత్రంపై మాజీ ఎంపీ డాక్టర్ ఎంవీ మైసూరారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ శైలజానాథ్, ఆర్ చెంగారెడ్డి, కే మదన మోహన్ రెడ్డి, కే మధుసూదన గుప్తా, డాక్టర్ వీ శివరామకృష్ణారావు, మాజీ డీజీపీలు ఆంజనేయ రెడ్డి, దినేష్ రెడ్డి తదితరులు ఉన్నారు. తాము రాష్ట్రప్రభుత్వం ఏర్పాటు చేసిన హైపవర్ కమిటీకి వినతిపత్రం పంపినట్లు వారు చెప్పారు. పరిపాలన వికేంద్రీకరణలో భాగంగా జీఎన్ రావు కమటీ, బోస్టన్ కన్సల్టింగ్ గ్రూపులు రెండు నివేదికలను పరిశీలించి తగిన సిఫార్సులు చేయాలని వారు కోరారు. ఈ కమిటీలో గ్రేటర్ రాయలసీమకు చెందిన ముగ్గురు మంత్రులు ఉన్నారు. మిగతా వారు ఆంధ్రాప్రాంతానికి చెందిన వారున్నారు. గ్రేటర్ రాయలసీమ వాసులు తెలుగువారి ఐక్యతకు చేసిన త్యాగాలను గుర్తించి, వారి మనోభావాలకు అనుగుణంగా ఒక్కటిగా సీమకు రాజధానిని సిఫార్సు చేయాలని వారు కోరారు. ఉమ్మడి మద్రాసు రాష్ట్రం నుంచి తెలుగువారు ప్రత్యేక రాష్టంగా కావాలని - మిగతా 6లో

# ఇంటర్ బోర్డులో ఆన్‌లైన్ నెట్‌వర్క్ ప్రారంభం

**ఇక విద్యార్థులకు అన్నీ ఆన్‌లైన్‌లోనే పరిష్కారం ◆ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేష్‌కుమార్**

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 7: ఇంటర్మీడియట్ విద్యా వ్యవస్థకు సంబంధించి అన్ని రకాల సమస్యల పరిష్కారానికి వీలుగా ఇంటర్మీడియట్ విద్యా మండలి ఒక ఆన్‌లైన్ వ్యవస్థను సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ సహకారంతో ఏర్పాటుచేసింది. ఈ వ్యవస్థను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేష్‌కుమార్ మంగళవారం ఉదయం ప్రారంభించారు. ఈ వ్యవస్థ ద్వారా ఇంటర్ విద్యావ్యవస్థకు సంబంధించి అన్ని రకాల సమస్యలను, ఫిర్యాదులను సుదూర ప్రాంతాల నుండి ఆన్‌లైన్ వ్యవస్థ ద్వారా త్వరితగతిన పరిష్కరించుకోవచ్చని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేష్‌కుమార్ పేర్కొన్నారు. ఈ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు ఇంటర్మీడియట్ విద్యామండలి ద్వారా సాంఘిక మాధ్యమాలైన ఫేస్‌బుక్, ట్విట్టర్, వాట్సప్, జీమెయిల్, బీఐఈ వెబ్ సైట్, బీఐఈ కాల్ సెంటర్, బీఐఈ హెల్ప్‌డెస్క్‌లకు అనుసంధానించినట్టు పేర్కొన్నారు. ఈ వ్యవస్థలో ఫిర్యాదు నమోదుకాగానే ఫిర్యాదు చేసిన వ్యక్తి సెల్‌ఫోన్‌కు సమాచారం అందుతుందని, ఇంటర్మీడియట్ విద్యావ్యవస్థలోని అధికారులు నమోదైన ఫిర్యాదులను నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరిస్తారని అన్నారు. ఫిర్యాదుల పరిష్కరణ వివరాల స్థితిగతులను కూడా ఫిర్యాదుదారుడికి ఎప్పటికపుడు తెలియజేస్తారని అన్నారు. బీఐజీఆర్‌ఎస్ అప్లికేషన్ పేరుతో పిలిచే ఈ వ్యవస్థ బీఐజీఆర్‌ఎస్ డాట్ తెలంగాణ డాట్ జీవోవీ డాట్ ఇన్ పేరుతో ఉంటుందని ఫిర్యాదు దారుడు ఫోన్ నెంబర్‌ను తొలుత నమోదు చేయాలని, దానికి ఒక ఓటీపీ వస్తుందని, వెంటనే దానిని వాలిడేట్ చేసి ఫిర్యాదును నమోదు చేయాల్సి ఉంటుందని అధికారులు చెప్పారు. ఫిర్యాదు నమోదు చేసిన వెంటనే సబ్మిట్ బటన్ నొక్కాలని అపుడు నమోదవుతుందని వివరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేష్‌కుమార్, విద్యాశాఖ కార్యదర్శి జనార్ధనరెడ్డి, ఇంటర్ బోర్డు కార్యదర్శి సయ్యద్ ఒమర్ జలీల్

ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ పరీక్షల నిర్వహణలో అన్ని జాగ్రత్తలనూ పాటించాలని పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణలోనూ, జవాబుపత్రాల మూల్యాంకనంలోనూ ప్రత్యేక శ్రద్ధ వహించాలని చెప్పారు. గతంలో జరిగిన పొరపాట్లు పునరావృత్తం కాకుండా తగిన చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రభుత్వం నియమించిన త్రిసభ్య కమిటీ సూచనలను ఇంటర్ బోర్డు, ఎస్సెస్సీ బోర్డులు అధ్యయనం చేసి పూర్తి స్థాయిలో అమలుచేయడంతో పాటు పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి అదనపు చర్యలు కూడా తీసుకోవాలని అన్నారు.

జవాబుపత్రాలు దిద్దే ప్రతి ఒక్కరికీ పూర్తి స్థాయి శిక్షణ అందించి గత ఏడాది జరిగిన తప్పులపై అవగాహన కల్పించి, ఏ ఒక్క విద్యార్థీ నష్టపోకుండా చూడాలని ఆయన అధికారులకు సూచించారు. సమాధాన పత్రాలను దిద్దడంపై మంచి శిక్షణ కల్పించాలని, ప్రతి ఇవాల్యూయేటర్‌ను చైతన్య పరచాలని చెప్పారు. ఈ సమావేశంలో విద్యాశాఖ కార్యదర్శి బీ జనార్ధనరెడ్డి, ఇంటర్ బోర్డు కార్యదర్శి సయ్యద్ ఒమర్ జలీల్, బోర్డు సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

# నేడు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె

**ట్రేడ్ యూనియన్లు, వామపక్షాల మద్దతు**

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 7: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 8న దేశ వ్యాప్త సమ్మెకు కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. కేంద్రం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా, జాతి వ్యతిరేక విధానాలకు నిరసనగా నిర్వహించే ఈ సమ్మెలో దేశంలో 25 కోట్ల మంది పాల్గొంటారని ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, సీఐటీయూ, టీయుసీసీ తదితర సంఘాలు పేర్కొన్నాయి. కార్మికుల డిమండ్లపై భరోసా ఇవ్వడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని, కేంద్ర వైఖరికి నిరసనగా 8న అఖిల భారత సమ్మె చేపట్టనున్నట్టు 10 కేంద్ర కార్మిక సంఘాలు పేర్కొన్నాయి. విద్యాసంస్థల్లో పెరిగిన ఫీజులు, విద్య వ్యాపారీకరణకు వ్యతిరేకంగా మరో 60 విద్యార్థి సంఘాలు , విశ్వ విద్యాలయాల సంఘాలు సైతం ఈ సమ్మెలో పాల్గొంటున్నాయి. ఈ సమ్మె కారణంగా పలు రకాల సేవలు నిలిచిపోనున్నాయి. ముఖ్యంగా బ్యాంకింగ్, రవాణా రంగాలపై ఇది తీవ్ర ప్రభావం చూపుతుందని చెబుతున్నారు. తెలంగాణ రాష్ట్రంలో సమ్మెకు మద్దతు పలుకుతున్నట్టు వామ పక్ష పార్టీలు, ట్రేడ్ యూనియన్ సంఘాలు ప్రకటించాయి. దేశవ్యాప్త సమ్మెకు మున్సిపల్ ఎన్నికల కోడ్ అడ్డంకి కాదని సీఐటీయూ అధ్యక్షుడు చుక్క రాములు, ప్రధానకార్యదర్శి ఎం సాయిబాబులు పేర్కొన్నారు. దేశవ్యాప్త సమ్మెకు స్థానిక మున్సిపల్ ఎన్నికల కోడ్ ఎలా అడ్డంకి అవుతుందని వారు ప్రశ్నించారు. మున్సిపల్ ఎన్నికల పేరుతో పోలీసులు అడ్డుకోవద్దని వారు పేర్కొన్నారు.

దేశవ్యాప్తంగా 200 సంఘాలు ఆధ్వర్యంలో జరిగే గ్రామీణ బంద్‌లో పాల్గొని బంద్‌ను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం, ప్రజా సంఘాల ప్రతినిధులు కోరినట్టు సమన్వయ కమిటీ కార్యదర్శి టీ సాగర్ తెలిపారు.



వరంగల్‌లో టెక్ మహీంద్రా ఐటీ కంపెనీని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న మంత్రి కేటీఆర్

# ఐటీ విస్తరణకు బీజం

**★ పారిశ్రామిక కారిడార్‌గా హైదరాబాద్-వరంగల్**

**★ మెగా టెక్స్‌టైల్ పార్క్‌తో 12 వేల మందికి ఉద్యోగాలు**

**★ త్వరలో హెలీపోర్టు సర్వీసులు ★ మంత్రి కేటీఆర్**

ఆంధ్రభూమి బ్యూరో

వరంగల్, జనవరి 7: హైదరాబాద్ తర్వాత రెండవ అతిపెద్ద నగరంగా గుర్తింపు ఉన్న వరంగల్‌లో ఐటీ విస్తరణకు బీజం పడిందని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. వరంగల్ నగర శివారులోని మడికొండ ఐటీ సెజ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన టెక్ మహీంద్రా ఐటీ ఇంక్యూబేటర్‌ను, సైయింటు ఐటీ సెజ్ శిలాఫలకం, భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, ఈటల రాజేందర్, ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ ఐటీ విస్తరణలో భాగంగా వరంగల్ నగరానికి ఇది ఆరంభం మాత్రమేనని ఆయన అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం బహుముఖ వ్యూహంతో ముందుకు వెళ్తుందని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని ద్వితీయ శ్రేణీ నగరాలకు ఐటీ రంగాన్ని విస్తరించనున్నట్టు కేటీఆర్ తెలిపారు. ఈ ఏడాదిలో ద్వితీయ నగరాలైన కరీంనగర్, మహబూబ్‌నగర్, నిజామాబాద్, ఖమ్మం, నల్గొండలో ఐటీ రంగాన్ని విస్తరింపచేస్తామని ఆయన తెలిపారు. దేశంలోనే అతిపెద్ద ఐటీ దిగ్గజం టెక్ మహీంద్రాలో మరిన్ని ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఆయన అన్నారు. వరంగల్‌లో ఐటీ రంగం ఊహించిన దానికంటే ఎక్కువగా ఉంటుందని అన్నారు. ఐటీ రంగాన్ని అభివృద్ధి పరిచేందుకు వీలుగా రవాణా రంగాన్ని కూడా మెరుగుపర్చాలనే ఉద్దేశంతో గత కొన్ని సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న వరంగల్ ఎయిర్‌పోర్టును ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటూనే త్వరలోనే హైదరాబాద్ నుండి వరంగల్‌కు హెలీపోర్టు సర్వీసులను ప్రారంభిస్తామని మంత్రి అన్నారు. అంతేకాకుండా హైదరాబాద్ ఉప్పల్ వద్ద నిర్మిస్తున్న స్కై బ్రిడ్జీలతో వరంగల్-హైదరాబాద్ రవాణా మార్గం మరింత మెరుగుపడుతుందని అన్నారు. వరంగల్‌లో నిర్మిస్తున్న కాకతీయ టెక్స్‌టైల్ పార్కుకు పెట్టుబడులు పెట్టేందుకు కొరియా దేశం నుండి వస్తున్నారని అన్నారు. దీని ద్వారా 12 వేల మందికి ఉద్యోగ అవకాశాలు దొరకనున్నాయని అన్నారు. అదే విధంగా గ్రామీణ ప్రాంతాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను పారిశ్రామికంగా అభివృద్ధి చేయనున్నట్టు తెలిపారు. వరంగల్ నగరాన్ని ఐటీ పరంగానే కాకుండా పారిశ్రామిక రంగంలోనూ త్వరలోనే అభివృద్ధి జరగనుందని దీని కోసం ఇప్పటికే ప్రణాళికలు రూపొందించినట్టు తెలిపారు. వరంగల్‌లో మానవ వనరుల నైపుణ్యం పుష్కలంగా ఉందని మంత్రి అన్నారు. హైదరాబాద్ నుండి వరంగల్ వరకు పారిశ్రామిక కారిడార్‌గా ఏర్పాటు కాబోతుందని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం దృఢ సంకల్పంతో పనిచేస్తుందని అన్నారు. రాష్ట్రంలో త్వరలోనే రెండవ హరితవిప్లవం రాబోతుందని అన్నారు. కాలంతో పోటీ పడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తవుతుందని, సాగు, తాగునీటి విషయంలో ముఖ్యమంత్రి కేసీఆర్ విజన్ దేశానికి ఆదర్శంగా నిలువబోతుందని తెలిపారు. రాష్ట్రంలో నిరుద్యోగ నిర్మూలనకు విప్లవాత్మకమైన మార్పులతో టీఎస్ ఐపాస్ ద్వారా పెట్టబడులకు రెడ్‌కార్పెట్ పరుస్తున్నామని వెల్లడించారు. వేలాదిగా రానున్న ఉద్యోగ అవకాశాలలో సింహభాగం మన పిల్లలకే ఉద్యోగాలు దక్కలన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన ఈచ్ వన్, టీచ్ వన్ నినాదంతో విద్యార్థులలో నైపుణ్యాన్ని పెంపొందించాలని దీని కోసం ప్రజా ప్రతినిధులు ఎక్కడికక్కడ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను ఏర్పాటు చేయాలని మంత్రి కేటీఆర్ సూచించారు. రాష్ట్ర అభివృద్ధిలో ప్రభుత్వంతో కలిసి ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలన్నారు. ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ కరీంనగర్‌లో ఐటీ సెంటర్‌ను ప్రారంభించి పదివేల మంది గ్రామీణ ప్రాంతాల పిల్లలకు ఉపాధి కల్పించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టెక్ మహీంద్రా సీఈవో గురునాని, సైయింట్ ఎండీ నర్సింహారెడ్డి, ఎమ్మెల్యేలు ఆరూరి రమేష్, డాక్టర్ రాజయ్య, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## 418 మంది పోలీసులకు మెడల్స్

**నేడు రవీంద్రభారతిలో ప్రదానం**

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 7: తెలంగాణ రాష్ట్రంలో విశిష్ట సేవలు అందించిన 418 మంది పోలీసు అధికారులకు ప్రభుత్వం పోలీసు మెడల్స్‌ను అందజేయనున్నది. ఈ క్రమంలో పోలీస్ శాఖలో విశేషమైన సేవలందించినందుకు గాను అంధించే అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రెసిడెంట్ పోలీస్ మెడల్ ఫర్ గ్యాలెంటరీ (పీపీఎంజీ), పోలీస్ మెడల్స్ ఫర్ గ్యాలంటరీ, ప్రెసిడెంట్ పోలీస్ మెడల్ (పీపీఎమ్), ముఖ్యమంత్రి మహోన్నత సేవా పతకాలు, ముఖ్యమంత్రి మహోన్నత పోలీస్ పతకం, శౌర్య పతకాలతో పాటు సేవా పతకాలు, ఉత్తమ సేవ పతకాలు, పోలీసు పతకాలు బహుకరించనున్నారు. రవీంద్ర భారతి ఆడిటోరియంలో బుధవారం సాయంత్రం ఐదు గంటలకు నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో ఈ మెడల్స్‌ను ప్రధానం చేస్తారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హోం మంత్రి మహ్మద్ మహమూద్ అలీ ముఖ్యఅతిథిగా విచ్చేస్తారు. ఈ కార్యక్రమంలో డీజీపీ ఎం.మహేందర్‌రెడ్డితో పాటు పలువురు సీనియర్ పోలీసు అధికారులు పాల్గొంటారు.

# ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలకు ప్రాధాన్యం

**పంటల ఉత్పత్తులు పెరుగుతున్నాయి ◆ రైతుకు ఎంఎస్పీ ◆ వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి**

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 7: తెలంగాణ ప్రభుత్వం ఫుడ్‌ప్రాసెసింగ్ పరిశ్రమలకు ప్రాధాన్యత ఇస్తోందని తెలంగాణ వ్యవసాయ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి తెలిపారు. 'లాభదాయకంగా వ్యవసాయం' అంశంపై కేరళలోని త్రిసూర్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన అంతర్జాతీయ సదస్సులో ఆయన ప్రసంగించారు. తెలంగాణలో రైతులు ఆర్థికంగా లాభపడాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేసిన తర్వాత పెండింగ్ నీటిపారుదల ప్రాజెక్టులను పూర్తి చేశామన్నారు. చైనాలో 'త్రీ గోర్జెస్ డ్యాం' కన్నా వేగంగా తెలంగాణలో గోదావరి నదిపై కాళేశ్వరం ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేశామన్నారు. రైతుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు రైతుబంధు పథకం కింద ఎకరాకు ఏటా 10 వేల రూపాయలు ఇస్తున్నామన్నారు. అలాగే రైతులు ఏ కారణం చేతనైనా చనిపోతే రైతు బీమా పథకం కింద ఐదు లక్షల రూపాయలు వారి కుటుంబానికి 15 రోజుల్లోగా అందిస్తున్నామని తెలిపారు. మిషన్ కాకతీయ పథకం చేపట్టి రాష్ట్రంలోని 45 వేల చెరువులు, కుంటలకు మరమ్మతులు చేశామన్నారు. అలాగే బావుల కింద సేద్యం చేస్తున్న రైతులకు సేద్యం కోసం ఉచితంగా విద్యుత్తు ఇస్తున్నామన్నారు. వ్యవసాయ యాంత్రీకరణ, పాలీహౌజ్‌ల నిర్మాణం, సూక్ష్మ సేద్యానికి ప్రోత్సాహం (ఎంఐపీ) ఇవ్వడం వల్ల ఆధునిక విధానాల్లో పంటల ఉత్పత్తికి వీలవుతోందన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో గత ఐదేళ్లలో ఆహార పంటల ఉత్పత్తి గణనీయంగా పెరిగిందని, దానికి తగ్గట్టు ఆహార పదార్థాల ప్రాసెసింగ్ కోసం యూనిట్లు ఏర్పాటుకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. దాంతో రైతులు పండిస్తున్న పంటల అమ్మకం సులువైందని, ప్రతి పంటకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) ఇస్తున్నామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

రాష్ట్ర పారిశ్రామిక పాలసీలో ఉన్న 14 అంశాల్లో ఆహార శుద్ధి పరిశ్రమలు కూడా ఉన్నాయని చెబుతూ, సేద్యానికి తమ ప్రభుత్వం ఎంత ప్రాధాన్యత ఇస్తుందో స్పష్టమవుతోందన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల స్థాపనపై అధ్యయనం చేసేందుకు సంబంధిత అధికారులతో ఉన్నతస్థాయి కమిటీని వేశామన్నారు. త్వరలోనే ఒక పాలసీని తెస్తామని ప్రకటించారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు చేశామని, ఇందుకోసం ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం ఇస్తున్నామని మంత్రి నిరంజన్‌రెడ్డి తెలిపారు.

ఈ సమావేశంలో కేరళ వ్యవసాయ మంత్రి వీఎస్ సునీల్ కుమార్, కేరళ చీఫ్ విప్ కె. రాజన్, ప్రభుత్వ అదనపు ముఖ్యకార్యదర్శి, వ్యవసాయ ఉత్పత్తుల కమిషనర్ దేవేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# చైనీస్ మాంజాపై నిషేధం

**◆ అమ్మినా, నిలువ చేసినా ఐదేళ్ల జైలుశిక్ష ◆ రవాణా చేస్తే వాహనాలను సీజ్ చేస్తాం**

**◆ అటవీ శాఖ ఉన్నతాధికారి శోభ**



సమావేశంలో మాట్లాడుతున్న పీసీసీఎఫ్ శోభ

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 7: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా చైనీస్ మాంజాను వినియోగించినా, అమ్మినా, నిలువ చేసినా ఐదేళ్లపాటు జైలు శిక్ష, లక్ష రూపాయల దాకా జరిమానా ఉంటుందని రాష్ట్ర హెడ్ ఆఫ్ ఫారెస్ట్ ఫోర్స్, పీసీసీఎఫ్ ఆర్. శోభ తెలిపారు. చైనా మాంజా అంశంపై చర్చించేందుకు అరణ్య భవన్‌లో మంగళవారం ఆమె ఉన్నతస్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సంక్రాంతి పండగ సమయంలో పతంగులను ఎగురవేసేందుకు చైనీస్ మాంజాను వినియోగించవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. చైనీస్ మాంజా తీవ్రమైన అనర్థాలకు దారితీస్తోందన్నారు. చైనీస్ మాంజా తయారీకోసం గ్లాస్ కోటింగ్ ఉన్న నైలాన్, సింథటిక్ తాడు వాడుతున్నారని, దాంతో పక్షులు అనేకం చనిపోతున్నాయన్నారు. చైనా మాంజా వల్ల ఇటీవలే దేశంలో నలుగురు ప్రాణాలు కోల్పోయారని, రెండురోజుల క్రితం గుంటూరులో ఒక బాలుడి మెడకు చైనామాంజా చుట్టుకోవడంతో ప్రాణాలు కోల్పోయాడని శోభ గుర్తు చేశారు. పండగ తర్వాత ఎక్కడికక్కడ మాంజా వ్యర్థాలు మిగిలిపోయి దాంట్లో చిక్కుకుని పక్షులు చనిపోతున్నాయని, మనుషులు కూడా గాయపడుతున్నారని తెలిపారు. చైనా మాంజాను నిషేధించాలని 2017 జూలై 11 న జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలు జారీ చేసిందని ఆమె గుర్తు చేశారు. ట్రిబ్యునల్ ఆదేశాల మేరకే చైనా మాంజా రవాణా, విక్రయం, నిలువ చేయడాన్ని, వినియోగించడాన్ని నిషేధించామని శోభ స్పష్టం చేశారు. గత నాలుగేళ్లలో సుమారు వెయ్యి కిలోల చైనా మాంజాను సీజ్ చేశామని పీసీసీఎఫ్ (అడ్మిన్) మునీంద్ర తెలిపారు. చైనా మాంజా వాడకానికి సంబంధించి 123 కేసులు నమోదు చేశామని వివరించారు. ఈ సమావేశంలో స్వచ్ఛంద సేవా సంస్థలు, జంతు ప్రేమికులతో పాటు అటవీ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలో ఎక్కడైనా చైనా మాంజా అమ్మకం, నిలువ తదితరాల గురించి ఎవరికైనా సమాచారం తెలిస్తే అటవీ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 040-2323 1440, 1800 425 5364 నెంబర్లకు ఫోన్ చేయాలని అటవీ శాఖ సూచించింది.

## హామీలను నెరవేర్చడంలో కేసీఆర్ ప్రభుత్వం విఫలం

**సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి**

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 7: ఎన్నికల సమయంలో కేసీఆర్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ఘోరంగా విఫలమైందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి విమర్శించారు. మంగళవారం నాడు ఎండీ మహ్మద్ అధ్యక్షతన సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో చాడ వెంకటరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎన్నికల సమయంలో అర్హులైన పేదలకు డబుల్ బెడ్ రూమ్స్ నిర్మించి ఇస్తామని, ఇంటికో ఉద్యోగం ఇస్తామని, కేజీ నుండి పీజీ వరకూ ఉచిత విద్య అందిస్తామని, నగరాలను అభివృద్ధి చేస్తామని, మౌలిక సదుపాయాలను కల్పిస్తామని అనేక వాగ్దానాలు చేసి ఎన్నికల్లో గెలిచి అధికారం చేపట్టిన తర్వాత వాటిని అమలుచేయడంలో ఘోరంగా విఫలమయ్యారని విమర్శించారు. రాష్ట్రంలో పాఠశాలలు, కళాశాలలు మూసి వేస్తున్నారని, అనేక సంక్షేమ కార్యక్రమాలను అటకెక్కించడంతో ప్రగతి పూర్తిగా నిలిచిపోయిందని విమర్శించారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ మినహా కలిసొచ్చే వామపక్ష, ప్రజాస్వామ్య, లౌకికపార్టీలతో కలిసి పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నామని చాడ వెంకటరెడ్డి స్పష్టం చేశారు. కార్యదర్శివర్గ సభ్యుడు బాలమల్లేష్ మాట్లాడుతూ రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు కార్యకర్తలు సిద్ధం కావాలని అన్నారు.

**12న వామపక్ష పార్టీల రాష్ట్ర సదస్సు**

పౌరసత్వ సవరణ చట్టం, ఎన్‌ఆర్‌సీ, ఎన్‌పీఆర్‌లకు వ్యతిరేకంగా రాష్ట్రంలో దేశంలో జరుగుతున్న ఉద్యమాలపై వామపక్షాలు ఈ నెల 12న సదస్సు నిర్వహించాలని నిర్ణయించినట్టు సీపీఐఎంఎల్ న్యూడెమొక్రసీ రాష్ట్ర నేత పోటు రంగారావు తెలిపారు. మంగళవారం నాడు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన వామపక్షాల సమావేశంలో ఈ మేరకు నిర్ణయించినట్టు చెప్పారు. ఈ నెల 5న జేఎన్‌యూలో విద్యార్థి నేతలపై , అధ్యాపకులపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్టు చెప్పారు. ఈ సంఘటనపై న్యాయవిచారణ జరిపించాలని అన్నారు.

**పునరేకీకరణ విజయానికి సంకేతం**

తెలంగాణ విద్యా, ఉపాధ్యాయ రంగంలో పనిచేస్తున్న మూడు ఉపాధ్యాయ సంఘాలు విడివిడిగా ఉంటూ పోరాటాలు ఉద్యమాలు చేసి హక్కులను సాధించుకోలేమని భావించి టీపీటీఎఫ్, టీటీఎఫ్, టీడీటీఎఫ్ సంఘాలు ఐక్యం కావడం హర్షణీయమని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ బాలరాజ్ పేర్కొన్నారు.

# సార్వత్రిక సమ్మెకు కేసీఆర్ నాయకత్వం వహించాలి

**సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ**

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 7: దేశవ్యాప్తంగా ఈ నెల 8వ తేదీన జరుగుతున్న సార్వత్రిక సమ్మెకు తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వం వహించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కే నారాయణ అన్నారు. మఖ్దూం భవన్‌లో మంగళవారం నాడు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యుడు అజీజ్‌పాషాలతో కలిసి మాట్లాడారు. కేంద్రప్రభుత్వ రైతాంగ, కార్మిక విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా సమ్మె జరుగుతోందని, దీనిపై ముఖ్యమంత్రి కేసీఆర్ తన వైఖరి చెప్పాలని అన్నారు. తెలంగాణ ప్రజల హక్కులను కేంద్ర ప్రభుత్వం వద్ద పణంగా పెడతారా? లేదా పోరాడతారా అనేది స్పష్టం చేయాలని పేర్కొన్నారు. బీజేపీ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యాంగ ఉల్లంఘనలకు పాల్పడుతోందని , సీఏఏకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆందోళనలు జరుగుతున్నాయని, 31మందికి పైగా ఈ ఉద్యమాల్లో చనిపోయారని, సీఏఏకు వ్యతిరేకంగా ఓటు వేసిన టీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్రంలో మాత్రం ఆందోళనలను అణచివేస్తున్నారని అన్నారు. టీఆర్‌ఎస్ వైఖరిని ఇప్పటికైనా స్పష్టం చేయాలని అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీని ఓడించడమే లక్ష్యంగా వామపక్షాలు, కలిసి వచ్చే లౌకిక పార్టీలతో కలిసి పోటీ చేస్తామని, జిల్లా స్థాయిలో సర్దుబాట్లు జరుగుతున్నాయని పేర్కొన్నారు.

జేఎన్‌యూ ఘటనను ప్రస్తావిస్తూ ఈ దాడిపై న్యాయ విచారణ జరిపించాలని నారాయణ డిమాండ్ చేశారు. జేఎన్‌యూ అమానుష ఘటనపై ప్రపంచవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్నాయని, ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ సైతం స్పందించిందని అన్నారు. వీసీని వెంటనే బర్తరఫ్ చేయాలని, ఢిల్లీ పోలీసు కమిషనర్‌నూ బర్తరఫ్ చేయాలని నారాయణ డిమాండ్ చేశారు. పకడ్బందీ సెక్యూరిటీ ఉండే యూనివర్శిటీల్లో గుర్తింపు కార్డులేని వారిని వీసీ అనుమతి లేనిదే ఎవరినీ అనుమతించరని అలాంటిది 50 మంది ముసుగులు ధరించిన వారు యూనివర్శిటీలోకి ఎలా ప్రవేశించారని నిలదీశారు. కన్హయ్య కుమార్‌పై దేశద్రోహం కేసు పెట్టారని, ఓ మైనార్టీ రీసెర్చి స్కాలర్ మూడేళ్లుగా కనిపించడంలేదని అనేకమంది నేతలపైనా ప్రొఫెసర్లపైనా ఆంక్షలు విధించారని గుర్తుచేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి, జాతీయ కార్యదర్శి నారాయణ, జాతీయ కార్యవర్గ సభ్యుడు అజీజ్‌పాషా

# అక్షరాస్యతలోనూ నెంబర్-1గా మారాలి

**రైతు సంక్షేమానికి పెద్దపీట ★ యువత ఖాళీగా ఉండొద్దు ★ రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీష్‌రావు**

సిద్దిపేట, జనవరి 7: తెలంగాణలో అన్నింటా నెంబర్‌వన్‌గా ఉందని..అక్షరాస్యతలోనూ నెంబర్‌వన్ కావాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీష్‌రావు వెల్లడించారు. మంగళవారం సిద్దిపేట జిల్లా బుస్సాపూర్, వెంకటాపూర్ గ్రామాల్లో జరిగిన రెండో విడత పల్లె ప్రగతి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఆదాయం తగ్గినా ప్రభుత్వ పథకాలు ఏదీ ఆపలేదని.. ఆసరా, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, కేసీఆర్ కిట్ వంటి పథకాలు ఏదీ ఆపలేదన్నారు. గోదావరి నీళ్లు వస్తే ఈప్రాంతమంతా సస్యశ్యామలం అవుతుందన్నారు. ప్రభుత్వం అధికంగా ఖర్చు చేసేది రైతు సంక్షేమంపైనేనని స్పష్టం చేశారు. 2 వేల కోట్లతో రైతుబంధు, 8 వేల కోట్లతో రైతులకు ఉచిత కరెంట్ ఇస్తున్నట్టు ఆయన తెలిపారు.ప్రతి రైతుకు 5లక్షల ఉచిత బీమా కల్పిస్తున్నామని, ఇందుకోసం ఎల్‌ఐసీకి తెలంగాణ సర్కార్ పక్షాన 1100 కోట్లు కడుతున్నట్టు పేర్కొన్నారు. 25 వేల కోట్లతో ప్రాజెక్టులు నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసినట్టు పేర్కొన్నారు. రైతులకు విత్తనాలు, సబ్సిడీ, డ్రిప్,స్ప్రింకర్లు రాయితీపై ఇస్తున్నట్లు పేర్కొన్నారు. నాట్లు వేసేందుకు యంత్రాలు, వరి కోసే యంత్రాలు, కలుపు తీసే యంత్రాలు తేవాలనుకుంటున్నట్టు పేర్కొన్నారు.

రాష్ట్రంలో 11 వేల కోట్ల ధాన్యం కొనుగోలు చేసి.. వారం రోజుల్లో రైతులకు చెల్లించినట్టు మంత్రి పేర్కొన్నారు. రాబోయే



సమావేశంలో ప్రసంగించి గ్రామంలో మురుగు కాల్వలను పరిశీలిస్తున్నమంత్రి హరీష్‌రావు

రోజుల్లో కాళేశ్వరం నీటితో ఈ ప్రాంతంలో రెండు పంటలు పండించనున్నట్టు మంత్రి తెలిపారు. ప్రతి చిన్న గ్రామానికి పంచాయతీ కార్యదర్శిని నియమించి గ్రామాల్లో మార్పుకు సర్కార్ కృషిచేస్తుందన్నారు. సీఎం కేసీఆర్ ఒకే దఫా అన్ని పంచాయతీలకు గ్రామ కార్యదర్శులకు నియమించినట్టు పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల నుండి యువత వచ్చి ఇక్కడ పనులు చేసుకుంటున్నారని, మన యువత ఖాళీగా ఉండటం సరికాదన్నారు. ఏదో ఒక పనిచేయాలని, ఖాళీగా ఉండోద్దన్నారు. భూమి ఉంటే వ్యవసాయం చేయాలని మంత్రి హరీష్‌రావు సూచించారు. గ్రామ యువత ముందుకు వస్తే న్యాక్‌లో ఉచితంగా శిక్షణ ఇప్పిస్తామన్నారు. ప్రతి గ్రామంలో వంద శాతం అక్షరాస్యత సాధించేలా కృషిచేయాలని పిలుపునిచ్చారు. సంప్రదాయేతర పంటల వైపు దృష్టి సారించాలని, అందరూ వరిపంట వేయవద్దని సూచించారు. ఆరుతడి పంటలు వేయాలని, రెండవ పంట లాభదాయకంగా ఉంటుందని రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జేసీ పద్మాకర్, సుడా చైర్మన్ మారెడ్డి రవీందర్‌రెడ్డి, ఎంపీపీ శ్రీదేవి, జడ్పీటీసీ శ్రీహరి, గ్రామ సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్‌కు ఐటీ కళ

**మడికొండలో టెక్ మహీంద్రా.. సైయింటు ఐటీ సెజ్‌లను ప్రారంభించిన మంత్రి కేటీఆర్**

ఆంధ్రభూమి బ్యూరో

వరంగల్, జనవరి 7: వరంగల్ నగరానికి ఐటీ కళ సంతరించుకుంది. మడికొండ సమీపంలో సువిశాలమైన స్థలంలో రెండు ఐటీ కంపెనీ దిగ్గజాలను రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ మంగళవారం ప్రారంభించారు. మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇటీవల కాలంలో కాబోయే ముఖ్యమంత్రి కేటీఆరే అంటూ ప్రచారం జరిగిన నేపథ్యంలో పోలీసులు అదే స్థాయిలో కేటీఆర్‌కు భారీ భద్రత ఏర్పాట్లు కల్పించారు. హైదరాబాద్ నుండి ప్రత్యేక హెలికాప్టర్లో బయలుదేరిన కేటీఆర్ వరంగల్ నిట్‌లో దిగగానే అక్కడి నుండి పోలీస్ భారీ బందోబస్తు మధ్య మడికొండలో ప్రారంభోత్సవం చేసే ఐటీ కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆర్‌సీ నుండి మడికొండ వరకు అడుగడుగునా పోలీసులను మోహరించారు. కేటీఆర్ మున్సిపల్ మంత్రి కావడం, స్వయంగా ముఖ్యమంత్రి కొడుకే కావడం వల్ల భారీ బందోబస్తుకు తోడు ఆయన పర్యటించే ప్రాంతాల్లో కూడా పరిశుభ్రత చర్యలను చేపట్టారు. మీడియా పాస్‌ను కూడా ఇష్యూ చేశారు.



ఐటీ సెంటర్‌కు ప్రారంభోత్సవం చేస్తున్న మంత్రి కేటీఆర్

# హాజీపూర్ కేసు నేటికి వాయిదా

**పూర్తయిన ప్రాసిక్యూషన్ వాదనలు ⋆ ఉరిశిక్ష వేయాలన్న మహిళా న్యాయవాదులు ⋆ నిర్భయ కేసు తీర్పుతో హాజీపూర్ కేసుపై అందరి దృష్టి**

ఆంధ్రభూమి బ్యూరో

నల్లగొండ, జనవరి 7: యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం హాజీపూర్ గ్రామం ముగ్గురు బాలిక హత్యాచార కేసుల విచారణ బుధవారం నాటికి వాయిదా పడింది. మంగళవారం నిందితుడు మర్రి శ్రీనివాస్‌రెడ్డే మనిషా, కల్పన, శ్రావణిలపై హత్యాచారాలకు పాల్పడినట్టు పోలీసులు సమర్పించిన సాక్ష్యాధారాలపై నల్లగొండ జిల్లా ఫోక్సో స్పెషల్ కోర్టులో ప్రాసిక్యూషన్ తన వాదనలు వినిపించింది. ముగ్గురు బాలికలను క్రూరంగా అత్యాచారం చేసి హత్య చేసిన నిందితుడు శ్రీనివాస్‌రెడ్డికి ఉరి శిక్ష వేయాలంటు ప్రాసిక్యూషన్ తన వాదనలు ముగించింది. విచారణ సమయంలో నిందితుడు ఇచ్చిన సమాచారం ఆధారంగానే కల్పన మృతదేహం ఆచూకీ కనిపెట్టినందున అతడికి నేరాలతో సంబంధం ఉందన్న విషయం స్పష్టమైందని ప్రాసిక్యూషన్ వాదించింది. బుధవారం నిందితుడు తరుపునా డిఫెన్స్ న్యాయవాది వాదనలు వినిపించనున్నారు. పాటియాల కోర్టు నిర్భయ హత్య కేసులో నిందితులకు ఉరి శిక్షను ఖరారు చేస్తూ జనవరి 22న ఉరి తీయాలంటు ఆదేశించిన నేపథ్యంలో హాజీపూర్ హత్యాచారాల కేసు విచారణపై అందరి దృష్టి మళ్లింది. నిర్భయ దోషుల ఉరితీత లోపునే హాజీపూర్ కేసు తీర్పు వెలువడుతుందని భావిస్తున్నారు. పోలీసులు, ప్రాసిక్యూషన్ సమర్పించిన ఆధారాల మేరకు హాజీపూర్ బాలికల హత్యాచార కేసులో నిందితుడు శ్రీనివాస్‌రెడ్డికి సైతం ఉరి శిక్ష విధించాలన్న డిమాండ్ బలంగా వినిపిస్తుంది. మంగళవారం కోర్టులో ఈ కేసు విచారణ సాగుతున్న సమక్షంలో కోర్టు ప్రాంగణంలో మహిళా న్యాయవాదులు నిందితుడికి ఉరి శిక్ష విధించాలంటూ ప్ల కార్డు ప్రదర్శించడం విశేషం. నిందితుడు శ్రీనివాస్‌రెడ్డి హాజీపూర్‌కు చెందిన బాలికలు శ్రావణి(16)ని 2019 ఏప్రిల్ 25న హత్యాచారం చేసి తన పాడుబడిన వ్యవసాయ బావిలో పూడ్చివేశాడు. అదే ఏడాది మార్చి 9న తిప్పరబోయిన మనిషా (20)ను, 2015 ఏప్రిల్ 22న కల్పన(11)లను శ్రీనివాస్‌రెడ్డి హత్యాచారం చేసి అదే బావిలో పూడ్చివేశాడు.

గత ఏడాది ఏప్రిల్ 26న శ్రావణి మృతదేహం ఆచూకీ గుర్తింపుతో నిందితుడు శ్రీనివాస్‌రెడ్డి చేసిన దారుణాలు వెలుగుచూశాయి. అంతకుముందు కర్నూల్‌లో కూడా నిందితుడు తన లైంగిక వాంఛకు ఒక మహిళను బలి చేశాడన్న నేరారోపణలు సైతం వెలుగుచూశాయి. నిర్భయ కేసు దోషుల ఉరి తేదీ జారీతో మరోసారి అదే డిమాండ్ వినిపిస్తోంది.



శ్రీనివాస్‌రెడ్డికి ఉరి శిక్ష వేయాలంటూ ప్ల కార్డ్సు ప్రదర్శిస్తున్న మహిళా న్యాయవాదులు
నిందితుడిని తీసుకొస్తున్న పోలీసులు

## సమత కేసులో సాక్షుల విచారణ పూర్తి

**నిందితుడి తరఫున హాజరు కాని సాక్షులు ⋆ నేటి నుంచి ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో వాదనలు**

ఆంధ్రభూమి బ్యూరో

ఆదిలాబాద్, జనవరి 7: సామూహిక అత్యాచారం, హత్యకు గురైన సమత కేసులో సాక్షుల విచారణ పూర్తికావడంతో ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో వాదనలు బుధవారం నుండి కొనసాగనున్నాయి. సమత తరపున 44 మంది సాక్షులను చార్జిషిట్‌లో ప్రవేశపెట్టగా వీరిలో న్యాయస్థానం 28 మందిని విచారించి వాంగ్మూలాలను స్వీకరించింది. ఆ తదుపరి నిందితుల తరపున సాక్షులను విచారించాలని న్యాయవాది కోర్టును ఆశ్రయించగా సోమ, మంగళవారాల్లో రెండు రోజులు న్యాయమూర్తి గడవు ఇచ్చినప్పటికీ నిందితుల తరపున సాక్షులెవరూ హాజరుకాకపోవడంతో విచారణ బుధవారానికి వాయిదా పడింది. నిందితుల తరపున న్యాయవాది, సమత తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ బుధవారం నుండి వాదనలు వినిపించే అవకాశం ఉంది.

# హత్యకు ప్రతీకారంగా నిందితుని ఇల్లు దగ్ధం

ఆలేరు, జనవరి 7: హత్యకు ప్రతీకారంగా నిందితుడి ఇంటిని తగులబెట్టిన సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లాలో చోటు చేసుకుంది. ఆలేరు మండల పరిధిలోని గొలనుకొండ శివారులో సోమవారం సాయంత్రం కొన్‌రెడ్డి వెంకట్‌రెడ్డి (38) హత్యకు గురయ్యాడు. అతడు తన భార్యతో జనగామకు వెళ్లి తిరిగి వస్తుండగా సిరిపురం రోడ్‌లో గుర్తు తెలియని వ్యక్తి అతనిపై గొడ్డలితో దాడి చేశాడు. ఈ దాడిలో వెంకట్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందగా, ఆయన భార్య స్వల్పంగా గాయపడింది. దీంతో వెంకట్‌రెడ్డి స్వగ్రామమైన గొలనుకొండలో మంగళవారం రోజంతా ఉద్రిక్తత వాతావరణం చోటుచేసుకుంది. వెంకట్‌రెడ్డిని దానబోయిన పరశురాములు అనే వ్యక్తి హత్య చేశాడని, అతడిని తమకు అప్పచెప్పాలని డిమాండ్ చేస్తూ అతని ఇంటిని మృతుని బంధువులు తగలబెట్టారు. నిందితున్ని చంపే వరకు తమ ఆందోళన కొనసాగిస్తామని భీష్మించడంతో యాదాద్రి భువనగిరి డీసీపీ నారాయణరెడ్డి నేతృత్వంలో పెద్ద ఎత్తున పోలీస్ బలగాలను దింపి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. మృతుడు వెంకట్‌రెడ్డికి ఇద్దరు సంతానం. అతను అందరితో కలివిడిగా ఉండేవాడని, అతని హత్యను జీర్ణించుకోలేకపోతున్నామని బంధువు లు ఆవేదన వ్యక్తం చేశారు.



దగ్ధమవుతున్న నిందితుని ఇల్లు

# గ్రామాన్ని అద్దంలా మార్చండి.. మీ ఊరికి వస్తా..!

**తడ్కల్ సర్పంచుకు కలెక్టర్ హన్మంతరావు షరతు ⋆ వీడియోకాల్ చేసి పల్లె ప్రగతిపై ఆరా**

ఆంధ్రభూమి బ్యూరో

సంగారెడ్డి, జనవరి 7: గ్రామంలో ఎలాంటి సమస్యలు లేకుండా పల్లె ప్రగతి కార్యక్రమాన్ని సాకారం చేసి అద్దంలా మార్చినప్పుడే నేను మీ గ్రామాన్ని సందర్శిస్తానని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ హన్మంతరావు కంగ్టి మండలం తడ్కల్ గ్రామ సర్పంచుకు షరతు పెట్టారు. మంగళవారం కల్హేర్ మండల పర్యటనకు తన వాహనంలో బయలుదేరిన కలెక్టర్ తడ్కల్ గ్రామ కార్యదర్శికి వీడియోకాల్ చేసి సర్పంచు పండరినాథ్‌రావుతో మాట్లాడారు. గ్రామాభివృద్ధిపై ఆరా తీస్తున్న ప్రతిక్రమంలో సర్పంచ్ సాబ్.. అంటూ గౌరవప్రదంగా మాట్లాడి అందరినీ ఆకట్టుకున్నారు. కర్నాటక, మహారాష్ట్ర సరిహద్దులో ఉన్న కంగ్టి మండలం ప్రజలు గ్రామీణ యాసలో మాట్లాడినట్లుగానే సర్పంచుకు అర్థమయ్యే రీతిలో సంభాషించడం విశేషం. వైకుంఠధామం నిర్మాణం పూర్తయిందా, పనులు మొదలు పెట్టారా అని అడగ్గా రేపు పనులు ప్రారంభిస్తామంటూ సర్పంచ్ సమాధానం ఇవ్వడంతో అంతటా పూర్తవుతుంది మీరు కూడా త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఇంకుడు గుంతల నిర్మాణం ఎక్కడి వరకు వచ్చిందని, డంప్ యార్డు నిర్మాణం పూర్తి చేయించాలని కోరారు. గ్రామంలో వయ్యారిభామ ఉందా అంటూ ప్రశ్నించగా సర్పంచుకు అర్థం కాకపోవడంతో గంజాయి అలం అని కలెక్టర్ పేర్కొనడంతో ఎక్కడా లేదని శుభ్రం చేయించామని పండరీనాథ్‌రావు సమాధానం ఇచ్చారు. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా కోసం ట్రాక్టర్ వచ్చిందా లేదా అని సమాధానం రాబట్టుకుని వచ్చిన ట్రాక్టర్‌కు ట్రాలీని కూడా ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. గ్రామంలో చెత్తబుట్టలు పంపిణీ చేసారా అంటూ తడి చెత్త, పొడి చెత్త బుట్టలను పంపిణీ చేయాలని, పచ్చరంగు, ఎర్రరంగు అంటూ వివరించడం గమనార్హం. మురికి కాలువలన్నీ శుభ్రంగా ఉండాలని తెలిపారు. నర్సరీలో మొక్కలు పెంచుతున్నారా? నర్సరీకి కంచె, గేటు ఏర్పాటు చేసుకున్నారా అని అడిగారు. విత్తనాల కోసం వేచిచూస్తున్నామని ఓ మహిళ సమాధానం ఇవ్వగా కావల్సిన విత్తనాలను త్వరగా తెచ్చుకుని నర్సరీని పెంచాలి తల్లి అంటూ సూచించడం విశేషం. గ్రామం అన్ని రంగాల్లో పురోగతి సాధిస్తుందా, తాను గ్రామాన్ని సందర్శించడానికి రావాలా అని సర్పంచును అడగ్గా తప్పకుండా రావాలంటూ ఆహ్వానించారు. గ్రామాన్ని అద్దంలా తీర్చిదిద్దితే రెండు రోజుల్లో బరాబర్ (తప్పకుండా) వస్తానని హామీ ఇచ్చారు. పల్లె ప్రగతి విజయంలో కీలక పాత్ర పోషిస్తున్న సర్పంచులను ప్రోత్సహించేందుకు కలెక్టర్ హన్మంతరావు తనదైన శైలిలో వ్యవహరిస్తూ అధికార యంత్రాంగానికి స్ఫూర్తిగా నిలుస్తున్నారని చెప్పవచ్చు.



తడ్కల్ గ్రామ సర్పంచ్‌తో తన వాహనం నుంచి వీడియోకాల్ ద్వారా మాట్లాడుతున్న కలెక్టర్ హన్మంతరావు

# వేణుగోపాలుడిగా లక్ష్మీనరసింహుడు

యాదగిరిగుట్ట, జనవరి 7: యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం అధ్యయనోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారు వేణుగోపాలస్వామిగా, గోవర్థగిరిధారిగా భక్తులకు దర్శనమిచ్చారు. అధ్యయనోత్సవాల రెండో రోజు దివ్యప్రబంధ పారాయణాల అనంతరం స్వామివారిని వేణుగోపాలస్వామి అలంకర సేవ నిర్వహించి బాల ఆలయంలో ఊరేగించారు. జీవులను ఉద్ధరించుటకు భగవానుడు దాల్చిన దశావతరాల్లో గొప్పదైన శ్రీ కృష్ణపరమాత్మ అవతారం. పరామాత్మ స్వరూపం, భగవత్ స్వరూపం, ఆచార్య స్వరూపంలతో పరిపూర్ణమైన భగవత్ స్వరూపానికి ప్రతీక వేణుగోపాలస్వామి అవతారం. శ్రీ కృష్ణ లీలలన్నింటిలో వేణుగోపాలుడి చేష్టలు మధురమైనవని, మురళీగానంతో గోకులాన్ని, పశు, పక్ష్యాదులను వశం చేసుకున్న వనమాలి సర్వబ్రహ్మాండాన్ని వేణుగానంతో నియంత్రించాడని ప్రసిద్ధి.

**గోవర్ధనగిరిధారి అవతారంలో ఊరేగింపు**

అధ్యయనోత్సవాల్లో సాయంకాలం ద్రావిడ ప్రబంధ పారాయణం పిదప స్వామివారిని గోవర్ధనగిరిధారిగా అలంకరించి ఊరేగించారు. భగవానుడు బృందావనంలో తన భక్తులను గోవర్ధన గిరి ధారిగా అనుగ్రహించడాన్ని దశమ స్కంధంలో అద్భుతంగా వర్ణించారు. గోకులంలో కరవు కాటకముల నివారణకు గోవర్ధన గిరి సమీపంలో వన పూజలు నిర్వహిస్తుండగా తనను కాదని కృష్ణుడిని పూజించుట సహించలేని ఇంద్రుడు రేపల్లె వాసులపై రాళ్ల వర్షం కురిపిస్తాడు. భక్తవత్సులుడైన శరణాగత త్రాణపరాయణుడైన శ్రీ కృష్ణ పరామాత్మ తన లీలతో చిటికన వేలితో గోవర్ధనగిరిని ఎత్తి రేపల్లె వాసులను రక్షిస్తాడు.

తనపై భారం వేసి శరణకోరిన వారందరికీ తానే రక్షకుడినంటూ గోవర్ధనగిరిధారిగా తన లీలతో రుజువు చేస్తాడు. గోవర్ధనగిరిధారి దర్శనంతో భక్తుల సర్వపాపహరణం, దైవ రక్షణ లభిస్తుందని పురాణ కథనం. అళ్వారులు తన్మయత్వంతో చెప్పిన గోవర్ధనగిరిధారి అవతార అలంకార సేవలో సకల సృష్టిజాలమంత తన సంకల్ప బలం చేతనే వృద్ధి చెందుతుందనే తత్వం చాటుతుందని ఆయన దర్శన భాగ్యమంతో ప్రజలకు జగద్రక్షుడి కరుణ కటాక్షాలు లభిస్తాయని పురాణాలు చెబుతున్నాయి.



అధ్యయనోత్సవాల్లో వేణుగోపాలస్వామి అలంకార సేవలో యాదాద్రి లక్ష్మీనరసింహుడు

# కల్వకుంట్ల కుటుంబంలో కొట్లాటల కుంపటి

**పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డి ఎద్దేవా**

గజ్వేల్, జనవరి 7: పదవులు పంచలేక కల్వకుంట్ల కొంపలో కొట్లాటల కుంపటి రగులుతోందని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. మంగళవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కేసీఆర్ లక్ష్యంగా విమర్శలు చేస్తున్న ప్రతిపక్ష పార్టీల నేతలపై అక్రమ కేసులు బనాయించి వేధింపులకు గురిచేస్తున్నారని, అయితే ఆయన అంతకు మించి ఇంకా ఏమీచేయలేరని విమర్శించారు. చింతమడకలో ఇంటికి రూ. 10 లక్షలు ఇచ్చిన కేసీఆర్ మరి గజ్వేల్ ప్రజలు నమ్మి రెండు సార్లు సీఎం చేస్తే ఏమివ్వరా? అని ప్రశ్నించడంతో పాటు మొదటగా గెలిచిన మొదటి సభలో ఇచ్చిన 5 వేల ఇళ్ల హామీని నిలబెట్టుకుంటే సరిపోతుందని స్పష్టం చేశారు. ముఖ్యంగా గజ్వేల్ అభివృద్ధిని బూచిగా చూపిస్తూ రాష్ట్ర ప్రజలను మభ్య పెడుతుండగా, ఇక్కడ మాత్రం కేసీఆర్ చేసిన అభివృద్ధి భవన నిర్మాణాలకే పరిమితమైందని తెలిపారు. ఆరేళ్ల క్రితం చేపట్టిన రింగ్‌రోడ్డు నిర్మాణం ఇంకా పూర్తి కాకపోగా, గజ్వేల్ నడిబొడ్డున ఉన్న బస్టాండ్‌ను కూల్చివేసి ప్రయాణికులను బజారుపాలు చేశారని ఆరోపించారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని కనిపించకుండా చేసేందుకే కుట్రలు పన్నుతుండగా, బస్టాండ్ తీసి సమీకృత మార్కెట్ కట్టించాడని విమర్శించారు. మున్సిపల్ ఎన్నికల్లో అభ్యర్థులు ఓడిపోతే మంత్రి పదవులు ఊడుతాయని హెచ్చరించిన కేసీఆర్‌కు తగిన బుద్ధి చెప్పే విధంగా ఇక్కడి ప్రజలు చైతన్యవంతులై టీఆర్‌ఎస్‌ను ఓడిస్తే సీఎం పదవి వదులుకోవడానికి కేసీఆర్ సిద్ధమవ్వాలని చెప్పారు. కాగా హుజూర్‌నగర్ ఉప ఎన్నికల్లో టీఆర్‌ఎస్ గెలిస్తే మద్యం, ఆర్టీసీ ఛార్జీలు పెంచుతారని తాము హెచ్చరించామని, ఇప్పుడు అదే నిజమైందని అన్నారు. ప్రస్తుతం జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల అనంతరం కరెంట్ చార్జీలు, ఇంటి పన్నులు పెంచేందుకు సన్నద్ధమవుతుండగా, రాష్ట్రంలో అధికార టీఆర్‌ఎస్‌కు వ్యతిరేకంగా తీర్పు వస్తేనే ప్రజా వ్యతిరేక విధానాలకు కేసీఆర్ స్వస్తి పలుకుతారని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు ఏ ఒక్కటీ అమలు కాకపోగా, రాష్ట్రంలో అర్హులైన పేదలకు ఇళ్లు ఇవ్వలేదని, నిరుద్యోగులకు భృతి చెల్లించకపోవడంతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించలేదని, దళితులకు మూడెకరాల భూమి కేటాయించలేదని, పంట రుణమాఫీ కాలేదని, తగ్గించిన వయస్సుతో పెన్షన్‌లు మంజూరీ చేయలేదని నిలదీశారు. మున్సిపల్ ఎన్నికల కోసం అవినీతి డబ్బును సిద్ధం చేయగా, అన్ని వర్గాలను కలుపుకుంటూ టీఆర్‌ఎస్ ఓటమి లక్ష్యంగా పార్టీ శ్రేణులు శ్రమించాలని వివరించారు. పీసీసీ వ్యవహారాల ఇన్‌చార్జి, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి రామచంద్ర కుంతియా, ఏఐసీసీ నేతలు వేణుగోపాల్, బోసు రాజు, పీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య, మాజీ మంత్రులు డాక్టర్ జే. గీతారెడ్డి, గడ్డం ప్రసాద్‌రావు, డీసీసీ అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి పాల్గొన్నారు.



సభలో ప్రసంగిస్తున్న పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డి

पावरग्रिड
POWERGRID

**ప్రకటన**

1. 1999, CERC (వాణిజ్య నిర్వహణ) నియమావళులలోని నియమావళి - 86 మరియు 2019, CERC (ట్యారిఫ్ యొక్క షరతులు మరియు నిబంధనలు) కింది వాటిని ఆమోదించబడింది. (i) 2014-19 ట్యారిఫ్ బ్లాక్ కోసం ట్రాన్స్‌మిషన్ ట్యారిఫ్ యొక్క నిజం చేయుట మరియు (ii) 2019-24 ట్యారిఫ్ బ్లాక్ కోసం ట్రాన్స్‌మిషన్ ట్యారిఫ్ నిర్ణయం కోసం. **అర్జీ-1:-** దక్షిణ రీజియన్‌లో ట్రాన్స్‌మిషన్ సిస్టమ్ సహకారంతో బలోపేతము-XVII విధానము కింద ట్రాన్స్‌మిషన్ ఎస్సెట్స్ కొరకు **అర్జీ-2:-** దక్షిణ రీజియన్‌లో బలోపేతము-XVIII విధానము సహకారంతో ట్రాన్స్‌మిషన్ విధానం కింద ట్రాన్స్‌మిషన్ ఎస్సెట్స్ కోసం.
2. పై పేర్కొనిన ట్రాన్స్‌మిషన్ సిస్టమ్ యొక్క లబ్ధిదారులు:- (ఎ) KPTCL (బి) APTRANSCO (సి) KSEB (డి) TNEB (ఇ) గోవా విద్యుత్ శాఖ, (ఎఫ్) పుదుచ్చేరి విద్యుత్ శాఖ, (జి) APEDCL (హెచ్) APSPDCL (ఐ) APCPDCL (జె) APNPDCL (కె) BESCOM (ఎల్) GESCOM (ఎం) HESCOM (ఎన్) MESCOM (ఒ) చాముడేశ్వరి ఎలక్ట్రిసిటీ సప్లయి కార్పొరేషన్ లిమిటెడ్ (పి) ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ (క్యూ) TANGEDCO, (ఆర్) TNTC.
3. ట్యారిఫ్ వివరములు

ఎ) 2014-19 బ్లాక్ — రూ.లక్షలలో

| అర్జీ | ప్రాజెక్ట్ | | 2014-15 | 2015-16 | 2016-17 | 2017-18 | 2018-19 |
|---|---|---|---|---|---|---|---|
| అర్జీ 01 | ఎస్సెట్-I | ట్రూయింగ్ అప్ ఆధారంగా సవరించబడిన ఎఎఫ్‌సి | 0.00 | 1620.92 | 5538.12 | 5763.55 | 6007.34 |
| | ఎస్సెట్-II | ట్రూయింగ్ అప్ ఆధారంగా సవరించబడిన ఎఎఫ్‌సి | 0.00 | 2775.49 | 8015.08 | 8363.28 | 8671.64 |
| | ఎస్సెట్-III | ట్రూయింగ్ అప్ ఆధారంగా సవరించబడిన ఎఎఫ్‌సి | 0.00 | 739.67 | 2563.48 | 2687.55 | 2777.28 |
| | ఎస్సెట్-IV | ట్రూయింగ్ అప్ ఆధారంగా సవరించబడిన ఎఎఫ్‌సి | 0.00 | 907.83 | 2603.28 | 2930.66 | 3213.92 |
| అర్జీ 02 | ఎస్సెట్-1 | ట్రూయింగ్ అప్ ఆధారంగా సవరించబడిన ఎఎఫ్‌సి | 604.12 | 617.61 | 612.97 | 602.74 | 594.20 |
| | ఎస్సెట్-2 | ట్రూయింగ్ అప్ ఆధారంగా సవరించబడిన ఎఎఫ్‌సి | 7338.55 | 8437.25 | 8243.22 | 7994.99 | 7790.21 |
| | ఎస్సెట్-3 | ట్రూయింగ్ అప్ ఆధారంగా సవరించబడిన ఎఎఫ్‌సి | 2114.93 | 3223.01 | 3181.64 | 3101.10 | 3031.93 |
| | ఎస్సెట్-4 | ట్రూయింగ్ అప్ ఆధారంగా సవరించబడిన ఎఎఫ్‌సి | 20.63 | 476.80 | 475.78 | 478.30 | 482.10 |
| | ఎస్సెట్-5 | ట్రూయింగ్ అప్ ఆధారంగా సవరించబడిన ఎఎఫ్‌సి | 0.00 | 5731.03 | 9013.80 | 9008.09 | 8870.74 |

బి) 2019-24 బ్లాక్ — రూ.లక్షలలో

| అర్జీ | ప్రాజెక్ట్ | | 2019-20 | 2020-21 | 2021-22 | 2022-23 | 2023-24 |
|---|---|---|---|---|---|---|---|
| అర్జీ-1 | ఎస్సెట్-1 | AFC | 19537.13 | 19286.32 | 19002.64 | 18670.31 | 18359.79 |
| అర్జీ-2 | ఎస్సెట్-1 | AFC | 19181.63 | 18655.02 | 18134.38 | 17616.63 | 17097.97 |

4. ధరల పట్టీ నిర్ణయం కొరకు చేసిన దరఖాస్తు కాపీని **www.powergridindia.com** అను దరఖాస్తుదారు వెబ్‌సైట్‌లో పెట్టబడింది.
5. దరఖాస్తులో కలిగిన ధరల పట్టీ నిర్ణయం కొరకు ప్రతిపాదనలపై ఎటువంటి సూచనలు మరియు అభ్యంతరాలను లబ్ధిదారుడు కలుపుకొని ఏ వ్యక్తి చేతనైనా సెక్రటరీ, సెంట్రల్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమీషన్, 3 మరియు 4వ అంతస్తు, చంద్రలోక్ భవనం, జన్‌పథ్, న్యూఢిల్లీ - 110 001 వారి ముందు (లేక ఎప్పటైనా కమీషన్ వారి కార్యాలయముగల ఇతర చిరునామాకు) మరియు ఈ ప్రకటన వెలువడిన తేదీ నుండి 30 రోజులలోగా దానియొక్క కార్పొరేట్ కార్యాలయం అయిన "సౌదామినీ", ప్లాట్ నెం.2, సెక్టార్ -29, గుర్గావ్-122001 చిరునామా వద్దకు దరఖాస్తుదారుడు ప్రతిలేపాటు దాఖలు చేయవలెను.

స్థలం: గుర్గావ్
తేది: 01.01.2020
(సం.) **సీనియర్ జనరల్ మేనేజర్ (కమర్షియల్)**

**పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్**
(భారత ప్రభుత్వ సౌజన్యం)
నమోదిత కార్యాలయం: బి-9, కుతబ్ ఇనిస్టిట్యూషనల్ ఏరియా, కత్వారియా సరాయ్, న్యూఢిల్లీ-110016
కార్పొరేట్ కార్యాలయం: "సౌదామిని", ప్లాట్ నెం.2, సెక్టార్-29, గుర్గావ్, హర్యానా-122001
వెబ్‌సైట్: www.powergridindia.com CIN:L40101DL1989G0I038121
A Maharatna PSU
PG/CC/Notice-111/Advt.-127/2019-20 Centum

**ఫారం-జి**
**ఆసక్తి తెలియజేయుటకు ఆహ్వానం**
(2016, ఇన్‌సాల్వెన్సీ మరియు బ్యాంకర్రప్టీ (కార్పొరేట్ వ్యక్తుల కోసం ఇన్‌సాల్వెన్సీ తీర్మానం విధానం) నియమావళులలోని నియమావళి 36A(I) కింద)

| సంబంధిత వివరములు | |
|---|---|
| 1. కార్పొరేట్ అప్పుదారు పేరు | కెఎస్‌కె మహానది పవర్ కంపెనీ లిమిటెడ్ |
| 2. కార్పొరేట్ అప్పుదారు స్థాపించిన తేది | 19 జూన్, 2009 |
| 3. కార్పొరేట్ అప్పుదారు ఏ అధికారి కింద స్థాపించారు/నమోదు చేశారు | కంపెనీల రిజిస్ట్రార్, ముంబయి |
| 4. కార్పొరేట్ అప్పుదారు యొక్క కార్పొరేట్‌గుర్తింపు నెంబరు | U40300TG2009PLC064062 |
| 5. కార్పొరేట్ అప్పుదారుయొక్క నమోదితకార్యాలయం చిరునామా మరియు అసలు కార్యాలయం (ఏదైనా) | నమోదిత కార్యాలయం: 8-2-293/82/ఎ/431/ఎ, రోడ్ నెం.22, జూబ్లీహిల్స్, హైదరాబాద్, తెలంగాణ-500033, ఇండియా |
| 6. కార్పొరేట్ అప్పుదారు యొక్క ఇన్‌సాల్వెన్సీ ప్రారంభమైన తేది | 03 అక్టోబర్ 2019 |
| 7. ఆసక్తి తెలియజేయు ఆహ్వానించిన తేది | 08 జనవరి, 2020 ఆసక్తిని తెలియజేయుటకు సవిస్తరమైన ఆహ్వానం www.ksk.co.in/kmpcl అను వెబ్‌సైట్‌పై లభించును. |
| 8. కోడ్ యొక్క అధికరణ 25(2)(హెచ్) కింద దరఖాస్తుదారుల తీర్మానం కోసం అర్హతలభ్యత | ఆసక్తిని తెలియజేయుటకు సవిస్తరమైన ఆహ్వానంలో అర్హత ప్రమాణము ఏర్పాటుచేయబడింది. |
| 9. అధికరణ 29ఎ కింద వర్తించు అనర్హత నియమావళులు లభించును | ఆసక్తిని తెలియజేయుటకు సవిస్తరమైన ఆహ్వానంలో ఈ నార్మ్‌ని ఏర్పాటు చేయబడ్డాయి. |
| 10. ఆసక్తి తెలియజేయుటను స్వీకరించుటకు చివరి తేది | 23 జనవరి, 2020 |
| 11. కాగోరు తీర్మానం దరఖాస్తుదారుల ప్రొవిజనల్ జాబితా జారీచేయు తేది | 28 జనవరి, 2020 |
| 12. ప్రొవిజన్ల జాబితాకి అభ్యంతరములు దాఖలు చేయుటకు చివరి తేది | 02 ఫిబ్రవరి, 2020 |
| 13. కాగోరు తీర్మానం దరఖాస్తుదారుల చివరి జాబితా జారీచేయు తేది | 12 ఫిబ్రవరి, 2020 |
| 14. కాగోరు తీర్మానం దరఖాస్తుదారులకు తీర్మానం ప్లానులు కోసం దరఖాస్తు మరియు ఎవల్యూయేషన్ మ్యాట్రిక్స్, సమాచారపు మెమొరాండం జారీచేయు తేది | 02 ఫిబ్రవరి, 2020 |
| 15. తీర్మానపు ప్లాన్, ఎవల్యూషన్ మ్యాట్రిక్స్, సమాచారపు మెమొరాండం మరియుతదుపరి సమాచారం కోసం రిక్వెస్టు పొందుటలో విధానం | ఆసక్తిని తెలియజేయుటకు సవిస్తరమైన ఆహ్వానంలో పెట్టబడిన విధానం ప్రకారం అర్హత నిర్ణయించబడిన కాగోరు తీర్మానం దరకాస్తుదారులకు ప్రొఫెషనల్ తీర్మానం ద్వారా ఏర్పాటు చేయబడింది మరియు అదియు 2016, ఇన్‌సాల్వెన్సీ మరియు బ్యాంకర్రప్ట్స్ (కార్పొరేట్ వ్యక్తుల కోసం ఇన్‌సాల్వెన్సీ తీర్మానం విధానం) నియమావళులలోని నియమావళి 36 ప్రకారం |
| 16. తీర్మానం ప్లానులు దాఖలు చేయుటకు చివరి తేది | 02 మార్చి, 2020 |
| 17. ప్రొఫెషనల్ తీర్మానానికి తీర్మానం ప్లానులు దాఖలు చేయు విధానం/పద్ధతి | 2016, ఇన్‌సాల్వెన్సీ మరియు బ్యాంకర్రప్ట్స్ (కార్పొరేట్ వ్యక్తుల కోసం ఇన్‌సాల్వెన్సీ తీర్మానం విధానం) నియవాళులలోని నియమావళి 36బి ప్రకారం ప్రొఫెషనల్ తీర్మానం ద్వారా తీర్మానం ప్లాన్‌కి సవిస్తరమైన దరఖాస్తులో జారీచేయబడతాయి. |
| 18. ఆమోదము కోసం న్యాయ నిర్ణీత అధికారికి తీర్మానపు ప్లాను దాఖలు చేయుటకు అంచనా తేది | 16 మార్చి, 2020 |
| 19. తీర్మానం ప్రొఫెషనల్ పేరు మరియు నమోదైన నెంబరు | మిస్టర్ మహేందర్ కుమార్ ఖండెల్వాల్ Regn. No.IBBI/IPA-001/IP-P00033/2016-17/10086 |
| 20. బోర్డుతో నమోదైన విధంగా తీర్మానం ప్రొఫెషనల్ పేరు, చిరునామా మరియు ఇ-మెయిల్ | మిస్టర్ మహేందర్ కుమార్ ఖండెల్వాల్ Regn. No.IBBI/IPA-001/IP-P00033/2016-17/10086 చిరునామా:- బి-2ఎ, సున్నీ వ్యాలీ సి.జి.హెచ్.ఎస్., ద్వారకా, సెక్టార్-12, న్యూఢిల్లీ-110078. ఇ-మెయిల్ ఐడి:- khandelwalmahendar2@gmail.com |
| 21. ప్రొఫెషనల్ తీర్మానముతో సంప్రదించుటకు వినియోగించవలసిన చిరునామా | 252, వీర్ సవార్కర్ మార్గ్, శివాజీ పార్క్, దాదర్ (పశ్చిమ), ముంబయి-400028. ఇ-మెయిల్:- ip.mk.ksk@in.pwc.com/ khandelwalmahendar2@gmail.com |
| 22. తదుపరి వివరములు ప్రక్కన వ్రాసిన ఇ-మెయిల్ వెబ్‌సైట్‌లో లభించును | మిస్టర్ మహేందర్ కుమార్ ఖండెల్వాల్ ఇ-మెయిల్:- ip.mk.ksk@in.pwc.com/ khandelwalmahendar2@gmail.com |
| 23. ఫారం-జి ప్రచురణ తేది | 08 జనవరి, 2020 |

(సం.) **కెఎస్‌కె మహానది పవర్ లిమిటెడ్ యొక్క ఇంట్రీమ్ తీర్మానం ప్రొఫెషనల్**
**IBBI/IPA-001/IP-P00033/2016-17/10086**
బి-2ఎ, సున్నీ వ్యాలీ సి.జి.హెచ్.ఎస్., ద్వారకా, సెక్టార్-12, న్యూఢిల్లీ-110078.
తేది:- 08 జనవరి 2020

ఆంధ్రభూమి

జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ

బుధవారం, 8 జనవరి 2020

# 'చెదలెక్కిన' చికిత్స!

దేశంలో తగినంత మంది శిశువైద్యులు- పీడియాట్రీసియన్స్- లేరన్నది బయటపడిన చేదు నిజం. గుజరాత్‌లోను, రాజస్థాన్‌లోను వైద్యశాలలలో వందల సంఖ్యలో శిశువులు మరణిస్తుండడం ఈ విచిత్ర 'కఠోర వాస్తవం' ఆవిష్కృతం కావడానికి సమకాలీన మాధ్యమం... మందులు లేని వైద్యశాలలలో రోగులు పడికాపులు పడడం గతం, పుష్కలంగా మందులు లభిస్తుండడం వర్తమానం. 'బహుళ జాతీయ వాణిజ్య సంస్థలు' - మల్టీ నేషనల్ కార్పొరేషన్స్- ఎమ్ఎన్‌సిలు- విదేశాలనుంచి చొఱబడిపోయిన తరువాత మందులకు, ఉపకరణాలకు లోటు లేదు! భారీగా విదేశాలనుంచి దిగుమతి అయిపోతుండడం 'ప్రపంచీకరణ' వాణిజ్య వ్యవస్థ. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లక్షల కోట్ల రూపాయలు ఖర్చుచేస్తున్నాయి. 'ఆయుష్మాన్ భారత్'వంటి పథకాలను అమలుచేస్తున్నాయి. అందువల్ల 'ప్రభుత్వేతర వాణిజ్య వైద్యశాలలు'- కార్పొరేట్ హాస్పిటల్స్- భారీగా దండుకుంటున్నాయి. ఈ 'సార్వజన వైద్య' సహాయ పథకాలవల్ల ప్రధానంగా లాభపడుతున్నది ''కార్పొరేట్'' వైద్యశాలల నిర్వాహకులు! ప్రభుత్వ వైద్యశాలలలో మాత్రమే అమలుజరుగవలసిన వైద్యసేవలను సైతం ''పేర్లు మార్చి'' కార్పొరేట్ వైద్యశాలల కామందులు కాజేస్తున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ పథకాలను అమలు జరిపించడంలో వైద్య చికిత్సార్థుల- పేషెంట్స్-కూ, వైద్యశాలలకూ, ప్రభుత్వ యంత్రాంగాలకు మధ్య 'అనుసంధానకర్త'లుగా అభినయ విన్యాసాలుచేస్తున్న తథాకథిత- సోకాల్డ్- స్వచ్ఛంద సంస్థలు 'దళారీ'లుగా మారి ఉండడం కూడ నడుస్తున్న విన్యాసం... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిర్వాహకులు 'కొరడా'లను ఝులిపిస్తూనే ఉన్నారు, అవినీతికి నిలయాలైన వైద్యశాలల నిర్వాహకులు దోచుకుంటూనే ఉన్నారు. ప్రభుత్వ వైద్యశాలలలో నిర్లక్ష్యం, లంచగొండితనం పుట్టలు పెరగడం గతం. 'కార్పొరేట్' వైద్యశాలలు క్రూరత్వానికి, దోపిడీకి నిలయాలు కావడం వర్తమానం! ఇప్పుడు ప్రభుత్వ వైద్యశాలల ప్రాధాన్యం తగ్గిపోయింది! అందువల్ల ప్రభుత్వ వైద్యశాలలలో వైద్యుల కొరత ఏర్పడి ఉండవచ్చు! మందులకు కొరత లేదు కాని వైద్యుల కొరత ఏర్పడిందట... అర్హులైన వైద్యులు ప్రతిభావంతులు అమెరికాకు, ఇతర దేశాలకు తరలిపోవడం చరిత్ర... కానీ 'కార్పొరేట్' వైద్యశాలలు విస్తరించిపోయిన తరువాత వైద్యులకు సైతం కొరత లేదన్నది జరుగుతున్న ప్రచారం. అందువల్లనే దేశంలో శిశువైద్యులకు కొరత ఏర్పడిందన్న 'నిర్ధారణ' విస్మయకరం! దేశంలో రెండు లక్షల మంది 'శిశు వైద్యుల' అవసరం ఉందట. కానీ కేవలం ఇరవై ఐదు వేల మంది శిశువైద్యులు మాత్రమే ఉన్నారట. ''భారత ఆరోగ్యసేవల ప్రదాతల సంఘం''- అసోసియేషన్ ఆఫ్ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ ఇన్ ఇండియా- అన్న సంస్థ వారు ఈ నిర్ధారణ చేశారట. రాజస్థాన్‌లోను, గుజరాత్‌లోను జరిగిపోతున్న శిశు మరణాలకు వైద్యులకొరత కారణమా? లేక ఉన్న వైద్యుల నిర్లక్ష్యం కారణమా?? అన్నవి సమాధానం లేని ప్రశ్నలు!

వివిధ ప్రాంతాలలోని 'ఆసుపత్రుల'లో నవ జాత శిశువులు, చికిత్సకోసం చేరిన శిశువులు చనిపోయి ఉండడం గురించి ఏళ్లతరబడి ప్రచారం జరుగుతోంది. గుజరాత్‌లోను, రాజస్థాన్‌లోను ఇటీవల జరిగిన శిశు మరణాలు పరాకాష్ఠ. రాజస్థాన్‌లోని కోట నగరంలోని 'జెకెలోన్'అన్న వైద్యశాలలో ముప్పయి ఐదు రోజులుగా ప్రతిరోజూ ''అంతుపట్టని'' శిశు మరణాలు సంభవించాయి. దాదాపు నూట పది మంది శిశువులు ఈ కాలవ్యవధిలో అకాల మృత్యువు పాలయ్యారు. అయినప్పటికీ వైద్యశాల నిర్వాహకులు కాని, ప్రభుత్వాలు కాని నిరోధక చర్యలు తీసుకోకపోవడం వైఫల్యం మాత్రమే కాదు క్రూరమైన నిర్లక్ష్యం కూడ. ఈ క్రూరమైన నిర్లక్ష్యం ఎవరిదన్న విషయమై వారాల తరబడి రాజకీయ ప్రత్యర్థుల మధ్య మాటల యుద్ధం జరుగుతోంది. సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. గుజరాత్‌లోని రెండు ప్రధాన వైద్యశాలలలో డిసెంబర్‌లో నూట తొంబయి తొమ్మిది మంది శిశువులు మరణించడం సమాంతర వైపరీత్యం. రాజకోట, అహమ్మదాబాద్ నగరాలలోని వైద్యశాలలలో ఈ మరణాలు సంభవించాయట. అక్టోబర్, నవంబర్ మాసాలలో రాజ్‌కోటలోని వైద్యశాలలలో రెండువందల అరవై తొమ్మిది మంది శిశువులు, అహ్మదాబాద్‌లోని వైద్యశాలలలో ఇదే కాలవ్యవధిలో రెండు వందల యాబయి ముగ్గురు శిశువులు మరణించడం మానవత్వం నిండిన గుండెల వారిని కలచివేస్తున్న విషాదం! కోట వైద్యశాలలో జరిగిన మరణాలకు తమ ప్రభుత్వం బాధ్యత వహించవలసి ఉందని రాజస్థాన్ ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు సచిన్ పైలట్ స్వయంగా ప్రకటించడం నిర్లక్ష్యం నిహితమై ఉన్న ప్రభుత్వ వ్యవస్థకు సరికొత్త ధ్రువీకరణ. ఈ 'కోట'వైద్యశాల ప్రాంగణంలో పందులు యధేచ్ఛగా విహరిస్తున్నాయట...

ఇలా 'నిర్లక్ష్యం', 'క్రూరత్వం', 'లంచగొండితనం' వీటన్నింటికీ మించి ప్రజల హృదయ క్షేత్రాన్ని ఆవహించిన 'తరతరాల' పట్టించుకోనితనం వైద్య రంగాన్ని మాత్రమే కాదు, సకల జీవన రంగాలను సంక్షుభితం చేస్తున్నాయి. 'వ్యాపార సౌలభ్యం' ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్- గురించి ప్రభుత్వాలు హోరెత్తిస్తున్నాయి, మన దేశంలో వ్యాపార వాణిజ్య పారిశ్రామిక సౌలభ్యం పెరిగిందని బహుళ జాతీయ వాణిజ్య సంస్థలకు విశ్వాసం కలిగిస్తున్నాయి. ఇలా 'విశ్వాసం'నిండిన 'బహుళ జాతీయ సంస్థలు' దేశంలోకి చొఱబడిపోతుండడం ఇరవై ఆరేళ్ల 'ప్రపంచీకరణ' చరిత్ర! వాణిజ్య సౌలభ్యం పెరగడంలో 'బహుళ సంస్థలు' ప్రధానంగా విదేశీయ వ్యాపారపు 'ముఠాలు' మనలను దోపిడీ చేయడం మొదలైంది. ఈ దోపిడీ చేసే ప్రవృత్తి స్వదేశీయ వాణిజ్య సంస్థలను కూడ ఆవహించడం 'ప్రపంచీకరణ' ఫలితం... ఫలితంగా 'జీవన సౌలభ్యం' అడుగంటిపోతోంది! ''గిరాకీ, లభ్యత''- డిమాండ్, సప్లయ్- ప్రాతిపదికగా సామాజిక వ్యవస్థ నడుస్తోంది. ప్రజల అవసరం, జన జీవన సౌలభ్యం వంటి వాటికి ప్రాధాన్యం లేదు. అందువల్ల దేశంలోని అన్ని ప్రభుత్వ, ప్రభుత్వేతర వాణిజ్య రంగంలో మాత్రమేకాక సకల జీవన రంగాలలోను ''లభ్యత-గిరాకీ'' ప్రాతిపదికగా వ్యవస్థలు వికసించాయి, వికసిస్తున్నాయి... ఈ వికసన ప్రవృత్తికి 'బుద్ధిపెద్దది, అందువల్ల దోపిడీ చేయగలుగుతోంది... ఈ వికసన క్రమానికి 'హృదయం'లేదు. అందువల్ల విద్యావంతులను, వైద్యులను, అధికారులను, రాజకీయ వేత్తలను 'క్రౌర్యం' ఆవహించి ఉంది! 'ప్రపంచీకరణ' మొదలుకాక పూర్వం దశాబ్దుల క్రితమే అత్యధిక శాతం ఉన్నత విద్యావంతులు అవినీతిపరులు కావడం చరిత్ర... ఈ చరిత్రకు బ్రిటన్ దురాక్రమణ సమయంలో అంకురార్పణ జరిగింది. 'హృదయం'లేని బుద్ధిజీవులు విస్తరించడం బ్రిటన్ వారి విద్యావ్యవస్థ ఫలితం! అది ఇప్పటికీ కొనసాగుతోంది. ఉన్నత వైద్యులకు, అధికారులకు 'నైతిక ధ్యాస' లేకపోవడానికి ఇదీ కారణం... నైతిక ధ్యాస లేని వారు 'అవినీతి'ని అతి సహజమైన సంప్రదాయంగా, జీవన వ్యవహారంగా వ్యవస్థీకరించారు... అరవై ఏళ్ల క్రితం కవి సమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ ''దమయంతీ స్వయంవరము''అన్న సాంఘిక నవలను వ్రాశాడు. ఆ 'నవల'లో కథానాయకుడి కుమారుడికి చేయి విరిగింది, ప్రభుత్వ వైద్యశాలలో చేర్చారు. ''ఆ ఆసుపత్రిలో ఒకాయన ఉన్నాడు, పెద్ద డాక్టరు... ఆయన ఈ శస్త్రచికిత్సలో మహానుభావుడని ప్రతీతి... ఆయన నాలుగువందల దాకా అడిగాడు, చివరికి రెండువందలకి దిగేటప్పటికి నా పూర్వ ఋషులు దిగి వచ్చారు. రెండువందలు చేతిలో పొయ్యాయి. చికిత్స బల్లమీదికి ఎక్కాలి...'' ఇది ఏడు దశాబ్దులనాటి ప్రభుత్వ వైద్యశాలల తీరు. కానీ ప్రభుత్వేతర వైద్యశాలలు మొదలైన తరువాత 'పరిభాష' మారింది. 'లంచం'అన్నది క్రమంగా 'శుల్కం'-ఫీజ్-గా మారింది. ప్రభుత్వం మళ్లీ చెల్లిస్తుంది కనక రోగులకూ బాధ లేదు, వైద్యశాలల నిర్వాహకులకూ బాధ లేదు. అందువల్ల వైద్యశాలలవారు ఎంత దోచుకున్నప్పటికీ ఎవరికీ పట్టడం లేదు... ఇది సాధారణ వ్యవహారం. ప్రభుత్వం అప్పుడప్పుడు చర్య తీసుకొంటోంది. ఇది 'అపవాదం'- ఎక్సెప్షన్- మాత్రమే! అక్రమాలు జరుపుతున్న 171 వైద్యశాలలపై కేంద్ర ప్రభుత్వం ఇటీవల అభియోగాలను నమోదు చేసిందట... అపవాదం!

# కృత్రిమ మేధ జోరు!

కొత్త సంవత్సరం, కొత్త దశాబ్దం ఆరంభమైంది. ఇది కృత్రిమమేధ (ఏఐ) నామ సంవత్సరం... దశాబ్దంగా నిపుణులు భావిస్తున్నారు. ఇప్పటికే కీలక పాత్రను పోషిస్తున్న కృత్రిమ మేధ రాబోయే కాలంలో మరింత ముఖ్య భూమికను పోషించనున్నది.

తెలుగు నేలైన హైదరాబాద్‌లో ఈమేరకు అప్పుడే అనేక కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది రూ.3 వేల కోట్ల పెట్టుబడులు ఈ రంగంలోకి రానున్నాయని, అలాగే 200 స్టార్టప్ సంస్థలు స్థాపన జరగనున్నదని తెలంగాణ ఐటి శాఖ మంత్రి కేటీఆర్ కొత్త సంవత్సరం ఆరంభంలో పేర్కొన్నారు. టి హబ్-2 కూడా ప్రారంభంకానున్నదని చెప్పారు. ఐటీ అంటే ఇంటెలిజెన్స్ టెక్నాలజీ అని అభివర్ణించారు.

కృత్రిమమేధ మెగా నగరాలకు, మెట్రోపాలిటన్ నగరాలకు మాత్రమేనన్న అపోహ క్రమంగా పటాపంచలవుతోంది. వ్యవసాయం, ఆరోగ్యం, విద్య, పరిపాలన తదితర రంగాలలో అత్యంత కీలకంగా మారనున్నది. వర్తమాన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉన్నతీకరించేందుకు 'ఏఐ' విప్లవాత్మక పాత్రను పోషిస్తోంది. అనేకానేక సామాజిక సమస్యల పరిష్కారానికి ఏఐ ఆధారంగా స్టార్టప్ సంస్థలు ఇప్పటికే కృషిని ప్రారంభించాయి. వాటి ఫలితాలు వెలువడనున్నాయి.

కృత్రిమ మేధపై నీతి ఆయోగ్ రెండేళ్ళ క్రితమే ఒక వ్యూహాన్ని ప్రకటించింది. తెలంగాణ ప్రభుత్వం దీనిపై త్వరలో ఒక విధానాన్ని ప్రకటించనున్నది. దీని ద్వారా సామాన్యుడికి సైతం మేలుకలిగేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. భవిష్యత్‌లో ఈ రంగంలోనే ఎక్కువ ఉపాధి అవకాశాలు ఉండగలవని భావిస్తున్నారు. ఇంజినీరింగ్ కోర్సుల్లో 'ఏఐ'ని ప్రవేశపెట్టారు. మరికొన్నింటిలో ఈ ఏడాది ప్రవేశపెట్టనున్నారు. ఈ విషయమై ఒక కమిటీ పనిచేయనున్నది. 'టాస్క్'ద్వారా అధ్యాపకులకు శిక్షణనిచ్చేందుకు చర్యలు చేపడుతున్నారు. అలాగే పట్టణ-గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఈ అంశంపై అవగాహన పెంపొందించేందుకు, శిక్షణ ఇచ్చేందుకు సైతం కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం కృత్రిమ మేధపై పది సంస్థలతో ఎనిమిది ఒప్పందాలను కుదుర్చుకుంది. కొత్త సంవత్సరంలో ఉత్సాహపూరిత వాతావరణంలో ఈ ఒప్పంద కార్యక్రమం కొనసాగింది. కొన్ని మాసాల క్రితం కృత్రిమ మేధ వనరుల వేదిక (ఎన్ఎఐఆర్‌పీ)ని ఏర్పాటుచేయాలని ఆవిధంగా ఏఐపై జరిగే పరిశోధనలను ఒకే గొడుగుకిందకు తీసుకురావాలని కేంద్రం ఏర్పాటుచేసిన ఉన్నతస్థాయి కమిటి కేంద్ర ఐటి శాఖకు సూచించింది.

మనం చేసే ప్రయాణం, మన మొబైల్, మన వాహనం ఇప్పుడున్న రీతిలో ఇకముందు ఉండవన్నది యదార్థం. ఇప్పటికే డ్రైవర్ అవసరంలేని కార్ల తయారీ పెరిగింది. దీని వెనకాల ఉన్నది కృత్రిమ మేధనే. మన మొబైల్ మరింత స్మార్ట్‌గా పనిచేయడం వెనకాల సైతం కృత్రిమ మేధ దాగున్నది. అనూహ్యమైన పరిణామాలు కమ్యూనికేషన్స్ రంగంలో చోటుచేసుకోనున్నాయి. దానికంతటికి ఆధారం ఏఐ. మనం చేసే షాపింగ్ సైతం సరికొత్త అనుభూతిని కలిగించనున్నది. ఆన్‌లైన్ షాపింగ్ ప్రక్రియ అంతటా కృత్రిమ మేధ దాగున్నది. ప్రజల జీవితాలు సుఖమయం- సౌకర్యవంతం చేసేందుకు కృత్రిమ మేధ మరింత వన్నెకెక్కుతోంది.

ఈ నేపథ్యంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం సైతం ఏఐ కోర్సు ప్రవేశపెట్టేందుకు సిద్ధమైంది. ఒక కేంద్రాన్ని అతి త్వరలో ప్రారంభించనున్నది. మనిషి పరిష్కరించలేని అనేక సమస్యలకు ఏఐ పరిష్కారం చూపగలదని నిపుణులు భావిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం 'రూపా'నిధుల కింద ఓయూకు వంద కోట్లకు పైగా మంజూరయ్యాయి. ఇప్పటికే క్యాంపస్‌లో ఉన్న టెక్నాలజీ డెవలప్‌మెంట్ సెంటర్‌లో ఈ నూతన 'ఏఐ'కేంద్రాన్ని ఏర్పాటుచేయనున్నారు.

**గగన్‌యాన్..** చందమామపైకి వెళ్ళే భారత వ్యోమగాముల ఎంపిక పూర్తయింది. చారిత్రాత్మకమైన, ఈ గగన్‌యాన్‌కోసం భారత వైమానిక దళానికి చెందిన నలుగురు పైలెట్లు శిక్షణకోసం త్వరలో రష్యాకు బయలుదేరనున్నారు.

భారతదేశ చరిత్రలో ఇదొక కీలక మలుపు. యావత్ దేశం గర్వించే గగన్‌యాన్‌లో దాదాపు ఏడుగురు సిబ్బంది ఉంటారని, అంతరిక్షంలో వీరు దాదాపు ఏడురోజులు తమకు నిర్దేశించిన కార్యక్రమాలు నిర్వహిస్తారని ఇస్రో చైర్మన్ కె.శివన్ ఇటీవల తెలిపారు.

కొత్త దశాబ్దంలో సరికొత్త పరిణామమిది. ప్రపంచంతో కల్సి భారత్ అడుగేస్తోందని చాటి చెప్పేందుకు ఇదొక ఉదాహరణ.

ఈలోగానే చంద్రయాన్-3 ప్రాజెక్టును చేపడతామని శివన్ పేర్కొన్నారు. గత జూలై మాసంలో చంద్రయాన్-2 ప్రయోగం దాదాపు విజయవంతమైందని, ఈసారి 'సాఫ్ట్‌లాండింగ్' విషయంలో విజయం సాధిస్తామని శివన్ ఆశాభావాన్ని వ్యక్తంచేశారు.

**ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ సాధ్యమే!**

దేశ ఆర్థిక స్థితిగతులపై ఫిక్కీ ఇటీవల హైదరాబాద్‌లో గోష్ఠి నిర్వహించింది. అందులో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఛైర్మన్ రజనీశ్‌కుమార్ మాట్లాడుతూ.. భారత ఆర్థికవ్యవస్థ 5 ట్రిలియన్ల డాలర్ల స్థాయికి చేరగలదని, అందుకు నిర్దిష్టమైన సమయం చెప్పలేమని ఎంతో ఆశాజనకంగా మాట్లాడారు. ఇందుకు అవసరమైన పెట్టుబడుల సమీకరణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఔత్సాహిక పెట్టుబడిదారులకు ఇచ్చే ప్రోత్సాహం లాంటి అంశాలు ముడిపడి ఉన్నాయన్నారు. ఇందుకు ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించడం కీలకమన్నారు. పెరిగిన సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకుని ముందడుగువేయాలని సూచించారు. ఆధునిక సాంకేతికత ఏఐ, మెషిన్ లెర్నింగ్, బ్లాక్‌చైన్ లాంటివి పట్టించుకోకుంటే వెనకబడతామని హెచ్చరించారు. ప్రభుత్వరంగ బ్యాంకుల విలీనం సరైనదేనని కూడా ఆయన తెలిపారు. ఢిల్లీలో ప్రధానితో పారిశ్రామికవేత్తల సమావేశంలోనూ ఇదే విషయం ప్రస్తావనకొచ్చింది. ఇది ఇలాఉంటే... ఐఐఎం, ఎం.బి.ఏ.లలో ప్రవేశంకోసం రాసిన 'క్యాట్'లో తెలంగాణకు చెందిన ముగ్గురు విద్యార్థులు టాపర్లుగా నిలిచారు. వీరి పర్సంటైల్ 99కి పైనే ఉంది. జాతీయస్థాయిలో రెండు లక్షలకు పైగా మంది పరీక్ష రాయగా తెలంగాణకు చెందిన ముగ్గురు టాపర్లుగా నిలవడమంటే రానున్న రోజులు ఎంత విజ్ఞానాన్ని వారు ఒడిసిపట్టనున్నారో బోధపడుతుంది. ఈ రకమైన 'స్పర్ధ' దేశవ్యాప్తంగా కనిపిస్తుండటంతో దేశ ఆర్థిక వ్యవస్థ మెరుగుపడుతుందనడంలో ఏమాత్రం సందేహంలేదు. సాంకేతికత, నైపుణ్యం, వనరులు, అవకాశాలు దండిగా ఉన్నాయి.

**మడతపెట్టే స్మార్ట్‌ఫోన్లు..** ఈ సంవత్సరం మార్కెట్లోకి మడతపెట్టే స్మార్ట్‌ఫోన్లు రానున్నాయి. చైనాకు చెందిన హువాయే, గ్జియామి సంస్థలు ఈ ఫోన్లను తీసుకురానున్నాయి. ఈమేరకు ఆ కంపెనీలు పెటెంట్లను పొందినట్టు సమాచారం. భారతదేశంలో వీటి వాడుకతోపాటు 5జి టెక్నాలజీ అందుబాటులోకి రాబోతోంది. త్వరలో కేంద్ర ప్రభుత్వం స్పెక్ట్రమ్‌ను వేలం వేయనున్నది. ప్రపంచంలోని ప్రముఖ కంపెనీలు ఇందులో పాల్గొననున్నాయి. ఇప్పటికే హువాయే వేగంగా పావులు కదుపుతోంది. ఈ టెక్నాలజీవల్ల డేటా బట్వాడా వేగం అనూహ్యంగా పెరగనున్నది. ఇంటర్నెట్ వేగం పెరగడమంటే మనిషి ఆలోచనల వేగం పెరగడమే.

**- వుప్పల నరసింహం..** 9985781799

# ఎన్నికల కోసమేనా అమెరికా నాటకాలు..?

ఎన్నికలు వస్తున్నాయంటే చాలు యుద్ధ బూచి కొన్ని దేశాలకు కలిసొస్తోంది. యుద్ధ బూచి చూపించి గెలవాలనే తపన వివిధ దేశాల్లోని అధినేతల్లో పెరిగిపోతోంది. అమెరికాలో రానున్న ఎన్నికల్లో తన విజయానికి అనేక పాచికలు వేస్తున్న అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ భారత్ నుండి మేధోవలసను అడ్డుకట్ట వేసి స్థానిక యువతను ఆకట్టుకున్నారు. ఇపుడు రెండో పాచిక వేస్తున్నారు. ఇరాన్‌తో యుద్ధానికి కాలుదువ్వుతున్నారు. కేవలం విజయం కోసం యుద్ధవాతావరణాన్ని వాడుకుంటే పర్వాలేదు, నిజంగానే అది యుద్ధానికి దారితీస్తే పరిస్థితి ఏమిటనేది మిగిలిన ఆసియా దేశాల ఆందోళన. అ అదిగోపులి చందంగా నిజంగా పులివస్తే అందర్నీ మింగేసినట్టు యుద్ధం వస్తే అమెరికా ఎన్నికల మాట అటుంచి, మధ్య ప్రాచ్యదేశాలకూ, పశ్చిమాసియా దేశాలకు పెను ముప్పు తప్పదు.

గతసారి ఎన్నికల సమయంలో అప్పటి అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా మరోమారు అధికారంలోకి రావడానికి ఇరాన్‌తో యుద్ధానికి తెగపడే ప్రమాదం ఉందని 2011లో ట్విట్టర్ వేదికగా డోనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలను ఇపుడు తేలికగా తీసుకోలేం. 1998లోనూ అప్పటి అధ్యక్షుడు బిల్ క్లింటన్ అభిశంసన దర్యాప్తు కీలక సమయంలో ఇరాన్‌పై వైమానిక దాడులకు పాల్పడిన అంశాన్నీ మరిచిపోలేం. యుద్ధ కాంక్షను ప్రకటించిన తర్వాత కొన్ని ఆసియా దేశాల్లో జరిగిన ఎన్నికల ఫలితాలనూ ప్రజలు అంతాచూశారు.

ఇంట్లో శాంతి యుత వాతావరణం కోరుకున్నట్టే దేశంలోనూ, ఖండాల మధ్య, ప్రపంచంలోనూ యుద్ధభీతి లేని వాతావరణాన్ని సృష్టించాలని, అంతర్జాతీయ శాంతిని కాపాడాలనే లక్ష్యానికి కట్టుబడి గత ఏడున్నర దశాబ్దాలుగా ఐక్యరాజ్య సమితి అన్ని రంగాల్లో ఎనలేని కృషి చేస్తోంది. అయితే గతకాలపు కక్షలూ, కార్పణ్యాలను మరచిపోని దేశాలు పక్కదేశాలపై ఎపుడూ కయ్యానికి కాలుదువ్వుతునే ఉన్నాయి. భారత్ సరిహద్దు దేశాలు కవ్వింపులకు పోతున్నట్టే ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు యుద్ధానికి సిద్ధం అంటూ రెచ్చగొడుతున్నాయి. సాధారణ దేశాల మధ్య ఇవి మాటలకే పరిమితం అవుతుండగా, అగ్రదేశాలతో వాదనలు కార్యరూపాన్ని దాలుస్తున్నాయి. తాజాగా అమెరికా ఇరాన్ మధ్య జరుగుతున్న మాటల యుద్ధం ఏ ప్రస్థానానికి దారితీస్తుందో అని ప్రపంచంలోని మిగిలిన దేశాలు వణికి చస్తున్నాయి. ఉరిమి ఉరిమి మంగళంమీద పడ్డట్టు ఆ రెండు దేశాల మధ్య యుద్ధం పశ్చిమ ఆసియాకు, మధ్య ప్రాచ్య ప్రాంతాలకే పరిమితం కాబోదు, ఆసియా ఖండంలోని 47దేశాలపైనా దాని ప్రభావం పడుతుంది. ఈ ప్రభావం ఆర్థిక వ్యవస్థనూ, సామాజిక వ్యవస్థను సైతం చిత్తడి చేస్తుంది.

పశ్చిమాసియాపై యుద్ధమేఘాల ప్రభావం అపుడే మార్కెట్లను కుదిపేస్తోంది. చమురు ధరలతో పాటు బంగారం , వెండి ధరల్లో పెరుగుదల సూచిస్తోంది. ఇరాన్ ఉన్నత సైనిక కమాండర్ మేజర్ జనరల్ ఖాసిం సులైమానీని అమెరికా లేజర్ క్షిపణి డ్రోన్ దాడితో హతమార్చింది. దానికి ప్రతీకారం తప్పదని ఇరాన్ హెచ్చరించడంతో ఈ ప్రాంతం అంతా చిగురుటాకులా వణుకుతోంది. ఇరాక్, సిరియాల్లో ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాదులను మట్టుబెట్టడానికి జనరల్ ఖాసిం సేవలను పరోక్షంగా పొందిన అమెరికా ఇపుడు తమ వరకూ వచ్చేసరికి ఆయననే మట్టుబెట్టింది. సులేమానీ మృతదేహానికి ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో వేలాది మంది కన్నీళ్లతో నివాళులు అర్పించారు. ఆ దేశ అగ్రనాయకుడు అయతుల్లా అలీ ఖుమైనీ , అధ్యక్షుడు హసన్ రౌహానీ ఇతర నేతలు, సులేమానీ కుమారుడు పాల్గొన్నారు. సులేమానీని హతమార్చినందున అమెరికా బలగాలు తమ భూభాగం నుండి వైదొలగాలని ఇరాక్ పార్లమెంటు తీర్మానం చేసింది. దానిపై డోనాల్డ్ ట్రంప్ మండిపడ్డారు. ఇరాక్‌పై పెట్టిన సైనిక ఖర్చులను తిరిగి తమకు చెల్లించాలని లేకుంటే భారీగా ఆంక్షలు విధిస్తామని కూడా ఆయన హెచ్చరించారు. ఇరాక్‌లో వైమానిక స్థావరాన్ని నిర్మించడానికి వందల కోట్లు డాలర్లు ఖర్చయ్యాయని, ఆ సొమ్మును ఇవ్వకుంటే తాము ఇరాక్‌ను వీడేది లేదని స్పష్టం చేసింది. అంతర్జాతీయ నిబంధనలు ఉన్నా ఇరాన్ వారసత్వ ప్రదేశాలపై అమెరికా దాడులు కొనసాగిస్తుందని ట్రంప్ స్పష్టం చేశారు. దీంతో ఇరాన్ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తలకు వెలకట్టింది. ట్రంప్ తల తెస్తే 575 కోట్లు ఇస్తామని ఇరాన్ సుప్రీంలీడర్ అయతుల్లా అలీ ఖుమైనీ పేర్కొన్నారు. ఇరాన్‌లో ప్రతి పౌరుడి నుండి ఒక డాలర్ సేకరించి ఈ నిధిని ట్రంప్ తల తెచ్చిన వారికి ఇస్తామని ఆయన ప్రకటించారు.

ఆల్‌ఖైదా అధినేత ఒసామా బిన్ లాడెన్‌ను ఒబామా ప్రభుత్వం, ఐఎస్ పెద్ద దిక్కు అబు బకర్ అల్ బగ్దాదీని ట్రంప్ ప్రభుత్వం మట్టుబెట్టాయి. వీరిద్దరూ ఉగ్రవాద సంస్థల అధినేతలు. కానీ మేజర్ జనరల్ సులేమానీ ఇరాన్ సర్వోన్నత నేత ఖుమైనీకి అత్యంత సన్నిహితుడు.

వాతావరణ మార్పుల దుష్ప్రభావాన్ని కట్టడి చేయడానికి ఉద్దేశించిన పారిస్ ఒడంబడిక, రెండోది ఇరాన్ అణు కార్యక్రమాన్ని నిలిపేసేలా చేసిన కీలక ఒప్పందాల నుండి ముందుగా వైదొలగింది అమెరికానే. మరో పక్క జరూసలేమ్‌ను అధికారికంగా ఇజ్రాయిల్ రాజధానిగా గుర్తించాలని నిర్ణయం తీసుకుని పశ్చిమాసియా సంక్షోభానికి పరిష్కారం చూపిస్తున్నట్టు చెబుతోంది. ఇవన్నీ ఉద్రిక్తతలకు కీలకమైన కారణాలే.

2015 అణు ఒప్పందంలోని ఇంధన శుద్ధిపై పరిమితులను ఇకపై పాటించేది లేదని ఇరాన్ ప్రకటించింది. శుద్ధి చేసిన యురేనియం నిల్వలను పెంచుకుంటామని, ఇందుకోసం పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలను విస్తృతం చేస్తామని తెలిపింది. అణ్వాయుధాలను తయారుచేయబోమన్న మునుపటి హామీకే కట్టుబడి ఉంటామని స్పష్టం చేసింది.

ఇరాక్ రాజధాని బాగ్దాద్‌లోని తమ సైనిక స్థావరం, దౌత్య కార్యాలయాలపై కతయిబ్ హెజ్‌బొల్లా తీవ్రవాద సంస్థ చేసిన దాడికి ప్రతీకారంగానే తీవ్రంగా స్పందించినట్టు అమెరికా చెబుతున్నా, ఈ యుద్ధ భావన వెనుక ఏడు దశాబ్దాల నేపథ్యం ఉందనేది నిర్వివాదాంశం. కతయిబ్ ఇస్లామిక్ స్టేట్‌తో ఇరాక్ సైన్యంతో, ఇంకోవైపు అమెరికా సంకీర్ణ సైన్యంతో తలపడుతునే ఉంది. ఇరాన్ మిత్రుడు, సిరియా అధ్యక్షుడు బసర్ అల్ అసద్ సైన్యానికి ఆయుధాలను చేరవేయడంలోనూ సహకరిస్తోంది. అమెరికా ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు ఈనాటివి కానే కావు.దాదాపు 67 ఏళ్లుగా కొనసాగుతున్నాయి. 1953లో ఇరాన్ ప్రధాని మహ్మద్ ముసాదెక్‌ను పదవీచ్యుతుడ్ని చేసి తమ విశ్వాస పాత్రుడైన రాజు షా మహ్మద్ రెజా పహ్లావీని అధికార పీఠంపై కూర్చోబెట్టడం ద్వారా ఇరాన్‌తో విబేధాలకు అమెరికా బీజం వేసింది. 1979లో అమెరికా అండతో కొనసాగుతున్న పాలకుడు మహ్మద్ రెజా పహ్లావికి వ్యతిరేకంగా ప్రజలు తిరుగుబాటు చేశారు. దాంతో ఆయన అమెరికాకు పారిపోయారు. ఆందోళన కారులు టెహ్రాన్‌లోని అమెరికా ఎంబసీని 1979 నుండి 1981 జనవరి వరకూ ముట్టడించారు. ఇస్లామిక్ రివల్యూషనిస్టులు తిరుగుబాటు చేసి షాను జనవరి 16వ తేదీన తరిమేయడంతో ఆ తర్వాత రెండు వారాలకు మత పెద్ద అయతల్లా అలీ ఖుమైనీ ఇరాన్‌కు తిరిగి వచ్చారు. అమెరికా రాయబార కార్యాలయంపై నిరసనలు వ్యక్తం చేస్తూ దాడికి దిగడంతో పాటు 52 మంది అమెరికన్లను 444 రోజుల పాటు నిర్బంధించారు. ఈ చరిత్రను మరిచిపోని అమెరికా 1988లో ఇరాన్ ప్రయాణీకులున్న విమానాన్ని తమ యుద్ధనౌకతో అమెరికా కూల్చివేసింది. దాంతో 290 మంది ప్రయాణీకులు చనిపోయారు. అది యుద్ధవిమానం అని తాము పొరపాటుపడినట్టు అమెరికా చెప్పుకొచ్చింది. ఇరాన్‌తో పాటు ఇరాక్, ఉత్తరకొరియాలు దుష్టత్రయం అని 2002లోనే అమెరికా పేర్కొంది.

ఇరాన్ అణుకార్యక్రమాన్ని కొనసాగిస్తోందన్న దుగ్ధతో ఆ దేశ ఆర్థిక వ్యవస్థకు ప్రాణాధారమైన చమురు రాబడులపై దెబ్బకొట్టడానికి అమెరికా మొదటి నుండి ప్రయత్నిస్తూనే ఉంది. ఇరాన్‌ను, ఆ దేశ రివల్యూషనరీ గార్డ్సును తీవ్రవాద జాబితాలో చేర్చింది. అమెరికా , బ్రిటన్, ఫ్రాన్స్, రష్యా, చైనా, జర్మనీలు ఇరాన్‌తో అణుఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. పరోక్షంగా అణుపరిశోధనలు చేయకుండా ఇరాన్‌పై ఆంక్షలను విధించింది. వీటిని ఎత్తివేస్తే తమ అణుకార్యక్రమాన్ని పరిమితం చేసుకుంటామంటూ ఆయాదేశాలతో 2015లో ఇరాన్ ఒప్పందం కుదుర్చుకుంది. ఆ ఒప్పందం నుండి 2018 మేలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వైదొలిగారు. ఇరాన్‌పై మళ్లీ ఆంక్షలను విధించారు. ఇరాన్‌తో చమురు వ్యాపారం చేయవద్దంటూ భారత్‌తో సహా ఆసియా దేశాలపై ఒత్తిడి తెచ్చారు. దీంతో ఇరాన్ చమురు ఎగుమతులు పూర్తిగా ఆగిపోయాయి. దేశంలో ఆర్థిక సంక్షోభం హెచ్చుమీరింది. గత సెప్టెంబర్ 14న సౌదీలోని అరామ్‌కో చమురు క్షేత్రంపై ఇరాన్ మద్దతున్న హౌతీ తిరుగుబాటుదారులు దాడి చేశారనేది అమెరికా ఆరోపణ. పర్షియన్ గల్ఫ్‌లో చమురు నౌకలపై దాడులకూ, గత ఏడాది జూన్‌లో ఆరు చమురు ట్యాంకర్లు దగ్ధం కావడానికి ఇరాన్ కారణమని అమెరికా ఆరోపిస్తోంది. జూన్ 20న హర్మోజ్ జలసంధిపై ఎగురుతున్న అమెరికా డ్రోన్‌ను ఇరాన్ బలగాలు కూల్చేశాయి. ఇలా రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు అంతకంతకూ పెరుగుతూ వస్తున్నాయి.

వీటి ప్రభావం భారత్‌పై తప్పకుండా ఉంటుంది. పశ్చిమాసియా దేశాల నుండి 40 బిలియన్ డాలర్ల విదేశీమారక ద్రవ్యం దక్కుతోంది. అది ఆగిపోయే ముప్పు ఉంది. ఆ దేశాల్లో సుమారు 80 లక్షల మంది భారతీయులు పనిచేస్తున్నారు. వారందరూ వెనక్కు రావడంతో దేశంలో నిరుద్యోగ సమస్య ఏర్పడుతుంది. అక్కడి నుండి భారతీయులను వెనక్కు తరలించడం కూడా తలకుమించిన భారమే అవుతుంది. ఇంకో పక్క ఎగుమతులు, దిగుమతులు, చమురు ఉత్పత్తులపైనా సమస్యలు ఎదురవుతాయి. పెట్రోల్, డీజిల్‌కు గిరాకీ ఏర్పడి ధరలు పెరిగే ముప్పు ఉంది. వీటన్నింటితో సర్‌చార్జిల ముప్పు భారతీయులందరిపై పడుతుంది. ఇవన్నీ మనం గతంలోని గల్ఫ్‌యుద్ధ సమయంలో చూసివనే.

**- బి.వి. ప్రసాద్**

99633 45056

# ఆదరణ కోల్పోతున్న రైతన్న

గత చరిత్రను, మన పూర్వికుల అనుభవాలను నెమరువేసుకుంటూ ఆనందంగా జీవితం గడపడానికే ఉత్సవాలను చేస్తూ ఉంటాము. సమాజానికి ఒక నిర్దేశిత సందేశం ఇవ్వడానికే దినోత్సవాలు చేస్తూ ఉంటాము. ప్రపంచ వ్యాప్తంగా దేశాలవారీగా ఒక్కొక్క ప్రత్యేకతను పురస్కరించుకుని ఆయా సందర్భాలనుబట్టి దినోత్సవాలను జరుపుకుంటారు. అయితే మనం రోజూ బ్రతకడానికి తినే తిండిని అందిస్తున్న రైతును మాత్రం మరచిపోతున్నాం. భారత మాజీ ప్రధాని చౌదరీ చరణ్‌సింగ్ జన్మదినాన్ని అంతర్జాతీయ రైతు దినోత్సవంగా జరుపుకుంటారు.

✻ **చరిత్ర:** ఆదిమానవులు మొదటగా జంతువుల మాంసం, దుంపలు, కాయలు, పండ్లు మొదలైన వాటిని ఆహారంగా తీసుకునేవారు. కొంత కాలమైన తర్వాత నెమ్మదిగా వ్యవసాయ పద్ధతులు నేర్చుకుని కొద్ది మొత్తంలో ఆహారాన్ని ఉత్పత్తిచేయడం నేర్చుకున్నారు. ఆధునిక పురాతత్వ శాస్త్రవేత్తల ప్రకారం పప్పుదినుసులు మొదలైన ఆహార పదార్థాలు, పశుపోషణ మొదలైన వృత్తులు క్రీ.పూ. 7000లోనే మధ్యధరా ప్రాంతానికి చెందిన దేశాల్లో బాగా వ్యాప్తిచెంది ఉండేవి. క్రీ.పూ. 3000 నాటికి ఈజిప్షియన్లు, మెసపుటేమియన్లు పెద్ద ఎత్తున వ్యవసాయ పద్ధతులను, ఎరువుల వాడకం, సాగునీటి పద్ధతులు చేపట్టారు.

✻ వ్యవసాయం యొక్క చరిత్ర మానవ చరిత్రలో అతిపెద్ద అంశము. ప్రపంచవ్యాప్త సామాజిక ఆర్థికప్రగతిలో వ్యవసాయాభివృద్ధి ఒక కీలకాంశము. 'వేటాడటం'ద్వారా ఆహార సముపార్జన చేసుకొనే స్థితిలో ఉన్న సంస్కృతుల్లో కనిపించని సంపద సమకూర్చుకోవటం మరియు సైనిక కలాపాల వంటి ప్రత్యేకతలు వ్యవసాయం అభివృద్ధి చెందడంతోనే ప్రారంభమయ్యాయి. సమాజంలోని కొందరు రైతులు తమ కుటుంబ ఆహార అవసరాలకు మించి పండించటం ప్రారంభించడంతో తెగ/ జాతి/ రాజ్యంలోని మిగిలిన వ్యక్తులకు ఇతర వ్యాపకాలను పోషించే వెసులుబాటునిచ్చింది.

✻ **రైతు చేసే వ్యవసాయ పనులు-(ఒక పంట కాలంలో)**

✻ **దుక్కి దున్నడం:** పంట పండించే ముందు సరైన కాలంలో దుక్కిదున్నడం, ఈ ప్రక్రియ మొట్టమొదటిసారిగా చేసే వ్యవసాయపు సాగుపని. దుక్కి దున్నడానికి 'నాగలి'ని విరివిగా ఉపయోగిస్తారు.

✻ **భూమిని చదునుచేయడం:** పొలంలోని మట్టి గడ్డలవలన నేల ఎగుడుదిగుడుగా ఉంటుంది. దీనివల్ల ఆ నేలలో విత్తనాలు జల్లడానికి, నారు మొక్కలువేయడానికి అనువుగా ఉండదు. కాబట్టి నేలను చదునుచేయాలి.

✻ **నీరు పెట్టడం:** మట్టిగడ్డలు చదునుగా మరియు విత్తనాలు వేయడానికి అనువుగా ఉండటానికి నీరు పెడతారు.

✻ **విత్తడం:** విత్తేముందు రైతులు ఏ వ్యాధిలేని విత్తనాలు ఎంపిక చేస్తారు. దీనివల్ల పంట దిగుబడి అధికంగా ఉంటుంది.

✻ నారు నాటడం లేదా ఊడ్చడం.

✻ దారులు చేయడం

✻ **కలుపుమొక్కల్ని తొలగించడం:** పొలాల్లో సాగుమొక్కలతోపాటు నేల, నీరు పోషక పదార్థాలు వెలుతురుకూ పోటీపడుతూ పెరిగే అవసరం లేని మొక్కలను తొలగిస్తారు.

✻ **నీటిపారుదల:** మొక్క ఎదుగుదలకు పంటల ఉత్పత్తులకూ నీరు చాలా అవసరం.

✻ **ఎరువులు:** మొక్కల పెరుగుదలకు వివిధరకాల పోషక పదార్థాలు కావాలి. అవి కార్బన్, హైడ్రోజన్, ఆక్సిజన్, నత్రజని, ఫాస్పరస్, కాల్షియం, మెగ్నీషియం, ఇనుము, రాగి, మాంగనీస్, జింక్, మాలిబ్దినం, బోరేట్, క్లోరిన్ మొదలైనవి. కర్మాగారాల్లో తయారైన ఎరువులే కాకుండా సేంద్రియ ఎరువులను కూడా రైతు ఉపయోగించుకుంటాడు.

✻ పురుగుమందులు చల్లడం, పంటకోయడం, కోసిన పంటని ఎండబెట్టడం, కట్టలు కట్టడం, కుప్పవేయడం, నూర్చడం లేదా ధాన్యాన్ని వేరుచేయడం, తూకం, బస్తాలు నింపడం.

రైతు ఉపయోగించే వ్యవసాయ పనిముట్లు, నాగలి, గొడ్డలి, కొడవలి, పలుగు, పార, ఏతము, ఎద్దులబండి మొదలగునవి.

ఒక క్రమపద్ధతిలో ఆరుగాలం కష్టపడి తన చెమటను ధారబోసి పంటను పండించే రైతు ఆ తరువాత దశలో అడుగడుగునా మోసపోతూనే ఉన్నాడు. (దీనికి అనేక కారణాలు, పరిస్థితులు ఉన్నాయి)

✻ **భారతదేశంలో వ్యవసాయం:**

భారతదేశంలో పంట కాలాన్ని మూడువిధాలుగా వర్గీకరించారు.

1) ఖరీఫ్ పంటకాలం (జూన్-అక్టోబర్) 2) రబీ పంట కాలం (అక్టోబర్-మార్చి, ఏప్రిల్) 3) జైద్ పంటకాలం (మార్చి- జూన్)

✻ **వ్యవసాయ- విద్య:** 1) డిగ్రీ: ఎమ్‌సెట్ పరీక్ష ద్వారా రకరకాల సైన్స్ ఇంజనీరింగ్ కోర్సులు ఉన్నాయి. అవి బీఎస్సీ (వ్యవసాయం), బీఎస్సీ (ఉద్యానవనం), బివిఎస్‌సి మరియు పశుగణాభివృద్ధి, బిఎస్సీ(వాణిజ్య వ్యవసాయం, వ్యాపార నిర్వహణ) బిఎఫ్‌సి. 2) బి.టెక్ (జీవ, సాంకేతిక శాస్త్రం, బి.టెక్ (ఆహార విజ్ఞానం మరియు సాంకేతికం), బి.టెక్ (వ్యవసాయ ఇంజనీరింగ్), బి.టెక్ (పశుపోషణ). 3) పాలిటెక్నిక్: ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయంలో రెండేళ్ళ డిప్లొమా కోర్సులు అందజేస్తున్నాయి.

✻ **ఉపాధి:** స్వయం ఉపాధితోపాటు, ప్రభుత్వ, ప్రైవేటురంగాలలో వివిధ ఉపాధి అవకాశాలున్నాయి. వివిధ వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, భారత వ్యవసాయ పరిశోధనా సంస్థకి సంబంధించిన వివిధ ప్రాంతీయ కేంద్రాలలో కృషి విజ్ఞాన కేంద్రాలు, నేషనల్ డైయిరీ రీసెర్చ్, ఫారెస్ట్‌రిసెర్చ్, వెటర్నరీ రీసెర్చ్, వివిధ పేర్లతో ఉపాధి అవకాశాలు ఉన్నాయి.

ఉన్నత విద్యలో వ్యవసాయ రంగానికి సంబంధించిన అనేక కోర్సులను చదువుతున్నప్పటికీ, ఉపాధి అవకాశాలు ఉన్నప్పటికీ వాస్తవంగా నేడు రైతును ఎవరు కూడా పట్టించుకోకపోగా, రోజురోజుకు రైతు మోసపోతూనే ఉన్నాడు.

వ్యవసాయాన్ని ప్రోత్సహిద్దాం రైతును బ్రతకనిద్దాం!

**- సూర రాజేందర్**

## ఉత్తరాయణం

### పౌరసత్వ చట్టంపై ఆందోళనలు వద్దు..

పౌరసత్వ చట్టంపై ఆందోళనలు ఇంకా కొనసాగటం మంచిది కాదు. ఒకవైపు కేంద్ర ప్రభుత్వమే కాక ఢిల్లీ జుమామసీదు ఇమామ్ శ్రీ బుఖారీ, అజ్మీర్ దర్గా వంటి ఎందరో ముస్లిం మత పెద్దలు మన దేశ ముస్లింలకు నష్టంలేదని స్పష్టం చేశారు. అత్యధిక ప్రజానీకం కూడ సమర్థిస్తుంది. అయితే కొన్ని విపక్షాలు అదిగో పులి అంటే అదిగో తోక అన్నట్లు భవిష్యత్తులో ప్రమాదం అని భయపెడుతుంటే, వేల కోట్ల రూపాయల కుంభకోణాల్తో అధికారం కోల్పోయి ఒడ్డున బడ్డ చేపల్లా గిలగిలలాడే కొన్ని కుల, ప్రాంతీయ కుటుంబ పార్టీ పెద్దలు అగ్నికి ఆజ్యంపోస్తున్నారు. అక్రమ వలసలు పెరిగితే ఎంత ప్రమాదమో బెంగాల్ విధ్వంస సంఘటనలు తెల్పుతున్నాయి. అసలు ఈ సమస్య కేంద్రానిది. శరణార్థులు, చొరబాటుదార్ల సమస్యను మన దేశం పొరుగు దేశాలతో చర్చించి పరిష్కరించుకోవాలి. ఇప్పటికే బంగ్లాదేశ్ తమ పౌరులను స్వీకరించటానికి వారి వివరాలు కోరింది. మన దేశంలో రెండు కోట్ల మందిపైగా శరణార్థులు అక్రమ చొరబాటుదార్లున్నారట. మన దేశం ఇంతవరకు ఎవరినీ బలవంతంగా తరిమివేయలేదు, శిక్షించలేదు. మన పౌరులపై చర్యలు తీసుకుంటే చట్టసభలు, కోర్టులు, సోషల్ మీడియా రక్షణగా వుంటాయి. చివరిగా మన పౌర సమాజం వుంది. అసలు ఈ చట్టం బీజేపీ హడావుడిగా పెట్టలేదు. 2014 ఎన్నికల ముందు నుండే మత వేధింపులు, హింసలకు గురై పాక్, బంగ్లా, ఆఫ్ఘన్ దేశాల నుండి వచ్చే కొద్దిమంది శరణార్థులకు ఆశ్రయం కల్పిస్తామని చెపుతూనే వుంది. (పాకిస్తాన్‌లో కనేరియా వంటి ప్రముఖ క్రీడాకారుడినే తోటి ఆటగాళ్ళు అంటరానివాడిగా వేధించారని సాటి ముస్లిం క్రీడాకారులే తాజాగా వెల్లడించారు).

ఐరాస ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయం అంటూ మమత వింత అభిప్రాయం వెలిబుచ్చారు. అక్రమ చొరబాట్లు తక్కువ జనాభాగల ధనిక దేశాలే అంగీకరించవు.

వివాదాస్పద విషయంలో కూడ కొన్ని రాజకీయ పార్టీలు, ఏటా బ్లాక్‌డే నిర్వహిస్తుంటాయి. అవి ప్రభుత్వ వ్యతిరేక ప్రదర్శనలనుకుంటాయి గాని, అవి పరస్పర అప నమ్మకాలు, అభద్రతా భావం పెంచుతాయి. వామపక్షాలు హిందూత్వంపై పోరాటం అంటారు గాని ఆ క్రమంలో హిందూ వ్యతిరేక పార్టీలుగా ముద్రబడుతున్నాయి. కార్మికుల పక్షపాతమే గాని, సామాన్యుల కంటే ఎన్నో రెట్లు సౌకర్యాలు, ఆదాయం వున్న ప్రభుత్వోద్యోగుల కోసం పోరాడతాయి గాని బాధ్యతలపై వారిని చైతన్యపరచరనే అపవాదు. అందుకే ఆర్థిక అసమానతలు, పేదరికం పెరిగి పోతున్నా వారి ఓటు బ్యాంకు తరిగిపోతుంది. కనుక నిజాయితీగల నేతలున్న పార్టీలుగా పేరొందిన వామపక్షాలు ఆర్థిక అసమానతలు, పేదరికంపై పోరాడాలి గాని, కేవలం మోడీ వ్యతిరేక పోరాటం కారాదు.

మన ప్రభుత్వాలు ఐటీ, ఆటో రంగాలకు అధిక ప్రోత్సాహం ఇస్తున్నా నిరుద్యోగం, పేదరికం పెరగటానికి కారణం ఇంకా పేదలు ఒకరిద్దరితో కుటుంబ నియంత్రణ పాటించకపోవటం, యాంత్రీకరణ, రిటైర్మెంటు వయసుపెంచుకుంటూ పోవటం, అక్రమవలసలు కూడ కారణమే. కనుక ప్రభుత్వాలు ఆ సమస్యలపై తక్షణమే దృష్టిసారించాలి. పారిశ్రామిక మాంద్యాలు ప్రతి దేశానికి తప్పదు కనుక గ్రామీణ ప్రాంతానికి కూడ అధిక నిధులు కేటాయించి వ్యవసాయ, పాడి పరిశ్రమ, గ్రామీణ పరిశ్రమలను కూడ ప్రోత్సహిస్తే అక్కడ ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుంది. ఆహారోత్పత్తుల దిగుబడులు పెరిగి పప్పుధాన్యాలు, వంట నూనెల వంటి విదేశీ దిగుమతులు తగ్గించుకోవచ్చు.

**- తిరుమలశెట్టి సాంబశివరావు, నర్సరావుపేట**

# చీకటి పడితే..

## ఢిల్లీలోని నిర్భయ బస్టాప్‌కు వెళ్లాలంటేనే భయం

❖ అడ్డూ అదుపు లేని పోకిరీల చేష్టలు ❖ హస్తిన మహిళల ఆందోళన
❖ వెన్నాడుతున్న 'అంధకార' ఛాయలు

న్యూఢిల్లీ, జనవరి 7: నిర్భయ హత్యాచార దోషులకు మరణశిక్ష పడడం పట్ల దేశవ్యాప్తంగా ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తున్నాయి. ఏడేళ్ల క్రితం ఢిల్లీలోని ఓ బస్టాప్‌లో ఆనాటి పెను విషాధాన్ని ఇంకా తలపించే ఛాయలు కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నాయి. దక్షిణ ఢిల్లీలోని మునిర్కా బస్టాపును చూస్తేనే జనం అసహ్యించుకోవడం, గర్హించడం, ఏమిటీ దారుణం అని తిట్టడం నిత్యకృత్యమైంది. నిర్భయ ఘటన జరిగి ఏడేళ్లు గడిచినా దేశంలో మహిళలకు ఏదీ భద్రత అన్న ఆగ్రహాన్ని ఈ బస్టాపును చూసినపుడల్లా మహిళలు వ్యక్తం చేస్తూనే ఉన్నారు. ఇదే బస్టాపులో బస్సెక్కిన నిర్భయను నలుగురు కామాంధులు సామూహిక అత్యాచారం జరిపి హతమార్చిన విషయం తెలిసిందే. రాత్రి తొమ్మిది గంటలు దాటితే ఈ బస్టాపు ప్రాంతం అనధికార పార్కింగ్ ఏరియాగా మారిపోతోందని నిత్యం ప్రయాణించే మహిళలు చెబుతున్నారు. ఇప్పటికి కూడా బస్సెక్కడానికి వచ్చిన తమపై పురుషులు వ్యంగ్యంగా వ్యాఖ్యలు చేయడం, వెకిలిచేష్టలకు పాల్పడడం జరుగుతూనే ఉందని పేర్కొన్నారు.

నిర్భయ ఘటన తర్వాత మహిళలకు భద్రత కల్పిస్తామని, అన్నివిధాలుగా రక్షణ ఏర్పాట్లు చేస్తామని అధికారులు చెప్పినప్పటికీ ఇంతవరకూ వాటి ఊసే లేదని ఓ మహిళ అన్నారు. 'ఈ బస్టాపు వద్ద సీసీ టీవీ కెమెరాలు పెడతామన్నారు. బస్సుల్లో జీపీఎస్ పరికరాలను ఏర్పాటు చేస్తామన్నారు. కానీ ఇప్పటికీ ఈ బస్టాపునకు రావాలంటేనే భయాన్ని పుట్టిస్తోంది' అని ఆ మహిళ తెలిపారు. తాను పని నిమిత్తం రోజువారీగా మునిర్కా గ్రామం నుంచి ఢిల్లీ వస్తానని తెలిపిన ఆ మహిళ 'నేను ఎక్కడికి వెళ్లినా మా అమ్మానాన్నలు భయపడరుగానీ ఇక్కడకు వస్తే మాత్రం బెంబేలెత్తిపోతారు' అని తెలిపింది. ఇక్కడ బస్సు దిగిన వెంటనే ఎవరో ఒకరు తనను ఇంటికి తీసుకెళ్లడానికి వస్తుంటారని వెల్లడించింది. రాత్రి తొమ్మిది దాటితే ఈ బస్టాపు మీదుగా రావడం అన్నది లేదా అక్కడ బస్సెక్కడం అన్నది మహిళలకు ప్రాణసంకటమైన పరిస్థితేనని నిర్భయ ఘటన జరిగిన ఏడేళ్లు పూర్తయినా ఈ బస్టాపులో మహిళల పట్ల వెకిలిగా ప్రవర్తించి వారిని వేధించేవారి తీరు మాత్రం మారలేదని బ్యూటీషియన్‌గా పనిచేస్తున్న మరో మహిళ తెలిపారు. 'పని పూర్తి చేసుకుని బస్సు ఎక్కి నేను ఈ బస్టాపు వద్దే దిగాలి. అక్కడ అనేక ఆటోలు ఉంటాయి. ప్రయాణికులను ఆటోలో ఎక్కించుకోకపోవడమే కాకుండా ముఖ్యంగా మహిళల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేయడం అన్నది ఆ డ్రైవర్లకు అలవాటే అయిపోయిందని ఆమె అన్నారు. మీనా అనే 35 ఏళ్ల మహిళ కూడా ఇలాంటి ఆందోళనే వ్యక్తం చేశారు. 'ఓ రోజు రాత్రి పూట నేను ఆటో ఎక్కాల్సి వచ్చింది. కానీ ఏ డ్రైవరూ రాలేదు. పోలీసులకు ఫిర్యాదు చేస్తానని హెచ్చరిస్తూ ఓ ఆటో ఎక్కి కూర్చున్నాను. ఆటోలో సీఎన్‌జీ లేదు, నడవదు అని ఆ డ్రైవర్ అడ్డంగా బుకాయించాడు. అతను అబద్ధం ఆడుతున్నట్టు తెలిసినా ఆటో దిగి చీకట్లోనే ఇంటికి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది' అని ఆ మహిళ తెలిపారు. నిర్భయ ఘటన తర్వాత ప్రభుత్వాలు అత్యాచార చట్టాలకు మరింత పదును పెట్టినా వాస్తవంగా పరిస్థితులేమీ మారలేదు అని చెప్పడానికి భయపెట్టే బస్టాపులో రోజువారీగా జరిగే ఉదంతాలే నిదర్శనం.



# ఎప్పుడు..ఎలా!

## నిర్భయ కేసు పూర్వాపరాలు

న్యూఢిల్లీ, జనవరి 7: ఏడేళ్ల క్రితం యావత్ భారతాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిన 23 ఏళ్ల నిర్భయపై సామూహిక అత్యాచారం కేసులో దోషులకు ఉరి శిక్ష అమలుచేయాలని ఢిల్లీ కోర్టు మంగళవారం ఆదేశించింది. 2012 డిసెంబర్ 16న పారామెడికల్ విద్యార్థినిపై జరిగిన అమానుష ఘటనపై విచారణ అనేక మలుపులు తిరిగింది. కేసులో నలుగురు దోషులను ఈనెల 22 ఉదయం 7 గంటలకు తీహార్ జైలులో ఉరి తీయాలని పటియాల కోర్టు ఆదేశించింది. 2012 డిసెంబర్ 16 నుంచి 2020 జనవరి 7 వరకూ ....

- 2012 డిసెంబర్ 16: రాత్రివేళ నడుస్తున్న ప్రైవేటు బస్సులో పారామెడికల్ విద్యార్థినిపై ఆరుగురు కామాంధుల గ్యాంగ్‌రేప్. యువతిపై క్రూరాతిక్రూరంగా దాడి చేసిన మృగాళ్లు ఆమెను బస్సు నుంచి తోసేశారు. బాధితురాలిని సఫ్దర్‌జంగ్ ఆసుపత్రిలో చేర్చారు
- డిసెంబర్ 17: రేపిస్టులపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ దేశ వ్యాప్తంగా నిరసనలు, ఆందోళనలను మిన్నంటాయి.
- అత్యాచారానికి పాల్పడిన దుర్మార్గులను పోలీసులు గుర్తించారు. రామ్‌సింగ్(బస్ డ్రైవర్), అతడి సోదరుడు ముఖేష్, వినయ్ శర్మ, పవన్ గుప్తాను గుర్తించారు.
- డిసెంబర్ 18: రామ్ సింగ్, మరో మగ్గుర్ని అరెస్టు చేశారు.
- డిసెంబర్ 20: బాధితురాలి స్నేహితుడి నుంచి వివరాలు సేకరించి పోలీసులు.
- డిసెంబర్ 21: బాల నేరస్తుడిని ఢిల్లీలోని ఆనంద్ విహార్ బస్ టెర్మినల్ వద్ద పట్టుకున్నారు. బాధితురాని స్నేహితుడు ముఖేష్‌ను గుర్తించాడు. ఆరో నిందితుడు అక్షయ్ ఠాకూర్‌ను పట్టుకునేందుకు హర్యానా, బిహార్‌లో పోలీసులు విస్తృత దాడులు నిర్వహించారు.
- డిసెంబర్ 21-22: బిహార్‌లోని ఔరంగబాద్ జిల్లాలో ఠాకూర్‌ను పోలీసులు పట్టుకుని ఢిల్లీ తీసుకొచ్చారు. సఫ్దర్‌జంగ్ ఆసుపత్రిలో బాధితురాలి వాంగ్మూలం నమోదు చేశారు.
- డిసెంబర్ 23: దేశ రాజధానిలో నిషేధాజ్ఞలు ఉల్లంఘించి ప్రజలు వీధుల్లోకి వచ్చి నిరసన కార్యక్రమాలు చేపట్టారు. విధ్వంసానికి దిగారు. విధి నిర్వహణలో ఉన్న ఢిల్లీ పోలీసు కానిస్టేబుల్ సుభాష్ తోమర్‌పై ఆందోళనకారుల దాడి. తోమర్‌కు తీవ్ర గాయాలు ఆసుపత్రికి తరలింపు.
- డిసెంబర్ 25: బాధితురాలి ఆరోగ్య పరిస్థితి విషమం
- డిసెంబర్ 26: మెరుగైన చికిత్స నిమిత్తం యువతిని సింగపూర్‌లోని మౌంట్ ఎలిజబెత్ ఆసుపత్రికి తరలించారు.
- డిసెంబర్ 29: తీవ్ర గాయాలకు లోనుకావడంతో బాధితురాలి ఆర్యో పరిస్థితి మరింత క్షీణించింది. సింగపూర్‌లోనే కన్నుమూసింది. అత్యాచారం కేసు నమోదు చేసిన పోలీసులు తరువాత హత్యను చేరుస్తూ ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు.
- 2013 జనవరి 2: లైంగిక నేరాల కేసుల సత్వర విచారణకు ఏర్పాటైన ఫాస్ట్ ట్రాక్ కోర్టు(ఎఫ్‌టీసీ)ను సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి అల్తమాస్ కబీర్ ప్రారంభించారు.
- జనవరి 3: ఐదుగురు నిందితులపై పోలీసులు చార్జిషీట్. గ్యాంగ్‌రేప్, హత్య, హత్యాయత్నం, కిడ్నాప్, అసహజ నేరాలు, దోపిడీ అభియోగాలు నమోదు.
- జనవరి 5: చార్జిషీట్‌ను విచారణకు స్వీకరించిన కోర్టు.
- జనవరి 7: ఇన్-కెమెరా విచారణ ప్రక్రియకు న్యాయస్థానం ఆదేశాలు.
- జనవరి 17: ఐదుగురు రేపిస్టులపై ఫాస్ట్ ట్రాక్ కోర్టులో విచారణ ప్రారంభం.
- జనవరి 28: మైనర్ నిందితుడు నేరానికి పాల్పడినట్టు జువెనల్ జస్టిస్ బోర్డు(జేజేబీ) నిర్ధారించింది.
- ఫిబ్రవరి 2: ఐదుగురు రేపిస్టులపై ఫాస్ట్ ట్రాక్ కోర్టులో అభియోగాలు నమోదు.
- ఫిబ్రవరి 28: మైనర్ నేరగాడిపై జేజేబీలో అభియోగాలు నమోదు.
- మార్చి 11: తీహార్ జైలులో రామ్‌సింగ్ ఆత్మహత్య.
- మార్చి 22: ట్రయల్ కోర్టులో విచారణకు మీడియాకు అనుమతి ఇచ్చిన ఢిల్లీ హైకోర్టు.
- జూలై 5: మైనర్ నేరగాడిపై జేజేబీ విచారణ పూర్తి. తీర్పు రిజర్వ్.
- జూలై 8: సాక్షులందరినీ విచారించిన ఫాస్ట్ ట్రాక్ కోర్టు. ముగిసిన విచారణ.
- జూలై 11: ఈ అమానుష సంఘటనతో మైనర్ పాత్ర ఉన్నట్టు జేజేబీ నిర్ధారణ. గ్యాంగ్ రేప్‌లో అతడు పాల్గొన్నట్టు వెల్లడి.
- ట్రయల్ కోర్టులో విచారణ కవర్ చేయడానికి అంతర్జాతీయ మీడియాకు ఢిల్లీ కోర్టు అనుమతి మంజూరు.
- ఆగస్టు 22: ఐదుగురు నిందితులపై ఫాస్ట్ ట్రాక్ కోర్టులో తుది విచారణ మొదలు.
- ఆగస్టు 31: విద్యార్థి సామూహిక అత్యాచారం కేసులో మేనర్‌ను దోషిగా తీర్పునిచ్చిన జేజేబీ. మూడేళ్ల జైలుశిక్ష. హోంలో ఉంచి పరిశీలించాలని ఆదేశం.
- సెప్టెంబర్ 3: ఫాస్ట్ ట్రాక్ కోర్టులో ముగిసిన విచారణ. తీర్పు రిజర్వ్.
- సెప్టెంబర్ 10: ముఖేష్, వినయ్, అక్షయ్, పవన్ దోషులుగా తీర్పు. సామూహిక అత్యాచారం, హత్యతోపాటు 13 నేరాల నిర్ధారణ. అలాగే ఆమె స్నేహితుడిపై హత్యాయత్నం చేసినట్టు కోర్టు నిర్ధారణ.
- సెప్టెంబర్ 13: నలుగురు దోషులకు మరణశిక్ష విధిస్తూ కోర్టు తీర్పు.
- సెప్టెంబర్ 23: ట్రయల్ కోర్టు తీర్పుపై హైకోర్టులో అప్పీల్ చేసిన నిందితులు.
- 2014 జనవరి 3: నిందితుల అప్పీల్స్‌పై తీర్పు రిజర్వ్‌లో పెట్టిన హైకోర్టు.
- మార్చి 13: ట్రయల్ కోర్టు మరణ శిక్ష తీర్పును ఖరారు చేసిన హైకోర్టు.
- మార్చి 15: ఇద్దరు నిందితులు ముఖేష్, పవన్ సుప్రీంలో అప్పీల్. హైకోర్టు తీర్పు, శిక్షల అమలులపై స్టే.
- ఏప్రిల్ 15: బాధితురాలి మరణ వాంగ్మూలంపై నివేదిక ఇవ్వాలని పోలీసులను ఆదేశించిన సుప్రీం కోర్టు.
- 2017 ఫిబ్రవరి 3: హైకోర్టు తీర్పుపై మళ్లీ విచారణ. అమలు ఆపాలన్న సుప్రీం.
- మార్చి 27: నిందితుల అప్పీళ్లపై తీర్పు రిజర్వ్ చేసిన సుప్రీం.
- మే 5: హైకోర్టు మరణశిక్ష తీర్పుకు సుప్రీం ఖరారు. నిర్భయపై లైంగిక దాడి అత్యంత అరుదైన నేరంగా ప్రకటన.
- నవంబర్ 8: సుప్రీంను ఆశ్రయించిన నిందితుడు ముఖేష్. మరణ శిక్ష తీర్పును పునర్విచారించాలని విజ్ఞప్తి.
- డిసెంబర్ 12: ముఖేష్ పిటిషన్‌ను సుప్రీంలో వ్యతిరేకించిన హైకోర్టు.
- డిసెంబర్ 15: ముద్దాయిలు వినయ్ శర్మ, పవన్ కుమార్ గుప్తా సుప్రీంలో రివ్యూ పిటిషన్ దాఖలు.
- 2018 మే 4: వినయ్ శర్మ, పవన్ గుప్తా పిటిషన్లపై విచారణ ముగించిన సుప్రీం కోర్టు. తీర్పు రిజర్వ్.
- జూలై 9: ముద్దాయిల రివ్యూ పిటిషన్ల కొట్టివేత.
- 2019 ఫిబ్రవరి : నలుగురు రేపిస్టులకు ఉరి శిక్ష అమలు చేయాలంటూ బాధితురాలి తల్లిదండ్రులు హైకోర్టులో పిటిషన్.
- డిసెంబర్ 10: మరణశిక్షపై సుప్రీంలో రివ్యూ పిటిషన్ వేసిన అక్షయ్.
- డిసెంబర్ 13: ముద్దాయిల రివ్యూ పిటిషన్లు విచారించవద్దంటూ నిర్భయ తల్లి సుప్రీంలో పిటిషన్.
- డిసెంబర్ 18: అక్షయ్ పిటిషన్‌ను తిరస్కరించిన సుప్రీం కోర్టు.
- నలుగురు దోషులకు ఉరి శిక్ష అమలుకు ఢిల్లీ సర్కార్ ఏర్పాట్లు.
- తీహార్ జైలు అధికారులకు ఢిల్లీ హైకోర్టు ఆదేశాలు.
- డిసెంబర్ 19: నేరం జరిగే సమయంలో తాను మేనర్‌ను అంటూ దోషి పవన్ కుమార్ గుప్తా దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసిన ఢిల్లీ హైకోర్టు.
- 2020 జనవరి 6: మొత్తం సాక్షులందరిపైనా ఎఫ్‌ఐఆర్ కోరుతూ పవన్ గుప్తా తండ్రి దాఖలు చేసిన పిటిషన్‌ను డిస్మిస్ చేసిన హైకోర్టు.
- జనవరి 7: నలుగురు ముద్దాయిలకు జనవరి 22న ఉదయం 7 గంటలకు ఉరి శిక్ష అమలు చేయాలని ఢిల్లీ కోర్టు ఆదేశం.

## అమెరికా దీవిలో తీవ్ర భూకంపం

శాన్ జువాన్, జనవరి 7: అమెరికా భూ భాగంలోని ప్యూర్టో రికోలో మంగళవారం తీవ్ర భూకంపం సంభవించింది. రిక్టార్ స్కేల్‌పై భూకంప తీవ్రత 6.4గా నమోదైంది. కరేబియన్ సముద్రం, అట్లాంటిక్ సముద్రం మధ్యలో ఉన్న దీవిలో ఇటీవల సంభవించిన భూకపంతో తీవ్ర నష్టం వాటిల్లింది. మంగళవారం మరోసారి ప్రకంపనలు సంభవించాయి. దేశానికి విద్యుత్‌ను అందించే ప్రధాన పవర్ ప్లాంట్‌లు దెబ్బతిన్నాయని అధికార వర్గాలు వెల్లడించాయి. వెంటనే రంగంలోకి దిగిన యంత్రాంగం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్టు ట్వీట్ చేశారు. అమెరికా జియోగ్రఫికల్ సర్వే వివరాల ప్రకారం మంగళవారం ఉదయం 4:24కు భూమికంపించింది. దీవికి దక్షిణాన పదికిలోమీటర్ల లోతులో భూకంపం కేంద్రీకృతమైందని సంస్థ ప్రకటించింది. తొలుత రిక్టార్ స్కేల్‌పై 6.6 డిగ్రీలు తీవ్ర కనిపించినా 6.4 వద్ద రికార్డయిందని వారన్నారు. తరువాత కూడా 5.6 నుంచి 4.5 ప్రకంపనలు నమోదయ్యాయి. తీవ్రత ఎక్కువగా ఉండడంతో తొలుత సునామీ హెచ్చరికలు చేసిన అధికారులు తరువాత ఉప సంహరించుకున్నారు. ప్యూర్టోరికో సహా పరిసర దీవుల్లోనూ అప్రమత్తత ప్రకటించారు. నైరుతీ పట్టణమైన గ్యానికాకు చెందిన ఆల్బర్ట్ రొడ్రిగ్ మాట్లాడుతూ భూకంపం తీవ్ర విధ్వంసాన్ని సృష్టించిందని చెప్పారు. గ్యయానిల్లా మేయర్ నెల్సన్ టొర్రెస్ ఓ వార్తా సంస్థతో మాట్లాడుతూ పబ్లిక్ ప్లాజాలోని చర్చి కుప్పకూలిపోయిందని వెల్లడించారు. ప్యూర్టో రికో భూకంప కేంద్ర డైరెక్టర్ విక్టర్ హెర్ఫెనో మాట్లాడుతూ సమాచార వ్యవస్థ ధ్వంసం కావడం వల్ల ఏమేరకు నష్టం జరిగిందీ సమాచారం లేదని చెప్పారు. భూ ప్రకంపనలు వస్తునే ఉన్నాయని అన్నారు. వెలుతురు వచ్చేవరకూ ఇళ్లలోకి వెళ్లవద్దని, సహాయక బృందాలకు సహకరించాలని గవర్నర్ వాండా వాస్‌ఖ్వెజ్ ఉదయం 6 గంటలకు ఓ రేడియో కేంద్రంలో మాట్లాడుతూ విజ్ఞప్తి చేశారు.

# సమ్మె చట్ట విరుద్ధం

❖ పాల్గొంటే చర్యలు తప్పవు ❖ జీతాల్లో కోత విధిస్తాం
❖ సిబ్బందికి కేంద్రం హెచ్చరిక

**ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి**

న్యూఢిల్లీ, జనవరి 7: ప్రభుత్వ ఉద్యోగులు, పబ్లిక్ రంగ పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు బుధవారం నాటి ప్రతిపాదిత సమ్మెలో పాల్గొంటే అందుకు సంబంధించిన పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని కేంద్ర ప్రభుత్వం మంగళవారం హెచ్చరించింది. కేంద్ర ఉద్యోగుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఈ మేరకు ఒక ఆదేశాన్ని జారీ చేసింది. సమ్మెలో పాల్గొనే ప్రభుత్వ ఉద్యోగులు, కార్మికుల వేతనాలలో కోత విధించటంతో పాటు క్రమశిక్షణా చర్యలు కూడా ఉంటాయని కేంద్ర ఉద్యోగుల వ్యవహారాల శాఖ తమ ఆదేశంలో స్పష్టం చేసింది. ప్రభుత్వ ఉద్యోగులు, ఇతర సిబ్బంది సమ్మెలో పాల్గొనటం చట్ట విరుద్ధమని ప్రకటించింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని ఆరోపిస్తున్న సీఐటీయూ (సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్) బుధవారంనాడు ఇరవై నాలుగు గంటల జాతీయ సమ్మెకు పిలుపు ఇవ్వడం తెలిసిందే. కేంద్ర కార్మిక శాఖ మంత్రి సంతోష్ గంగ్వార్ గత వారం సీఐటీయూ నాయకులతో చర్చలు జరిపినా అవి ఫలించలేదు. కార్మిక సంస్థలు ప్రతిపాదిత సమ్మెలో పాల్గొంటే దీని మూలంగా ఎదురయ్యే పరిణామాలను కూడా భరించవలసి ఉంటుందని కేంద్ర ప్రభుత్వం తమ ఆదేశంలో స్పష్టం చేసింది. సీఐటీయూ చేపడుతున్న సమ్మెలో బీజేపీయేతర పార్టీలకు చెందిన పలు కార్మిక సంస్థలు, వాటికి అనుబంధంగా ఉన్న దాదాపు ఇరవై ఐదు కోట్ల మంది కార్మికులు నేటి సమ్మెలో పాల్గొంటారని అంటున్నారు. మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాల మూలంగా దేశంలోని దాదాపు ఎనభై కోట్ల మంది ప్రజలపై భారం పడుతోందని సీఐటీయూ ఆరోపించటం తెలిసిందే. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల మూలంగా సంఘటిత, అసంఘటిత రంగంలోని కోట్లాది మంది కార్మికులతోపాటు సామాన్య ప్రజలు కూడా ఇబ్బందుల పాలవుతున్నారన్నది కార్మిక సంఘాల ప్రధాన ఆరోపణ. దేశంలోని కార్మికులందరికీ 21 వేల కనీస వేతనం చెల్లించాలన్నది కార్మిక సంఘాల ప్రధాన డిమాండ్. ఆర్థిక మాంద్యం మూలంగా పారిశ్రామిక రంగం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించవలసిన ప్రభుత్వం పబ్లిక్ రంగ్ సంస్థలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించడం, విక్రయించడం వంటి పనుల్లో తీరిక లేకుండా ఉన్నదని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, తీసుకుంటున్న నిర్ణయాలు దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా ఉండడంతోపాటు దేశాభివృద్ధిని కుంటుపరుస్తున్నాయని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. పన్నెండు విమానాశ్రయాలను ప్రైవేట్ సంస్థలకు విక్రయించిన ప్రభుత్వం ఎయిర్ ఇండియాను పూర్తిగా విక్రయించేందుకు ప్రయత్నిస్తోందని వారు చెబుతున్నారు. బీపీసీఎల్‌ను విక్రయించాలనే నిర్ణయం తీసుకోవడంతోపాటు బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్‌ల విలీనం చేయడం మూలంగా 93,600 మంది ఉద్యోగులు రోడ్డున పడ్డారని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. కార్మిక సంఘాలు తలపెట్టిన ఇరవై నాలుగు గంటల జాతీయ సమ్మెకు దాదాపు 175 వ్యవసాయ కూలీల సంఘాలు, వ్యవసాయ కార్మికుల సంఘాలు కూడా మద్దతు పలికాయి.



కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తప్పుడు విధానాలను ఎత్తి చూపించేందుకే ఇరవై నాలుగు గంటల జాతీయ సమ్మె చేపడుతున్నాం తప్ప మరో ఉద్దేశ్యంతో కాదని సీఐటీయూ నాయకులు చెబుతున్నారు. నేటి సమ్మెలో వివిధ బ్యాంకుల సిబ్బంది కూడా పాల్గొంటారని కార్మిక సంఘాలు చెబుతున్నాయి. అయితే సీఐటీయూ నాయకులు చేస్తున్న ఆరోపణలను కేంద్ర ప్రభుత్వం సమ్మెలో పాల్గొనే ప్రభుత్వ ఉద్యోగులు, పబ్లిక్ రంగ సంస్థలో పనిచేసే కార్మికులపై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు.

# నేను మీ సంరక్షకురాలిని..

## బతికి ఉన్నంత కాలం మీ హక్కులు కాపాడుతా

❖ ప్రజలు ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదు
❖ బహిరంగ సభలో బెంగాల్ సీఎం మమతా బెనర్జీ

పాతర్‌ప్రతిమ (పశ్చిమ బెంగాల్), జనవరి 7: 'నేను మీ సంరక్షకురాలిని, బతికి ఉన్నంత కాలం మీ హక్కులు కాపాడుతా..' అని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ బెంగాల్ ప్రజలకు భరోసా ఇచ్చారు. మీ హక్కులకు, ప్రయోజనాలకు భంగం వాటిల్లకుండా చూస్తానని అన్నారు. బెంగాల్‌లోని పాతర్‌ప్రతిమ ప్రాంతంలో మంగళవారం జరిగిన బహిరంగ సభలో ఆమె ప్రసంగిస్తూ తాను బతికి ఉన్నంత వరకూ ప్రజల హక్కులను ఎవరూ కాల రాయలేరని అన్నారు. ఎవరి దయాదాక్షిణ్యాలపై ఆధారపడి బతకడం లేదని ఆమె తెలిపారు. ఎల్లవేళలా తాను ప్రజల సంరక్షకురాలినని చెప్పారు. ఎవరైనా మీ హక్కులను తీసుకెళ్ళేందుకు వస్తే, తాను అడ్డునిలబడతానని అన్నారు. వచ్చిన వ్యక్తి మీ హక్కులను కాదు, తన భౌతిక కాయాన్ని తీసుకెళ్ళాల్సి వస్తుందని ఆమె ఆగ్రహంగా అన్నారు. రాష్ట్రంలో ఓటర్ల జాబితా సవరణ ప్రారంభమైందని చెప్పారు. మీ పేరు ఇతర వివరాలు చెప్పాలని అన్నారు. అయితే ఎవరైనా కొత్త వారు వచ్చి మీ పేరు, తల్లి దండ్రుల పేర్లు, ఇంకా పూర్వీకుల పేర్లు, వారు ఇక్కడే జన్మించారన్న ఆధారాలు అడిగితే ఇవ్వాల్సిన అవసరం లేదని ఆమె ఖండితంగా చెప్పారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పౌరుల హక్కులను కాలరాస్తున్నదని ఆమె దుయ్యబట్టారు.

## విద్యార్థులూ.. క్యాంపస్‌కు
# వచ్చేయండి

**జేఎన్‌యూ వైస్-చాన్సలర్ జగదీష్ పిలుపు**

న్యూఢిల్లీ, జనవరి 7: 'విద్యార్థుల్లారా క్యాంపస్‌కు తిరిగి వచ్చేయండి..' అని ఢిల్లీలోని ప్రతిష్టాత్మక జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యు) వైస్-ఛాన్సలర్ ఎం. జగదీష్ కుమార్ పిలుపునిచ్చారు. యూనివర్సిటీ ఆవరణే సురక్షితం అని ఆయన తెలిపారు. ఆదివారం జేఎన్‌యు క్యాంపస్‌లోకి ముసుగు ధరించిన వ్యక్తులు కొందరు వచ్చి విద్యార్థులు, అధ్యాపకులపై దాడి చేయడంతో పాటు ఫర్నీచర్‌నూ ధ్వంసం చేసిన సంగతి తెలిసిందే. ఈ ఘటన దేశ వ్యాప్తంగా సంచలనం రేకెత్తించింది. ఈ దాడికి కారణం మీరేనంటూ ఎబీవీపి, వామపక్షాల అనుబంధ విద్యార్థి సంఘాల నాయకులు పరస్పరం ఆరోపించుకున్నారు. ఇదిలాఉండగా వర్సిటీ వైస్-ఛాన్సలర్ మంగళవారం విద్యార్థులు క్యాంపస్‌కు తిరిగి వచ్చేయాలంటూ ఒక ప్రకటన విడుదల చేశారు. గతాన్ని వెనుక ఉంచుదాం అని ఆయన పేర్కొన్నారు. మరో వైపు దాడి ఘటనతో వైస్-చాన్సలర్ జగదీష్ కుమార్ రాజీనామా చేయాలంటూ విద్యార్థులు, కొంత మంది అధ్యాపకులు డిమాండ్ చేయడంతో పాటు వత్తిడి పెంచారు. అన్ని పార్టీలూ ఈ ఘటనపై స్పందించాయి, ఖండించాయి. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ కూడా వర్సిటీ ప్రాంతానికి చేరుకుని విద్యార్థుల పాటు ధర్నాలో పాల్గొన్నారు. ఇదిలాఉండగా వైస్-ఛాన్సలర్ మంగళవారం మీడియాతో మాట్లాడుతూ వర్సిటీ విద్యార్థులపై, అధ్యాపకులపై జరిగిన దాడి పట్ల విచారం వ్యక్తం చేశారు. క్యాంపస్ సురక్షితమైన ప్రాంతమని అన్నారు. ఏదైనా శాంతి-భద్రతలపై సమస్య వస్తే దానిని అధిగమించేందుకు తమకు సొంత సెక్యూరిటీ ఉందని, పోలీసుల వద్దకు వెంటనే పరుగెత్తాల్సిన అవసరం లేదని ఆయన తెలిపారు. ఆదివారం కొంత మంది విద్యార్థుల్లో దూకుడు ప్రవర్తన, ఆగ్రహావేశాలు ఉన్నందున పోలీసులకు సమాచారం ఇవ్వాల్సి వచ్చిందని ఆయన ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.




ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలో ఆదివారం జరిగిన హింసాకాండను గర్హిస్తూ మంగళవారం నినాదాలతో ర్యాలీలో పాల్గొన్న సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పార్టీ నాయకుడు ప్రకాశ్ కారత్, జేఎన్‌యూ టీచర్ల సంఘం, జేఎన్‌యూ విద్యార్థి సంఘం ప్రతినిధులు

## జేఎన్‌యూలో హింసపై
# సమాచారం ఇవ్వండి

### ప్రజలకు పోలీసుల విజ్ఞప్తి

న్యూఢిల్లీ, జనవరి 7: జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటి (జేఎన్‌యూ) క్యాంపస్‌లో ఆదివారం జరిగిన హింసకు సంబంధించిన చిత్రాలు, ఫుటేజి, ఇతర సమాచారం ఏదైనా ఉంటే తమకు అందజేయాలని ఢిల్లీ పోలీసులు మంగళవారం ప్రజలకు బహిరంగ విజ్ఞప్తి చేశారు. ముసుగులు ధరించిన కొంతమంది దుండగులు కర్రలు, ఇనుప రాడ్లు, హాకీస్టిక్‌లతో చేసిన ఈ దాడిలో 34 మంది గాయపడ్డారు. ఫోరెన్సిక్ బృందాలు కూడా ఈ దాడికి సంబంధించిన ఆధారాలను సేకరిస్తున్నాయి. ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరి (ఎఫ్ఎస్ఎల్)కు చెందిన భౌతిక శాస్త్ర, రసాయనిక శాస్త్ర, జీవశాస్త్ర విభాగాల బృందాలు విశ్వవిద్యాలయ క్యాంపస్‌లో ఉన్నాయని వర్శిటీ వర్గాలు తెలిపాయి. విశ్వవిద్యాలయ విద్యార్థులు, అధ్యాపకులపై దాడి చేయడానికి ముసుగులు ధరించిన దుండగులు ఉపయోగించిన రాడ్లు, రాళ్లు వంటి ఆధారాలను భౌతిక శాస్త్ర విభాగ బృందం సేకరిస్తుంది. ఏమైనా రసాయనాలు ఉంటే వాటి నమూనాలను రసాయనిక శాస్త్ర విభాగ బృందం సేకరిస్తుంది. జీవశాస్త్ర విభాగ బృందం ఇతర ఆధారాలతో పాటు డీఎన్ఏ నమూనాలను సేకరిస్తుంది. ఎఫ్ఎస్ఎల్‌లోని ఒక ఫొటో నిపుణుల బృందం కూడా జేఎన్‌యూ క్యాంపస్‌లో ఉంది. సీసీటీవీ ఫుటేజీలను విశ్లేషించడానికి ఒక కంప్యూటర్ ఫోరెన్సిక్ బృందాన్ని కూడా పంపించవలసిందిగా ఎఫ్ఎస్ఎల్‌ను ఢిల్లీ పోలీసులు కోరారు. బహుశా ఈ బృందం బుధవారం క్యాంపస్‌లోకి వచ్చే అవకాశం ఉందని ఆ వర్గాలు తెలిపాయి. 'ఢిల్లీ పోలీస్‌లోని క్రైమ్ బ్రాంచ్‌కు చెందిన ఒక బృందం ఈ కేసును శాస్త్రీయంగా, వృత్తినైపుణ్యంతో దర్యాప్తు జరుపుతోంది. ఆధారాలను సేకరించడం జరుగుతుంది' అని ఢిల్లీ పోలీస్‌కు చెందిన అదనపు ప్రజాసంబంధాల అధికారి అనిల్ మిట్టల్ పేర్కొన్నారు. క్రైమ్ బ్రాంచ్‌కు చెందిన ప్రత్యేక దర్యాప్తు బృందానికి (సిట్‌కు) జాయ్ టిర్కే నేతృత్వం వహిస్తున్నారు. ఆదివారం క్యాంపస్‌లో జరిగిన దాడిని చూసిన వారంతా, ఈ దాడి దృశ్యాలను తమ మొబైల్ ఫోన్లు, కెమెరాలలో చిత్రీకరించిన వారంతా ముందుకు వచ్చి వారి వాంగ్మూలాలను, వారి వద్ద ఉన్న చిత్రాలను, ఫుటేజీలను ఇవ్వవలసిందిగా క్రైమ్ బ్రాంచ్ బహిరంగ విజ్ఞప్తి చేసింది.



మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

# చైర్మన్ల ఎంపిక బాధ్యత కేటీఆర్‌దే : పువ్వాడ

**ఆంధ్రభూమి బ్యూరో**

ఖమ్మం, జనవరి 7: మున్సిపల్ ఎన్నికల్లో చైర్మన్ ఎన్నిక బాధ్యత టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌దేనని రాష్ట్ర రవాణాశాఖా మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశాల్లో భాగంగా ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, స్థానిక శాసన సభ్యులతో కలిసి మధిర, వైరా, సత్తుపల్లి మున్సిపాల్టీలలో మంగళవారం జరిగిన పార్టీ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ ఖమ్మం, కొత్తగూడెం జిల్లా పరిధిలో ఐదు మున్సిపాల్టీలలో పార్టీ గెలవడం ఖాయమని, అభ్యర్థుల ఎంపిక నుంచి చైర్మన్ల ఎంపిక వరకు అంతా కేటీఆర్ చూసుకుంటారని స్పష్టం చేశారు. ప్రజల మనస్సుల్లో స్థానం ఉన్న వారినే కౌన్సిలర్లుగా ఎన్నుకుంటారని, అటువంటి వారికే టీఆర్‌ఎస్ టికెట్ ఇస్తుందని స్పష్టం చేశారు.

# అడ్వకేట్స్ క్లర్క్స్ వెల్ఫేర్ ఫండ్

**ఆంధ్రభూమి బ్యూరో**

హైదరాబాద్, జనవరి 7: రాష్ట్ర పునర్విభజన అనంతరం తెలంగాణ రాష్ట్రంలో న్యాయవాదుల క్లర్కుల సంక్షేమానికి నిధిని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు సంబంధించిన నియమనిబంధనలను జారీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఈ మేరకు జీవో ఇస్తూ 2019 జనవరి 1వ తేదీ నుండి దీనిని అమలులోకి తెచ్చినట్టు పేర్కొంది. అదేవిధంగా న్యాయవాదుల సంక్షేమ నిధిని సైతం 2019 జనవరి 1 నుండి అమలులోకి తెచ్చినట్టు మరో జీవోలో పేర్కొంది.

# కృష్ణా నుంచి హైదరాబాద్‌కు 710 ప్రత్యేక బస్సులు

**ఆంధ్రభూమి బ్యూరో**

విజయవాడ, జనవరి 7: సంక్రాంతి రద్దీలో ప్రైవేట్ బస్సులు ఇష్టానుసారం రేట్లు పెంచి ప్రయాణికులను దోపిడీ చేస్తున్న నేపథ్యంలో ఆర్టీసీ ముందస్తు జాగ్రత్తగా గత ఏడాది కంటే రెట్టింపు స్థాయిలో ఈ దఫా 710 ప్రత్యేక బస్సులను ఈ నెల 9వ తేదీ నుంచి 14వ తేదీ వరకు కృష్ణాజిల్లా నలుమూలల నుంచి హైదరాబాద్‌కు నడపబోతున్నది. సంస్థ నూతన ఎండీ మాదిరెడ్డి ప్రతాప్ ఈ మేర చర్యలు తీసుకున్నారు. ప్రత్యేక బస్సు టిక్కెట్ ధరపై ఈ దఫా 40 శాతం రాయితీ కల్పిస్తున్నామని సంస్థ రీజనల్ మేనేజర్ జీ నాగేంద్ర ప్రసాద్ తెలిపారు. సంక్రాంతి తర్వాత 16వ తేదీ నుంచి 21వ తేదీ వరకు కూడా హైదరాబాద్ నుంచి విజయవాడకు కూడా ప్రత్యేక బస్సులు నడుపుతామన్నారు. ముందుగా హైదరాబాద్‌కు వెళ్లేటప్పుడు అలాగే సంక్రాంతి తర్వాత తిరిగి వచ్చేటప్పుడు రద్దీ ఉండనందున 40 శాతం ప్రత్యేక రాయితీ కల్పిస్తున్నామన్నారు.

# ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్‌పై కేసు నమోదు చేయాలి

★ **పీఎస్‌కు వెళ్లి నిలదీసిన సీనియర్ కాంగ్రెస్ నేత వీహెచ్**

★ **కేసు నమోదు చేయలేం : పోలీసులు**

**ఆంధ్రభూమి బ్యూరో**

హైదరాబాద్, జనవరి 7: భారత్‌లో ఉన్న ప్రజలందరూ హిందువులే అని ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్ చేసిన వ్యాఖ్యలపై తక్షణమే కేసు నమోదు చేయాలని పీసీసీ మాజీ అధ్యక్షుడు, మాజీ ఎంపీ వీ హనుమంతరావు పోలీసులను డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ఎల్‌బీ నగర్ పీఎస్‌కు వెళ్లి పోలీసు అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ చౌకీదార్ చోర్ అన్నందుకు రాహుల్ గాంధీపై పోలీసులు కేసులు పెట్టారన్నారు. ఇతర మతాల వారిని బాధపెట్టిన మోహన్ భగవత్‌పై పోలీసులు ఎందుకు పెట్టలేదని ఆయన నిలదీశారు. ఈ అంశంపై కోర్టును ఆశ్రయిస్తామని ఆయన చెప్పారు. కాగా, పోలీసులు మాత్రం తాము న్యాయ నిపుణుల అభిప్రాయాలను తీసుకున్నామని, కేసులు నమోదు చేసే అంశాలు లేవని చెప్పడం వల్ల కేసులు నమోదు చేయలేమని వీహెచ్‌కు చెప్పారు.

# కాంగ్రెస్ కామన్ మేనిఫెస్టో

★ స్థానిక అంశాలపై లోకల్ మేనిఫెస్టో ★ 'పుర'పోరులో మెజారిటీ సీట్లు మావే ★ నేడు అన్ని మున్సిపాల్టీల్లో స్థానిక సమావేశాలు
★ సెలక్ట్ ఎలక్ట్ పద్ధతిలో అభ్యర్థుల ఖరారు ★ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి

**ఆంధ్రభూమి బ్యూరో**

హైదరాబాద్, జనవరి 7: వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున కామన్ మేనిఫెస్టో తయారు చేయాలని నిర్ణయించినట్టు టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. అయితే స్థానిక అంశాల వారీ విధిగా లోకల్ మేనిఫెస్టోను రూపొందించుకోవల్సిందిగా ఆయన పార్టీ నేతలను ఆదేశించారు. మున్సిపల్ ఎన్నికల వ్యూహరచనకు బుధవారం నాడు అన్ని మున్సిపాల్టీల్లో స్థానిక సమావేశాలను ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు. గురువారంలోగా సెలక్ట్ ఎలక్ట్ పద్ధతిలో అభ్యర్థులను ఖరారు చేస్తామని అన్నారు. పార్టీ తరపున పోటీ చేసేవారు 20 రూపాయిల బాండ్ పేపర్‌పై అఫిడవిట్ ఇవ్వాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ అఫిడవిట్‌లో పార్టీ నుండి గెలిచిన వారు ఇతర పార్టీలకు వెళ్లబోమని విధిగా పేర్కొనాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. ఈ నెల 11, 12 తేదీల్లో అభ్యర్థులకు బీ ఫారంలను ఇస్తామని చెప్పారు. ప్రతి మున్సిపాల్టీలో సంబంధిత ఎమ్మెల్యేలు లేదా ఎన్నికల్లో పోటీ చేసిన ఎంపీ, ఎంఎల్‌ఏ అభ్యర్థి, డీసీసీ అధ్యక్షుడు , మున్సిపాల్టీ పరిధిలోని ముఖ్య నేతలు సమన్వయంగా అభ్యర్థులను ఖరారు చేస్తారని తెలిపారు. ఎన్నికల ప్రచారం కోసం కొంతమంది స్టార్ క్యాంపెయినర్స్‌ను ఎంపిక చేయనున్నట్టు ఆయన తెలిపారు. ఇలా ఉండగా, గాంధీ భవన్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ఆర్‌సీ కుంతియా, పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి పార్టీ నేతలతో మాట్లాడారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల్లోని మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని, పార్టీ కార్యకర్తలు, నేతలు సమన్వయంతో పనిచేయాలన్నారు. మేనిఫెస్టోలో ప్రజారోగ్య సమస్యలు, మౌలిక సదుపాయాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఈ ఎన్నికల్లో టీఆర్‌ఎస్ పార్టీకి పరాభవం తప్పదని ఆయన హెచ్చరించారు. తమకు వివిధ జిల్లాల నుంచి వచ్చిన సమాచారం ప్రకారం టీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనతో ప్రజలు విసిగి ఉన్నారని, తీవ్ర అసంతృప్తి ఉన్నారన్నారు. తీవ్రమైన అస్తవ్యస్త పరిస్థితులు మున్సిపాలిటీల్లో నెలకొని ఉన్నాయన్నారు. పాలన స్తంభించిందన్నారు. కుటుంబ పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నేతలు విబేధాలను విస్మరించి సమిష్టిగా పనిచేయాలన్నారు. పారదర్శకంగా, జవాబుదారీతనంతో అభ్యర్థుల ఎంపిక ఉంటుందన్నారు. రాష్ట్రంలో బీజేపీ, ఎంఐఎం, టీఆర్‌ఎస్ పార్టీలకు చెక్ పెట్టేందుకు కాంగ్రెస్ పార్టీ సమాయత్తమైందన్నారు. కేసీఆర్ ప్రజావ్యతిరేక పాలన విధానాలను జనంలోకి తీసుకెళ్లనున్నట్లు ఆయన చెప్పారు.




గాంధీభవన్‌లో సీనియర్ కాంగ్రెస్ నాయకులతో మంగళవారం సమావేశమైన పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి కుంతియా, పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్

**వ్యవసాయ ఉత్పత్తుల పెంపులో**

# పరిశోధనల పాత్ర కీలకం

## గవర్నర్ తమిళిసై సౌందరరాజన్

రాజేంద్రనగర్, జనవరి 7: హైదరాబాద్ నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్ (నార్మ్)లో వ్యవసాయ పరిశోధన సేవ కోసం 110వ ఫౌండేషన్ కోర్సును తెలంగాణ గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ ప్రారంభించారు.

28 ఏఆర్‌ఎస్ విభాగాలు, 22 రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న మొత్తం 135 ఏఆర్‌ఎస్ ప్రొబేషనర్లుకు వచ్చే మూడు నెలల్లో మూడు దశల్లో ఫౌండేషన్ కోర్సులు ఉన్నాయి. జాతీయ వ్యవసాయ పరిశోధన వ్యవస్థ సామర్థ్యాన్ని పెంపొందించడంలో అకాడమీ తీసుకున్న కృషిని గవర్నర్ ప్రశంసించారు. వ్యవసాయ ఉత్పత్తిని బలోపేతం చేయడంలో పరిశోధనల పాత్ర, 2022 నాటికి భారత ప్రధాని నిర్ణయించిన రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసే లక్ష్యాన్ని సాధించడానికి చేసిన ప్రయత్నాలను గుర్తు చేశారు. జీవనోపాధి పెంచడానికి వినూత్న విధానాలను అవలంబించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. వాతావరణ మార్పు, కొత్త తెగుళ్లు, వ్యాధుల ఆవిర్భావం నేపథ్యంలో ఆహారం, పోషణ భద్రతలను గుర్తు చేశారు. పాలు, సుగంధ ద్రవ్యాల విదేశీ వాణిజ్యంపై ప్రస్తావించారు. కేంద్రీకృత పరిశోధన, పాడిగింపు అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా దేశ పాల ఎగుమతులకు సంబంధించిన సమస్యలను పరిష్కరించడంలో సహాయపడుతుందని అన్నారు. భారతదేశ పాలను ఎగుమతి చేసి ప్రముఖ దేశంగా ఉందని వ్యాఖ్యానించారు. సుగంధ ద్రవ్యాల ఎగుమతుల నుంచి వచ్చే ఆదాయం రూ.19 వేల కోట్లకు చేరుకుందని చెప్పారు. రైతులు ఎల్లప్పుడూ పరిశోధకుల సహకారాన్ని గుర్తుంచుకుంటారని పేర్కొన్నారు.

# కార్గో రవాణా నిర్వహణపై కసరత్తు

**ఆంధ్రభూమి బ్యూరో**

హైదరాబాద్, జనవరి 7: ప్రజా రవాణాలో ప్రత్యేక గుర్తింపు పొందిన తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తూనే సంస్థ ఆర్థికంగా బలపడేందుకు పలు కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తోంది.

మంగళవారం బస్‌భవన్‌లో జరిగిన సమావేశంలో టీఎస్‌ఆర్టీసీ ఎండీ సునీల్‌శర్మ ఆదాయ వనరులతో పాటు పార్శిల్స్ రవాణకు సంబంధించిన ప్రత్యేకంగా విధి విధానాలపై చర్చించారు. కార్గో సర్వీసు సేవల్ని అందుబాటులోకి తీసుకురావల్సిన విషయంపై ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. నష్టాల్లో ఉన్న సంస్థకు ఇదోక ఆదాయ మార్గంగా భావిస్తూ కార్గో సేవలు ఆశించినట్లుగా ఉండే దిశలో తక్షణమే ప్రణాళికను రూపొందించాలని సంబంధిత అధికారులను ఎండీ ఆదేశించారు. ఈ సమావేశంలో సంస్థకు సంబంధించిన ఈడీలు, కార్యదర్శి పురుషోత్తం కార్గో సర్వీసు సేవలపై రూపొందించిన కార్యాచరణను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.



కార్గో రవాణా నిర్వహణపై ఆర్టీసీ భవన్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీసీ ఇన్‌చార్జి ఎండీ సునీల్ శర్మ

# ఏడేళ్ల నాటి జీవో 20ను అమలు చేయండి

★ **కాలుష్య పరిశ్రమలను ఓఆర్‌ఆర్‌కు వెలుపలకు తరలించండి**

★ **రెడ్, ఆరెంజ్ కేటగిరీ పరిశ్రమలకు అనుమతులు ఇవ్వొద్దు**

★ **ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కోరిన ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్**

**ఆంధ్రభూమి బ్యూరో**

హైదరాబాద్, జనవరి 7: హైదరాబాద్ నగరంలో ఉన్న పరిశ్రమలను ఔటర్ రింగ్ రోడ్డు వెలుపలకు తరలించేందుకు ఉద్దేశించిన జీవో 20ను వెంటనే అమలు చేయాలని, కాలుష్య పరిశ్రమల వల్ల పర్యావరణం దెబ్బతింటోందని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు ఫోరం కార్యదర్శి ఎం పద్మనాభరెడ్డి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కోరారు. 2012లోనే పరిశ్రమ యాజమాన్యాలతో ప్రభుత్వం సమావేశం జరిపి కీలక నిర్ణయం తీసుకుని జీవో విడుదల చేసిందన్నారు. హైదరాబాద్ పరిసరాల్లో మొత్తం 1545 పరిశ్రమలు ఉన్నాయి. ఇందులో 385 ఓఆర్ ఆర్ వెలుపల ఉన్నాయి. మిగిలిన 1160 పరిశ్రమలు 803 రెడ్ కేటగిరీలో, 357 ఆరేంజి కేటగిరీలో ఉన్నాయి. వీటిని తరలించేందుకు కాలుష్య నియంత్రణ మండలి, అటవీ పర్యావరణ శాఖ మార్గదర్శకాలను విడుదల చేసింది. కాలుష్య పరిశ్రమలను తరలిస్తామని టీఎస్ఐఐసీ చాలా సార్లు ప్రకటనలు చేసిందన్నారు. కొత్తగా 8206 పరిశ్రమలకు అనుమతులు ఇచ్చారు. ఇందులో 835 రెడ్ కేటగిరీ, 2315 ఆరెంజ్ కేటగిరీ, 5056 గ్రీన్ వైట్ కేటగిరీ పరిశ్రమలు ఉన్నాయని పరిశ్రమల అధికారులు చెప్పారన్నారు. ఈ పరిశ్రమలు శుద్ధి చేయకుండా విడుదల చేసిన విష పదార్థాలు హుస్సేన్ సాగర్‌లో కలుస్తున్నాయి. కాలుష్య నివారణకు ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొనాలన్నారు. నగరంలో ఉన్న పరిశ్రమలను ఓఆర్‌ఆర్ వెలుపలకు తరలించాలన్నారు.

**1వ పేజీ తరువాయి**

# 'నిర్భయ' దోషులకు 22న ఉరి

ఖరారు చేయగా, క్షమా భిక్షను రాష్ట్రపతి తిరస్కరించారు. రివ్యూ పిటిషన్లు అన్నింటినీ కోర్టులు కొట్టేశాయి. ఈ పరిస్థితుల్లో, ఇతరత్రా మార్గాలు ఉన్నాయేమోనన్న ఆశతో దోషుల తరపు లాయర్లు క్యూరేటివ్ పిటిషన్లు దాఖలు చేస్తారు. అయితే, వీటికి కోర్టు సానుకూలంగా స్పందించే అవకాశాలు చాలా తక్కువ. ప్రత్యేకించి, దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన నిర్భయ వంటి కేసులో దోషులను లేదా వారిలో ఒకరు లేదా కొంత మందికి శిక్షను మార్చడం దాదాపు అసాధ్యమనే చెప్పాలి. 2012 16వ తేదీ అర్ధ రాత్రి, ఢిల్లీలో ఒక బస్సులో ప్రయాణిస్తూ, 23 ఏళ్ల పారామెడికల్ విద్యార్థినిపై ఆరుగురు అత్యాచారం జరిపారు. అనంతరం ఆమెను బస్సు నుంచి కిందకు తోసేసి పారిపోయారు. ఈ సంఘటన దేశంలో ప్రకంపనలు సృష్టించింది. బాధితురాలి పేరును గోప్యంగా ఉంచేందుకు వీలుగా ఆమె పేరును నిర్భయగా పేర్కొగా, అదే పేరుతో కేసు దాఖలైంది. కాగా, ఢిల్లీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలిని, అత్యుత్తమ చికిత్స నిమిత్తం సింగపూర్ తరలించారు. అక్కడ ఆమె డిసెంబర్ 29న మృతి చెందింది. పోలీసులు అరుగురు నిందితులను అరెస్టు చేయగా, బస్సు డ్రైవర్ రాం సింగ్ తీహార్ జైల్లో ఆత్మహత్య చేసుకున్నాడు. సంఘటన జరిగే సమయంలో మైనర్ అయినందున ఓ దోషిని జువైనల్ హోంకు తరలించారు. అక్కడ మూడేళ్ల శిక్షను ముగించుకొని అతను విడుదలయ్యాడు. కాగా, మిగతా నలుగురికి, ఈ దారుణంగా జరిగిన ఏడేళ్లకు ఉరి శిక్ష అమలుకానుంది.

# 13న ఇద్దరు ముఖ్యమంత్రుల భేటీ

ఆస్తుల పంపిణీ పెండింగ్‌లో పడింది. ఇరు రాష్ట్రాల మధ్య జటిలంగా మారిన విద్యుత్ ఉద్యోగుల పంపిణీ అంశాన్ని ఇటీవల ధర్మాధికారి తీర్పు వెలువరించారు. ఈ మేరకు కొంతమంది ఉద్యోగులు తమకు కేటాయించిన రాష్ట్రంలో విధుల్లో చేరినప్పటికీ మరికొందరు అభ్యంతరాలు వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఇద్దరు సీఎంల భేటీ తర్వాత తెలంగాణలో ఆర్టీసీ కార్మికులు సమ్మెకు దిగడం, ఆ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ మాదిరిగా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని తెలంగాణ ఆర్టీసీ జేఏసీ డిమాండ్ చేసిన విషయం తెలిసిందే. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే అంశంలో ఏపీ ప్రభుత్వాన్ని ఉద్దేశించి తెలంగాణ సీఎం కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను అక్కడి మంత్రులు తప్పు పట్టిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇద్దరు సీఎంల భేటీపై ఇరు రాష్ట్రాల రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

# గ్రేటర్ రాయలసీమలోనే ఆంధ్ర రాజధాని

విడిపోయినప్పుడు కర్నూలు రాజధానిగా ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిన విషయాన్ని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. విశాలమైన తెలుగు వారి సఖ్యత కోసం ఆంధ్రప్రదేశ్ భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఏర్పడినప్పుడు కర్నూలు రాజధానిని గ్రేటర్ రాయలసీమ వాసులు త్యాగం చేశారని వారు పేర్కొన్నారు. శ్రీశైలం రిజర్వాయర్ నిర్మాణానికి దాదాపు 80 వేల ఎకరాల సాగుభూమిని ఎలాంటి లాభాపేక్ష లేకుండా త్యాగం చేశారన్నారు. ఈనాటికీ భూసేకరణ కింద చెల్లించాల్సిన నష్టపరిహారం సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయని వారు అన్నారు. త్యాగాలకు ఒక హద్దు ఉంటుందన్న విషయాన్ని హైపవర్ కమిటీ గమనంలో ఉంచుకుని సిఫార్సులు చేయాలన్నారు. త్యాగాలు, మనోభావాలు, ఆత్మగౌరవం, హక్కులు లాంటి పదాలకు జీఎన్‌రావు కమిటీ, బోస్టన్ గ్రూపు కన్సల్టెన్సీ లాంటి కమిటీల నిఘంటువుల్లో అర్థాలు ఉండవన్నారు. ప్రజల నుంచి వచ్చిన వారు మాత్రమే ఆ పదాలకు అర్థాలు, పర్యవసానాలు అవగతం చేసుకోగలరని వారు అన్నారు. గ్రేటర్ రాయలసీమ వాసులు చేసిన త్యాగాలు కాలరాయకుండా గతంలో ఉన్న రాజధానిని గ్రేటర్ రాయలసీమలో పునరుద్ధరించాలని సిఫార్సు చేయాలని వారు కోరారు.

# షెడ్యూల్ ప్రకారమే 'పుర'పోరు

ఎన్నికలు నిర్వహిస్తున్నామని నాగిరెడ్డి తెలిపారు. ఈ నియోజకవర్గం ఖాళీగా ఉందన్నారు. రాష్ట్రంలోని మిగతా కార్పొరేషన్లు, మున్సిపాలిటీలతో పాటు దీనికి కూడా జనవరి 22న పోలింగ్ ఉంటుందన్నారు.

ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ చేసిన కార్పొరేషన్లు ఇవీ.. రామగుండం, బడంగ్‌పేట, మీర్‌పేట, బండ్లగూడ జాగీర్, బోడుప్పల్, పీర్జాదిగూడ, జవహర్‌నగర్, నిజాంపేట, నిజామాబాద్.

మంగళవారం రాత్రి జారీ చేసిన షెడ్యూల్ ఈ విధంగా ఉంది.

**నోటిఫికేషన్ వివరాలు...**

**ఎన్నికల కార్యక్రమం ఎన్నికల షెడ్యూల్**

| | |
|---|---|
| నోటిఫికేషన్ జారీ | జనవరి 7 |
| రిటర్నింగ్ అధికారులు | |
| జారీ చేసే నోటీస్ | 8వ తేదీ |
| నామినేషన్ల స్వీకరణ | 8 ఉదయం 10.30 నుండి 5 వరకు |
| ఓటర్ల జాబితా వెల్లడి | 8వ తేదీ |
| నామినేషన్ల చివరి తేదీ | 10వ తేదీ సాయంత్రం 5 వరకు |
| నామినేషన్ల పరిశీలన | 11వ తేదీ ఉదయం 11 గంటలకు |
| అప్పీల్‌కు అవకాశం | 12వ తేదీ సాయంత్రం 5 వరకు |
| అప్పీళ్ల పరిష్కారం | 13వ తేదీ సాయంత్రం 5 లోగా |
| నామినేషన్ల ఉపసంహరణ | 14వ తేదీ మధ్యాహ్నం 3 వరకు |
| పోలింగ్ | 22న |
| రీపోల్..అవసరమైతే | 24న |
| ఓట్ల లెక్కింపు | 25వ తేదీ ఉ. 8 గంటల నుండి |
| ఫలితాల వెల్లడి | లెక్కింపు పూర్తవగానే.. |

# అమాత్యులకు గండం లేనట్టే!

చూపుతారోనన్న భయం మాత్రం ఇద్దరు ముగ్గురు మంత్రులకు పట్టుకుంది. మంత్రులు ప్రాతినిధ్యం వహించే నియోజకవర్గాల పరిధిలో ముగ్గురికి మాత్రమే కార్పొరేషన్లు ఉన్నాయి. మంత్రి గంగుల కమలాకర్ ప్రాతినిధ్యం వహించే జిల్లా పరిధిలో కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్, మంత్రి సబితా ఇంద్రారెడ్డి పరిధిలో మీర్‌పేట, బడంగిపేట, బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్లు, మంత్రి మల్లారెడ్డి పరిధిలో బోడుప్పల్, ఫీర్జాదిగూడ, జవహర్‌నగర్, నిజాంపేట కార్పొరేషన్లు ఉన్నాయి. నిజామాబాద్ జిల్లా పరిధిలోనూ ఆ నగర కార్పొరేషన్ ఉన్నప్పటికీ అక్కడి నుంచి ప్రాతినిధ్యం వహించేవారు మంత్రివర్గంలో ఎవరూ లేరు. ఖమ్మం కార్పొరేషన్ నుంచి మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మంత్రి హరీశ్‌రావు ప్రాతినిధ్యం వహిస్తున్న సిద్దిపేట కార్పొరేషన్‌కు ప్రస్తుతం ఎన్నికలు జరగడం లేదు. ఇక మిగతా మంత్రుల పరిధిలో మున్సిపాలిటీలు ఉన్నాయి తప్ప కార్పొరేషన్లు లేవు. ముఖ్యమంత్రి కేసీఆర్ నియోజకవర్గంలో గజ్వేల్, మంత్రి కేటీఆర్ పరిధిలో సిరిసిల్ల, మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పరిధిలో మహబూబ్‌నగర్, మంత్రి నిరంజన్‌రెడ్డి పరిధిలో వనపర్తి, పెబ్బేర్, మంత్రి కొప్పుల ఈశ్వర్ పరిధిలో ధర్మపురి, మంత్రి ఈటల రాజేందర్ పరిధిలో జమ్మికుంట, హుజూరాబాద్, మంత్రి ప్రశాంత్‌రెడ్డి పరిధిలో భీంగల్, మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పరిధిలో నిర్మల్ మున్సిపాలిటీలు ఉన్నాయి. చాలామటుకు మంత్రులు ప్రాతినిధ్యం వహించే పట్టణాలే మున్సిపాలిటీలుగా ఉండడం వల్ల అక్కడ పాలక పార్టీ గెలుపొందడం పెద్దకష్టమేమీ కాదని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

# బీజేపీలోకి మోత్కుపల్లి

**ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి**

న్యూఢిల్లీ, జనవరి 7: మాజీ మంత్రి, సీనియర్ నాయకుడు మోత్కుపల్లి నర్సింహులు మంగళవారం ఢిల్లీలో బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జగత్‌ప్రకాశ్ నడ్డా ఆయనకు బీజేపీ కండువా కప్పడంతో పాటు సభ్యత్వ రశీదు అందజేస్తూ పార్టీలోకి ఆహ్వానించారు. ఏపీ శాసనసభ ఎన్నికలకు ముందు తెలుగుదేశానికి రాజీనామా చేసిన మోత్కుపల్లి గత ఏడాది నవంబర్ 4నే బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా, తాత్కాలిక అధ్యక్షుడు నడ్డాను కలిసి పార్టీలో చేరే అంశం గురించి చర్చించారు. ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలు జరుగనున్నందున ఈ సమయంలో బీజేపీలో చేరితే మంచిదనే అభిప్రాయంతో ఆయన ఢిల్లీకి వచ్చి పార్టీ తీర్థం పుచ్చుకున్నారని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి జీ కిషన్ రెడ్డి, బీజేపీ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్య

### నడ్డా సమక్షంలో పార్టీలో చేరిక

క్షుడు డాక్టర్ లక్ష్మణ్, పార్లమెంటు సభ్యులు సుజనా చౌదరి, గరికపాటి మోహనరావు తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. మోత్కుపల్లి నరసింహులు వంటి సీనియర్ నాయకులు పార్టీలో చేరడం వలన తెలంగాణ బీజేపీ మరింత పటిష్టం కావడంతోపాటు సమీప భవిష్యత్తులో టీఆర్‌ఎస్‌కు ప్రత్యామ్నాయ పార్టీగా అవతరిస్తుందని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ అభిప్రాయపడ్డారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో పని చేసేందుకు ఇతర పార్టీలకు చెందిన పలువురు సీనియర్ నాయకులు ఇష్టపడుతున్నారని ఆయన తెలిపారు.

తెలంగాణలో ప్రఖ్యాతిగాంచిన సమ్మక్క, సారక్క జాతరను జాతీయ పండుగగా ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్లు ఆయన వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం తమ డిమాండ్‌ను సానుభూతితో పరిశీలిస్తుందనే ఆశాభావాన్ని లక్ష్మణ్ వ్యక్తం చేశారు. తెలంగాణలో నిరంకుశ పాలన కొనసాగుతోందని బీజేపీలో చేరిన మోత్కుపల్లి నర్సింహులు ఆరోపించారు. కుటుంబ పాలన కొనసాగిస్తున్న కేసీఆర్‌ను బీజేపీ ఒక్కటే ఎదుర్కోగలదని ఆయన చెప్పారు.

# బాధ్యతలు స్వీకరించిన 'దిశ' స్పెషల్ ఆఫీసర్ దీపిక



గుంటూరు, జనవరి 7: మహిళలు, చిన్నారుల రక్షణ కోసం రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన దిశ చట్టం అమలుకు నియమించిన ప్రత్యేక అధికారిణి దీపిక మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. 2014 బ్యాచ్‌కు చెందిన ఐపిఎస్ అధికారిణి దీపికను దిశ చట్టాన్ని పటిష్టంగా అమలు చేసేందుకు ప్రత్యేక అధికారిణిగా ప్రభుత్వం నియమించింది. ఇప్పటికే స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శిగా ఉన్న కృత్తికాశుక్లాను కూడా ప్రత్యేక అధికారిణిగా నియమించిన విషయం విదితమే.

తాజాగా బాధ్యతలు స్వీకరించిన ఐపీఎస్ దీపిక మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న అకృత్యాలకు సంబంధించిన కేసులను రాష్ట్రప్రభుత్వం నిర్దేశించిన విధంగా త్వరితగతిన దర్యాప్తు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. నిందితులకు కఠిన శిక్షలు పడేవిధంగా అన్ని చర్యలు తీసుకుంటామని, ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా పనితీరు ప్రదర్శిస్తానని దీపిక పేర్కొన్నారు.

# శాస్త్రోక్తంగా వైకుంఠ ద్వాదశి చక్రస్నానం

తిరుపతి, జనవరి 7: తిరుమల శ్రీవారి ఆలయంలో వైకుంఠ ద్వాదశి సర్వదర్శనాన్ని పురస్కరించుకుని మంగళవారం ఉదయం శాస్త్రోక్తంగా చక్రస్నానం నిర్వహించారు. ముందుగా శ్రీ సుదర్శన చక్రత్తాళ్వార్‌ను శ్రీవారి ఆలయం నుంచి శ్రీ భూవరాహ స్వామివారి ఆలయానికి ఊరేగింపుగా తీసుకువచ్చారు. శ్రీవారి పుష్కరిణిలో ఉదయం 4.30 నుంచి 5.30 గంటల మధ్య స్నపన తిరుమంజనం, శ్రీ సుదర్శన చక్రస్నాన మహోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. శ్రీ స్వామివారి పుష్కరణి తీర్థంలో చక్రస్నాన సుముహూర్తాన స్నానమాచరించిన వారికి తిరుమల శేషగిరులలో వెలిసివున్న 66 కోట్ల పుణ్యతీర్థ స్నానఫలం దక్కుతుందని పురాణాల ప్రాశస్త్యం.

# రివర్స్ టెండరింగ్‌లో మరో 13.7 కోట్లు ఆదా

**ఆంధ్రభూమి బ్యూరో**

విజయవాడ, జనవరి 7: ఏపీలో టిడ్కో ద్వారా చేపడుతున్న గృహ నిర్మాణ ప్రాజెక్టు పనుల్లో రివర్స్ టెండరింగ్ ద్వారా తాజాగా మరో 13.7 కోట్ల రూపాయలు ఆదా అయింది. పట్టణ ప్రాంతాల్లో నిర్మిస్తున్న గృహ నిర్మాణానికి సంబంధించి గుంటూరు జిల్లా ప్యాకేజీకి 130.4 కోట్ల రూపాయల అంచనాతో 2176 యూనిట్ల నిర్మాణానికి రివర్స్ టెండర్లను ఆహ్వానించారు. రివర్స్ టెండరింగ్ ప్రక్రియలో శ్రద్ధ సబూరి ప్రాజెక్టు ఇండియా 116.72 కోట్ల రూపాయలకు టెండరును దక్కించుకుంది. గతంలో 8 ప్రాజెక్టులకు రివర్స్ టెండరింగ్ ప్రక్రియ నిర్వహించి 303.2 కోట్ల మేర భారాన్ని ప్రభుత్వ ఖజానాపై తగ్గించినట్లు అధికారులు మంగళవారం తెలిపారు.

# 18న కేబినెట్‌కు హైపవర్ కమిటీ నివేదిక అందజేత

**ఆంధ్రభూమి బ్యూరో**

విజయవాడ, జనవరి 7: ఏపీ మంత్రి మండలి సమావేశం ఈ నెల 18న వెలగపూడి సచివాలయంలో నిర్వహించేందుకు నిర్ణయించారు. ఈ నెల 8న జరగాల్సిన మంత్రివర్గ సమావేశాన్ని వాయిదా వేశారు. అదే రోజు హైపవర్ కమిటీ కూడా రాజధాని తదితర అంశాలపై నివేదిక ఇవ్వనుంది. దీంతో ఆ సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది.

# క్రీడాభూమి



వికెట్ తీసిన ఆనందంలో బెన్ స్టోక్స్

## బెన్ స్టోక్స్ ఆల్‌రౌండ్ షో

• రెండో టెస్టులో ఇంగ్లాండ్ విజయం

కేప్‌టౌన్, జనవరి 7: దక్షిణాఫ్రికాతో జరుగుతున్న రెండో టెస్టులో ఇంగ్లాండ్ జట్టు 189 పరుగుల తేడాతో విజయం సాధించింది. చివరి రోజు వరకూ ఉత్కంఠగా సాగిన ఈ మ్యాచ్‌లో 437 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించడంలో రెండో ఇన్నింగ్స్‌కు దిగిన దక్షిణాఫ్రికా విఫల మైంది. దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మెన్లలో ఓపెనర్ పీటర్ మలన్ (84), వికెట్ కీపర్ క్వింటన్ డికాక్ (50) మాత్రమే అర్ధ సెంచరీతో రాణించడంతో 248 పరుగులకు కుప్పకూలింది. ఇంగ్లాండ్ బౌలర్లలో బెన్ స్టోక్స్‌కు 3 వికెట్లు దక్కగా, జేమ్స్ అండర్సన్, జో డేన్లీ రెండేసి వికెట్లు, స్టువర్ట్ బ్రాడ్, డొమినిక్ బెస్, సామ్ కుర్రాన్‌లు ఒక్కో వికెట్ తీశారు.



న్యూజిలాండ్‌లోని ఆక్లాండ్ వేదికగా మంగళవారం జరిగిన ఏఎస్‌బీ క్లాసిక్ మ్యాచ్‌లో ఇటలీకి చెందిన కామిలా జార్జితో తలపడుతున్న అమెరికా టెన్నిస్ క్రీడాకారిణి సెరెనా విలియమ్స్.



మూడు వికెట్లు తీసిన శార్దుల్ ఠాకూర్‌ని అభినందిస్తున్న కెప్టెన్ విరాట్ కోహ్లీ

## భారత్ బోణీ

• ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన టీమిండియా • రెండో టీ20లో విజయం



విరాట్ కోహ్లీ, రిషభ్ పంత్ విజయానందం

ఇండోర్, జనవరి 7: ఈ ఏడాదిలో టీమిండియా గెలుపుతో శుభారంభం చేసింది. శ్రీలంకతో సొంతగడ్డపై జరుగుతున్న రెండో టీ20లో భారత్ 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. అటు బౌలింగ్, ఇటు బ్యాటింగ్‌తో సమష్టిగా రాణించింది. అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక జట్టు ప్రారంభంలో ఫర్వాలేదనిపించింది. ఓపెనర్లు ధనుష్క గుణతిలక, అవిష్క ఫెర్నండోలు మంచి భాగస్వామ్యాన్ని అందించారు. అయితే జట్టు స్కోరు 38 పరుగుల వద్ద అవిష్క ఫెర్నాండో (22)ని వాషింగ్టన్ సుందర్ పెవిలియన్‌కు పంపాడు. ఆ తర్వాత కొద్దిసేపటికే ధనుష్క గుణతిలక (20)ని నవదీప్ సైనీ బౌల్డ్ చేశాడు. ఇక్కడి నుంచి లంక పతనం ప్రారంభమైంది. ఈ క్రమంలో ఒషాడ ఫెర్నాండోతో కలిసి క్రీజులో ఉన్న వికెట్ కీపర్ కుశల్ పెరీరా మూడు సిక్సర్లతో కొద్దిసేపు ఆకట్టుకున్నాడు. అయితే మరోవైపు ఒషాడ ఫెర్నాండో (10) కుల్దీప్ బౌలింగ్ హిట్టింగ్ వచ్చి ఆడే క్రమంలో స్టంపౌట్‌గా వెనుదిరిగాడు. కాసేపటికే కుశల్ పెరీరా (34) కూడా కుల్దీప్ యాదవ్ బౌలింగ్‌లోనే ధావన్‌కు క్యాచ్ ఇచ్చి అవుటయ్యాడు. ఈ దశలో క్రీజులో ఉన్న భానుక రాజపక్స (9), దసున్ శనక (7), ధనుంజయ డిసిల్వా (17), ఇసురు ఉదాన (1), లసిత్ మలింగ (0) ఇలా వచ్చి అలా పెవిలియన్‌కు చేరడంతో శ్రీలంక నిర్ణీత ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 142 పరుగులు చేసింది. వానిందు హసరంగా (16), లహీరు కుమార (0) చివరి వరకు క్రీజులో నిలిచారు. భారత బౌలర్లలో శార్దుల్ ఠాకూర్ 3 వికెట్లు తీసుకోగా, నవదీప్ సైనీ, కుల్దీప్ యాదవ్ రెండేసి వికెట్లు, జస్ప్రీత్ బుమ్రా, వాషింగ్టన్ సుందర్ ఒక్కో వికెట్ పడగొట్టారు.

### ఠాకూర్ సూపర్ బౌలింగ్..

భారత యువ బౌలర్ శార్దుల్ ఠాకూర్ ఈ మ్యాచ్‌లో అద్భుత ప్రదర్శన చేశాడు. 19 ఓవర్‌లో కేవలం 3 పరుగులు మాత్రమే ఇచ్చి 3 వికెట్లు పడగొట్టాడు.

### మెరిసిన లోకేష్, కోహ్లీ..

ఆ తర్వాత లక్ష్య ఛేదనకు దిగిన భారత్ 17.3 ఓవర్లలో కేవలం మూడు వికెట్లు మాత్రమే కోల్పోయి విజయం సాధించింది. భారత బ్యాట్స్‌మెన్లలో ఓపెనర్లు లోకేష్ రాహుల్, శిఖర్ ధావన్ చక్కని శుభారంభాన్ని అందించారు. వీరిద్దరూ కలిసి మొదటి వికెట్‌కు 71 పరుగుల విలువైన భాగస్వామ్యాన్ని నమోదు చేశారు. ఈ క్రమంలో ధాటిగా ఆడుతున్న లోకేష్ రాహుల్ (45) హసరంగాకు వికెట్ల ముందు దొరికిపోవడంతో టీమిండియా తన మొదటి వికెట్‌ను కోల్పోయింది. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన శ్రేయాస్ అయ్యర్‌తో శిఖర్ ధావన్ (32) ఆచితూచి పరుగులను రాబట్టే క్రమంలో హసరంగా బౌలింగ్‌లోనే ఎల్బీడబ్ల్యూగా వెనుదిరిగాడు. అప్పటికీ భారత్ 2 వికెట్లు కోల్పోయి 86 పరుగులు చేసింది. ఈ దశలో క్రీజులోకి వచ్చిన కెప్టెన్ విరాట్ కోహ్లీతో కలిసి శ్రేయాస్ అయ్యర్ శ్రీలంక బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొంటూ పరుగులను రాబట్టారు. అయితే 18వ ఓవర్‌లో లహీరు కుమార వేసిన అద్భుత బంతికి శ్రేయాస్ అయ్యర్ (34) అవుట్ అయ్యాడు. మిగతా పనిని కెప్టెన్ విరాట్ కోహ్లీ (30, నాటౌట్), రిషభ్ పంత్ (1, నాటౌట్) మరో వికెట్ పడకుండా జట్టును గెలిపించారు.

### స్కోర్ బోర్డు..

**శ్రీలంక ఇన్నింగ్స్:** ధనుష్క గుణతిలక (బీ) నవదీప్ సైనీ 20, అవిష్క ఫెర్నాండో (సీ) నవదీప్ సైనీ (బీ) వాషింగ్టన్ సుందర్ 22, కుశల్ పెరీరా (సీ) ధావన్ (బీ) కుల్దీప్ యాదవ్ 10, ఒషాడో ఫెర్నాండో (స్టంప్) పంత్ (బీ) కుల్దీప్ యాదవ్ 10, భానుక రాజపక్స (సీ) పంత్ (బీ) నవదీప్ సైనీ 9, దసున్ శనక (బీ) బుమ్రా 7, ధనుంజయ డిసిల్వా (సీ) శివబ్ దుబే (బీ) శార్దుల్ ఠాకూర్ 17, వాహీదు హసరంగా (నాటౌట్) 16, ఇసురు ఉదాన (సీ) నవదీప్ సైనీ (బీ) శార్దుల్ ఠాకూర్ 1, లసిత్ మలింగ (సీ) కుల్దీప్ యాదవ్ (బీ) శార్దుల్ ఠాకూర్ 0, లహీరు కుమార (నాటౌట్) 0.

**ఎక్స్‌ట్రాలు:** 6, **మొత్తం:** 142 (20 ఓవర్లలో 9 వికెట్లకు)

**వికెట్ల పతనం:** 1-38, 2-54, 3-82, 4-97, 5-104, 6-117, 7-128, 8-130, 9-130.

**బౌలింగ్:** జస్ప్రీత్ బుమ్రా 4-0-32-1, శార్దుల్ ఠాకూర్ 4-0-23-3, నవదీప్ సైనీ 4-0-18-2, వాషింగ్టన్ సుందర్ 4-0-29-1, కుల్దీప్ యాదవ్ 4-0-38-2.

**భారత్ ఇన్నింగ్స్:** లోకేష్ రాహుల్ (బీ) వానిందు హసరంగా 45, శిఖర్ ధావన్ (ఎల్బీడబ్ల్యూ) (బీ) వానిందు హసరంగా 32, శ్రేయాస్ అయ్యర్ (సీ) శనక (బీ) లహీరు కుమార 34, విరాట్ కోహ్లీ (నాటౌట్) 30, రిషభ్ పంత్ (నాటౌట్) 1.

**ఎక్స్‌ట్రాలు:** 2, **మొత్తం:** 144 (17.3 ఓవర్లలో 3 వికెట్లకు)

**వికెట్ల పతనం:** 1-71, 2-86, 3-137

**బౌలింగ్:** లసిత్ మలింగ 4-0-41-0, లహీరు కుమార 3.3-0-30-1, ధనుంజయ డిసిల్వా 2-0-15-0, దసున్ శనక 4-0-26-0, వానిందు హసరంగా 4-0-30-2.

## ఎట్టకేలకు లాభాల్లోకి..



### భారీ నష్టాల నుంచి కోలుకున్న దేశీయ స్టాక్‌మార్కెట్లు

• అమెరికా-ఇరాన్ రాజకీయ ఉద్రిక్తతల ఉపశమనమే కారణమన్న విశ్లేషకులు

• 192.84 పాయింట్లు లాభపడిన సెన్సెక్స్ • నిఫ్టీకి 59.90 పాయింట్ల ఆధిక్యత

• కోలుకున్న రూపాయి.. ముడిచమురు ధరలకు బ్రేక్

ముంబయి, జనవరి 7: మధ్యప్రాచ్య దేశాల్లో నెలకొన్న రాజకీయ ఉద్రిక్తతల క్రమంలో భారీగా నష్టపోయిన దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం ఎట్టకేలకు లాభాల్లోకి వచ్చాయి. అమెరికా-ఇరాన్ దేశాల మధ్య నెలకొన్న వైరం కొంత ఉపశమించిన దాఖలాలు కనిపించడం మదుపర్ల సెంటిమెంటుపై సానుకూల ప్రభావం చూపింది. ఈక్రమంలో బీఎస్‌ఈ 30 షేర్ల సూచీ సెన్సెక్స్ 192.84 పాయింట్లు (0.47 శాతం) లాభపడి 40,869.47 పాయింట్ల ఎగువన స్థిరపడింది. అలాగే బ్రాడర్ ఎన్‌ఎస్‌ఈ సూచీ నిఫ్టీ సైతం 59.90 పాయింట్లు (0.50 శాతం) లాభపడి 12,052.95 పాయింట్ల ఎగువన స్థిరపడింది. కాగా సెన్సెక్స్ ఇంట్రాడేలో ఏకంగా 553 పాయింట్లు ఎగబాకి 41,230.14 పాయింట్ల గరిష్టాన్ని తాకి వాణిజ్య వర్గాల్లో ఉత్సుకత రేపింది. అలాగే నిఫ్టీ సైతం ఓ దశలో 159 పాయింట్లు ర్యాలీ తీసి ఆసక్తిని రేపింది. దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం ఆరు నెలల కనిష్ట ఒక రోజు భారీ నష్టాలను చవిచూసిన సంగతి తెలిసిందే. ఈక్రమంలో మంగళవారం మధ్యప్రాచ్య రాజకీయ ఉద్రిక్తతలు తగ్గడంతో అంతర్జాతీయ మార్కెట్లలో ముడిచమురు ధరలు తగ్గుముఖం పట్టాయి. దీంతో రూపాయి విలువ కొంత వరకు కోలుకుంది. దీంతో వాటాల కొనుగోళ్లు ఊపందుకోవడంతో సెన్సెక్స్ ప్యాక్‌లోని అల్ట్రా సిమెంట్ అత్యధికంగా 2.10 శాతం లాభపడింది. అదే బాటలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్, సన్‌ఫార్మా, ఎన్టీపీసీ, ఏసియన్ పెయింట్స్ సైతం లాభాలను సంతరించుకున్నాయి. మరోవైపు ఇన్ఫోసిస్, ఐసీఐసీఐ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, నెస్లే ఇండియా, హీరో మోటోకార్ప్, పవర్‌గ్రిడ్ నష్టాల్లో ముగిశాయి. రంగాల వారీగా చూస్తే బీఎస్‌ఈలో స్థిరాస్తి, మౌలిక పరికరాలు, ఇందనం, ఫైనాన్స్, మెటల్ సూచీలు 1.83 శాతం లాభపడ్డాయి. టెలికాం, టెక్, ఐటీ, వినిమయ వస్తువుల సూచీలు 0.97 శాతం నష్టపోయాయి. ఇక బ్రాడర్ మార్కెట్‌లో బీఎస్‌ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు 0.99 శాతం లాభపడ్డాయి. ప్రధానంగా ఇరాన్‌కు చెందిన మేజర్ ముడిచమురు ఎగుమతిదారుగా ఉన్న కంపెనీ అమెరికాపై ప్రతీకారం తీర్చుకునే అంశంపై తటస్థంగా ఉండడం వల్ల ముడిచమురు ధరలు తగ్గేందుకు దోహదం చేసిందని విశ్లేషకులు చెబుతున్నారు. అలాగే కేంద్ర గణాంకాల శాఖ 2020 ఆర్థిక సంవత్సర ముందస్తు బడ్జెట్ అంచనాల మేరకు జీడీపీ వృద్ధిరేటు 5 శాతానికి పరిమితమయ్యే అవకాశాలున్నాయి. మార్కెట్ వర్గాల్లో సైతం ఈ ముందస్తు అంచనాలున్నందువల్ల దీనిపై తదుపరి ఎలాంటి ప్రభావం ఉండబోదని ప్రముఖ విశ్లేషకుడు వినోద్ నాయర్ అభిప్రాయపడ్డారు.

### బలపడిన రూపాయి

అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు 0.26 తగ్గి బ్యారెల్ 68.73 డాలర్లు వంతున ట్రేడైంది. దీంతో అమెరికన్ డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 11 పైసలు బలపడి ఇంట్రాడేలో 71.82గా ట్రేడైంది. ఈ క్రమంలో ఆసియా మార్కెట్లన్నీ కళకళలాడాయి. షాంఘై, హాంగ్‌కాంగ్, టోక్యో, సియోల్ స్టాక్ మార్కెట్లు లాభాలతో ముగిశాయి. అలాగే ఐరోపా మార్కెట్లు సైతం ఆరంభ ట్రేడింగ్‌లో లాభాలనే నమోదు చేశాయి.

# వాణిజ్యభూమి

## నేడు దేశవ్యాప్త ప్రభుత్వ రంగ బ్యాంకుల సమ్మె

• పిలుపునిచ్చిన 10 జాతీయ కార్మిక, ఉద్యోగ సంఘాలు




న్యూఢిల్లీ, జనవరి 7: పది జాతీయ కార్మిక సంఘాలు సంయుక్తంగా బుధవారం ప్రభుత్వ రంగ బ్యాంకుల సమ్మెకు పిలుపునిచ్చాయి. ఈక్రమంలో దేశ వ్యాప్తంగా బ్యాంకుల్లో లావాదేవీలకు ఆటంకం కలుగనుంది. ఇప్పటికే మెజారిటీ శాతం బ్యాంకులు ఈ సమ్మె విషయాన్ని స్టాక్ ఎక్చేంజీలకు తెలియజేయడం జరిగింది. అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం (ఏఐబీఈఏ), అఖిల భారత బ్యాంకు అధికారుల సంఘం (ఏఐబీఓఏ)లతోబాటు బ్యాంక్ కర్మచారీ సేనా మహాసంఘ్ (బీకేఎస్ఎం), బీఈఎఫ్ఐ, ఐఎన్‌బీఈఎఫ్, ఐఎన్‌బీఓసీలతోబాటు వివిధ కార్మిక సంఘాలు ఈ సమ్మెకు మద్దతిస్తున్నాయి. ఈక్రమంలో ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో డిపాజిట్లు, విత్‌డ్రాయల్స్, చెక్ క్లియరెన్స్ వంటి సేవలకు అంతరాయం ఏర్పడనుంది. ఐతే ప్రైవేటు బ్యాంకుల్లో లావాదేవీలు యథావిధిగానే సాగుతాయి. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా జరుగుతున్న ఈ సమ్మెకు దేశ వ్యాప్తంగా 25 కోట్ల మంది మద్దతు ఉందని ఈ సందర్భంగా కార్మిక సంఘ నేతలు పేర్కొన్నారు. ఈనెల 2న జరిగిన సంప్రదింపుల సమావేశంలో ప్రభుత్వ రంగ బ్యాంకు ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారానికి కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ ఎంతమాత్రం చొరవ చూపలేదని, కార్మిక చట్టాలను కాలరాచే విధానాన్ని ప్రభుత్వం అనుసరిస్తోందని దుయ్యబట్టారు.

### 'సమ్మె విరమింపజేయండి'

ప్రభుత్వ రంగ బ్యాంకు ఉద్యోగులు బుధవారం చేపట్టనున్న దేశ వ్యాప్త సమ్మెను విరమింపజేయాలని కేంద్ర ప్రభుత్వం మంగళవారం ఉన్నతాధికారులను ఆదేశించింది. అలాగే బ్యాంకులు సజావుగా నడిచేందుకు, అభివృద్ధికి అవసరమైన ఓ మిగులు ప్రణాళికను ఉద్యోగులు సూచించాలని ప్రభుత్వం కోరింది. బ్యాంకుల్లోని ఏ విభాగానికి చెందిన ఉద్యోగి అయినా సమ్మెలోకి వెళ్లినా, నిరసన తెలిపినా అందుకు బాధ్యతవహించాల్సి ఉంటుందని హెచ్చరించింది. ప్రత్యేకించి వేతనాల్లో కోత, క్రమశిక్షణా చర్యల వంటివి తప్పవని మంగళవారం నాడిక్కడ విడుదలైన ప్రభుత్వ ప్రకటన పేర్కొంది. కార్మిక మంత్రిత్వ శాఖకు చెందిన వివిధ విభాగాల్లో సహేతుక అభివృద్ధి నిమిత్తం ఓ మిగులు ప్రణాళికను రూపొందించడం జరుగుతుందని, దానికి ఉద్యోగులు, కార్మికులు తగిన సూచనలు, సలహాలు అందించాలని సూచించింది.

## సరళతర వాణిజ్యంపై మార్చిలో తదుపరి ర్యాంకింగ్

• గత ఏడాది నంబర్‌వన్ ర్యాంకును కైవసం చేసుకున్న ఏపీ

• రెండు, మూడో స్థానాల్లో నిలిచిన తెలంగాణ, హర్యానా



న్యూఢిల్లీ, జనవరి 7: కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ వచ్చే మార్చి నెలలో సరళతర వాణిజ్యంపై ప్రత్యేకంగా రెండో సూచీని ఏర్పాటు చేయనుంది. సరళతర వాణిజ్యంలో రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల పనితీరును ఈ సూచీ అంచనా వేసి ర్యాంకింగ్ ఇస్తుందని సంబంధిత అధికారి ఒకరు వెల్లడించారు. ఇప్పటికే ఎన్నికలు వంటి కారణాలతో ఈ సూచీ విడుదలలో జాప్యం జరిగిందని, బహుశా వచ్చే ఫిబ్రవరి లేదా మార్చిలో ఈ సూచీ విడుదలవుతుందన్నారు. వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు సరళతర వాణిజ్యానికి సంబంధించిన అనుమతులకు ఏక గవాక్ష (సింగిల్ విండో) విధానం వంటి అనేక చర్యలు చేపడుతున్నాయి. నిర్మాణ అనుమతులు, కార్మిక నియంత్రణ, పర్యావరణ రిజిస్ట్రేషన్లు, సమాచార సౌలభ్యత, స్థల లభ్యత, సింగిల్ విండో విధానం వంటి అంశాలను మరింత పటిష్టవంతం చేసేందుకు చర్యలు మొదలైనట్టు ఆ అధికారి తెలిపారు. ఇందులో భాగంగా కేంద్ర పరిశ్రమలు, అంతర్గత వాణిజ్యాభివృద్ధి శాఖ (డీపీఐఐటీ), ప్రపంచ బ్యాంకు సౌజన్యంతో వార్షిక సంస్కరణలను 'బిజినెస్ రీఫార్మ్ యాక్షన్ ప్లాన్ (బీఆర్‌ఏపీ) కింద చేపట్టింది.

ఇందుకు సంబంధించిన చివరి ర్యాంకింగ్‌ను గతంలో 2018 జూలైలో ప్రభుత్వం విడుదల చేయగా అప్పట్లో ఆంధ్రప్రదేశ్ అగ్రభాగాన నిలిచింది. తెలంగాణ, హర్యానా తదుపరి స్థానాలను ఆక్రమించాయి. ఝార్ఖండ్, గుజరాత్, చత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్, కర్నాటక, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్ తదుపరి వరుస టాప్‌టెన్ స్థానాల్లో నిలిచాయి. ప్రధానంగా రాష్ట్ర ప్రభుత్వాలు లేదా కేంద్ర పాలిత ప్రాంత ప్రభుత్వాలు సరళతర వాణిజ్యాభివృద్ధికి చేపట్టిన సంస్కరణకు సంబంధించిన సాక్ష్యాలతో కూడిన ఫీడ్‌బ్యాక్ స్కోరు ఆధారంగా ఈ ర్యాంకింగ్‌లు కల్పిస్తున్నట్టు ఆ అధికారి స్పష్టం చేశారు. 2018లోప్రభుత్వాల పనితీరుపై ప్రపంచ బ్యాంకు తాజా నివేదిక మేరకు మొత్తం 190 ఆర్థిక శక్తుల్లో (దేశాల్లో) భారత్ తన స్థానాన్ని

# ఆదర్శ వ్యక్తిత్వం.. అద్వితీయ నాయకత్వం

■ మోదీ వ్యక్తిగత, రాజకీయ జీవితాన్ని కళ్లకు కట్టిన అమిత్ షా
■ ప్రధాని జీవితంపై 'కర్మయోధ గ్రంథ్' ఆవిష్కరణ

న్యూఢిల్లీ, జనవరి 7: ఆదర్శనీయ జీవనంతోపాటు ప్రజల కోసం పరితపిస్తూ రాజనీతిజ్ఞుడిగా, వ్యవహార దక్షుడిగా నిలబడే వ్యక్తే కర్మయోధుడని హోం మంత్రి అమిత్ షా అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ వ్యక్తిగత, రాజకీయ జీవిత సమాహారంగా రూపొందిన 'కర్మయోధ గ్రంథ్'ను మంగళవారం నాడు ఇక్కడ ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఓ కర్మయోధుడికి ఉండాల్సిన అద్వితీయ లక్షణాన్నింటినీ వ్యక్తిగా, నేతగా ప్రధాని మోదీ రంగరించుకున్నారని అమిత్ షా తెలిపారు. మోదీ జీవితానికి సంబంధించిన మూడు ప్రధాన అంశాల గురించి ఆయన మాట్లాడారు. ఓ సిద్ధాంతానికి తన జీవితాన్ని అంకితం చేయడంతోపాటు ఆదర్శాల కోసం రాజకీయాల్లోకి ప్రవేశించడం, అంతిమంగా పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను పరిరక్షించడానికి మోదీ అంకితమయ్యారని ఆయన తెలిపారు. ఈ ఆదర్శాల పునాదిగానే సమున్నత భారతావని నిర్మాణానికి మోదీ కంకణం కట్టుకున్నారని అమిత్ షా పేర్కొన్నారు. నిస్వార్థంగా ఏళ్లతరబడి అవిశ్రాంతంగా దక్షత, సమర్థతతో చేసిన కృషి ఫలితంగానే నరేంద్ర మోదీ ఇపుడు అంతర్జాతీయ నాయకుడయ్యారని, తనకంటూ వ్యక్తిగతంగా ఏమీ మిగుల్చుకోలేదని తెలిపారు. ఓ జాతికి నిస్వార్థంగా సేవ చేయడమంటే ఏమిటో మోదీ జీవితాన్ని లోతుగా పరికిస్తే స్పష్టమవుతుందని అన్నారు. తీవ్ర పేదరికం, సామాజిక నిర్లక్ష్యం మధ్య బాల్యాన్ని గడిపిన మోదీ తన సొంత కృషి, పట్టుదలతో ప్రజల సంక్షేమానికి జీవితాన్ని అంకితం చేసే మహానాయకుడిగా మారారని, ఏ వ్యక్తి పట్ల గానీ సమాజం పట్ల గానీ ఆయనకు వ్యతిరేకత లేదని అమిత్ షా తెలిపారు. నిర్జీవంగా ఉన్న గుజరాత్ బీజేపీని ఓ బలమైన పార్టీగా మార్చిన ఘనత కూడా మోదీదేనని ఆయన అన్నారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రకృతి వైపరీత్యాల నుంచి సామాజిక ఉత్పాతాల వరకు ఎన్నో సవాళ్లను మోదీ ఎదుర్కొన్నారని, వీటన్నింటినీ అధిగమించి గుజరాత్‌ను దేశానికే ఓ నమూనా రాష్ట్రంగా తన శక్తియుక్తులతో తీర్చిదిద్దగలిగారని తెలిపారు. అందరితో కలసి అందరి కోసం అన్న ధ్యేయమే పునాదిగా నవభారత నిర్మాణానికి మోదీ నాంది పలికారని, సంకుచిత రాజకీయాలకు అతీతంగా పాలనా వ్యవస్థను తీర్చిదిద్దారని తెలిపారు. గుజరాత్ నమూనాను ప్రజలు అంగీకరించడం వల్లే దేశ ప్రధాని బాధ్యతను కూడా మోదీకి ప్రజలు అప్పగించారని ఆయన తెలిపారు. 2014లో కేంద్రంలో మోదీ అధికారంలో చేపట్టే సమయానికి 12 లక్షల కోట్ల రూపాయలు అప్పులే ఉన్నాయని, అలాంటి స్థితిలో పాలనా పగ్గాలు చేపట్టి, అవినీతిరహితమైన రీతిలో ప్రభుత్వాన్ని ఆదర్శనీయంగా నడుపుతూ వచ్చారని అమిత్ షా తెలిపారు. దేశంలోని 60 కోట్ల మంది పేద ప్రజలకు మోదీ తీసుకున్న సంక్షేమ చర్యలను అమిత్ షా ఈ సందర్భంగా వివరించారు. 13 కోట్ల మందికి ఎల్‌పీజీ కనెక్షన్లు లభించాయని, దేశంలోని దాదాపు 99 శాతం ఇళ్లకు విద్యుత్ వెలుగులు అందాయని, అలాగే ప్రతి ఇంటికీ మరుగుదొడ్ల కల్పన కూడా జరిగిందని అమిత్ షా గుర్తు చేశారు. అలాగే ఆయుష్మాన్ భారత్ కింద 50 కోట్ల మంది ప్రజలు లబ్ధి పొందుతున్నారని అన్నారు. అంత్యోదయ సిద్ధాంతానికి కట్టుబడి పనిచేస్తున్న మోదీ ప్రభుత్వం 2022 నాటికి ప్రతిఒక్కరికీ ఆవాస కల్పనే ఆశయంగా నిబద్ధతతో కృషి చేస్తోందని అమిత్ షా అన్నారు. అంతర్జాతీయంగా భారత్ కీర్తిప్రతిష్టలను మోదీ ఇనుమడింపజేశారని, ముఖ్యంగా విదేశాంగ విధానాన్ని వర్తమాన అవసరాలకు అనుగుణంగా సంస్కరించారని తెలిపారు. భద్రతాపరంగా కూడా భారత్ తన శక్తిని తిరుగులేని విధంగా చాటుకోగలుగుతోందంటే అందుకు కారణం మోదీ తీసుకున్న చర్యలేనని ఆయన తెలిపారు. అలాగే 370 అధికరణ రద్దు, పౌరసత్వ సవరణ చట్టం, రామాలయ అంశం, ట్రిపుల్ తలాక్ రద్దు, పాక్ ఉగ్ర శిబిరాలపై లక్షిత దాడులతో భారతదేశ నిరుపమాన శక్తి ప్రపంచ దేశాలకు కళ్లకు కట్టిందని అన్నారు. మోదీ వచ్చిన తర్వాత బుజ్జగింపు రాజకీయాలు సమసిపోయాయని, కులతత్వం, ఆశ్రిత పక్షపాతం కూడా నామరూపాలు లేకుండా పోయాయని తెలిపారు.



ప్రధాని నరేంద్ర మోదీ వ్యక్తిగత, రాజకీయ జీవితాలను సమగ్ర దృష్టిలో పరిశీలించి రాసిన 'కర్మయోధ గ్రంథ్'ను మంగళవారం ఢిల్లీలో ఆవిష్కరిస్తున్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా



కెర్మన్‌లో మంగళవారం జరిగిన ఇరాన్ సైనిక కమాండర్ ఖాసీం సులేమానీ అంతిమయాత్ర

# తొక్కిసలాటలో 35 మంది మృతి

■ విషాదంగా మారిన అంతిమ యాత్ర
■ ఇరాన్ కమాండర్ సులేమానీ అంత్యక్రియలు

తెహ్రాన్, జనవరి 7: అమెరికా దాడిలో మరణించిన ఇరాన్ సైనిక కమాండర్ ఖాసీం సులేమానీ అంతిమయాత్ర సందర్భంగా మంగళవారం కెర్మన్ పట్టణంలో జరిగిన తొక్కిసలాటలో 35 మంది మరణించారు. 190 మంది గాయపడ్డారు. సులేమానీ అంత్యక్రియలకు లక్షల సంఖ్యలో ప్రజలు హాజరు కావడంతో ఈ తొక్కిసలాట జరిగింది.

అమెరికా జరిపిన లక్షిత దాడిలో మృతి చెందిన ఇరాన్ ఉన్నత స్థాయి కమాండర్ జనరల్ ఖాసీం సులేమానీ అంత్యక్రియలకు అశేష ప్రజానీకం హాజరయ్యారు. సులేమానీ స్వంత పట్టణం కెర్మన్‌లో మంగళవారం జరిగిన అంత్యక్రియలకు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన అశేష ప్రజానీకం తమ అభిమాన కమాండర్‌కు అంతిమ వీడ్కోలు పలికారు. టెహ్రాన్, ఖావోమ్, మషహాద్, అహ్వాజ్ నగరాలలో రెవల్యూషనరి గార్డ్స్ విదేశీ విభాగానికి అధిపతి జనరల్ ఖాసీం సులేమానీకి శ్రద్ధాంజలి ఘటించడానికి అశేష ప్రజానీకం తరలివచ్చినట్టుగానే మంగళవారం అతని స్వంత పట్టణం కెర్మన్‌లోనూ అతడికి అంతిమ వీడ్కోలు పలకడానికి వేలాది మంది తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన వీరంతా ఆజాదీ స్క్వేర్‌కు సమీపంలో కలిశారు. ఇరాన్ జాతీయ పతాకాలు కప్పిన రెండు శవపేటికలను అక్కడ ప్రజల సందర్శనార్థం ఉంచారు.

వీటిలో ఒకటి జనరల్ సులేమానీది కాగా, రెండోదానిలో అతడి సన్నిహిత అనుచరుడు, బ్రిగేడియర్ జనరల్ హుస్సేన్ పౌర్‌జఫారి భౌతికకాయం ఉంది. 'పవిత్రమయిన రక్షణ విభాగంలో గొప్ప కమాండర్‌కు శ్రద్ధాంజలి ఘటించడానికి మేము ఈరోజు ఇక్కడికి చేరుకున్నాం' అని కెర్మన్‌లో సులేమానీ అంత్యక్రియలలో పాల్గొనేందుకు దక్షిణాది నగరం షిరాజ్ నుంచి వచ్చిన ఒక వ్యక్తి అన్నారు. 'హజ్ ఖాసీంను కెర్మన్ లేదా ఇరాన్ మాత్రమే కాకుండా మొత్తం ప్రపంచం ప్రేమిస్తోంది' అని హెమ్మత్ డెహ్ఘాన్ అనే వ్యక్తి ఒక వార్తా సంస్థ ప్రతినిధితో అన్నారు. 'మొత్తం ప్రపంచం ముస్లింలు, షియాలు, ఇరాక్, సిరియా, అఫ్ఘనిస్తాన్, ప్రత్యేకించి ఇరాన్ భద్రత కోసం ఆయన పనిచేశారు. వీరంతా ఆయనకు రుణపడి ఉన్నారు' అని ఆ 56 ఏళ్ల యుద్ధ వీరుడు అన్నారు.

# ప్రసిద్ధ కళాకారుడు అక్బర్ పదమ్‌సీ ఇకలేరు

కోయంబత్తూరు, జనవరి 7: దేశంలోని అత్యంత ప్రసిద్ధ కళాకారుల్లో ఒకరు, ప్రగతిశీల-ఆధునికతావాద ఉద్యమ వైతాళికుడు అక్బర్ పదమ్‌సీ కన్నుమూశారు. 91ఏళ్ల పదమ్‌సీ సోమవారం రాత్రి ఇక్కడ ఈషా యోగా కేంద్రంలో కాలం చేశారు. సోమవారం రాత్రే యోగా కేంద్రంలో కుటుంబ సభ్యుల సమక్షంలో పదమ్‌సీ అంత్యక్రియలు నిర్వహించినట్టు ఈషా యోగా సెంటర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈషా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సద్గురు జగ్గీ వాసుదేవ్.. పదమ్‌సీకి ఘన నివాళులు అర్పించారు. 'పదమ్‌సీ చేయి తిరిగిన గొప్ప కళాకారుడు. ఆయన తన శేషజీవితాన్ని ఈషా యోగా కేంద్రంలో మాతో గడపటం మా అదృష్టం. రాబోవు తరాలు అద్భుతంగా రంగులద్దే ఇంద్రజాలంలో పదమ్‌సీని స్ఫూర్తిగా తీసుకోవాలి' అని జగ్గీ వాసుదేవ్ పేర్కొన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా పదమ్‌సీ, అతని భార్య భాను ఈషా యోగా కేంద్రంలో నివసిస్తూ వచ్చారు. కొన్నిసార్లు ఈషా యోగా కేంద్రాన్ని సందర్శించిన ఆ దంపతులు తరువాత అక్కడే నివసించాలని నిర్ణయించుకున్నారు.

# పదేళ్ల కుమార్తెను కాటేసిన కసాయి తండ్రికి యావజ్జీవం

మరణించేంత వరకూ జైలులోనే.. ■ మహిళా కోర్టు సంచలన తీర్పు

తంజావూర్ (తమిళనాడు), జనవరి 7: పదేళ్ళ కన్నకూతురిపై అత్యాచారానికి పాల్పడిన తండ్రికి మహిళా కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. తంజావూరు జిల్లాలోని మధుకరై ప్రాంతంలో కుమార్ (31) భార్య, పదేళ్ళ కుమార్తెతో జీవించసాగాడు. దినసరి వేతనంపై కుటుంబాన్ని పోషిస్తున్న కుమార్ భార్య ఇటీవల మరణించింది. అప్పటి నుంచి తన కుమార్తెపై కన్నేసిన కుమార్ కాటేశాడు. ఆ చిన్నారిపై తరచూ అత్యాచారానికి పాల్పడడం ప్రారంభించాడు. అంతేకాకుండా ఈ విషయాన్ని ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించాడు. అయితే ఆ బాలిక శరీరంలో మార్పు రావడాన్ని గమనించిన పాఠశాల ఉపాధ్యాయులు ప్రశ్నించారు. దీంతో ఆ చిన్నారి తన తండ్రి వ్యవహరిస్తున్న తీరును వెల్లడిస్తూ కన్నీటిపర్యంతమైంది. ఉపాధ్యాయులు స్థానికుల, ఇతర సంఘాల మద్దతుతో పోలీసుల దృష్టికి తేవడంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి తండ్రి కుమార్‌ను అరెస్టు చేసి కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. మహిళా కోర్టు న్యాయమూర్తి హెజిహిలరాసి నిందితుడు కుమార్‌కు నాలుగు పర్యాయాలు యావజ్జీవ కారాగార శిక్ష విధించారు. బతికి ఉన్నంత కాలం జైలులోనే గడపాలని ఆదేశించారు. ఇంకా రూ.4500 జరిమానా విధించారు. బాలిక జీవనాధారానికి ఐదు లక్షల రూపాయలు అందజేయాల్సిందిగా న్యాయమూర్తి రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. ఆ చిన్నారిని బాలికల వసతి గృహానికి పంపించారు. కుమార్తె పట్ల తండ్రి సైకోలా ప్రవర్తించాడని న్యాయవాది కోర్టుకు తెలిపారు. బాలికకు వైద్య పరీక్షలు నిర్వహించగా తండ్రి నుంచి చిన్నారికి హెచ్‌ఐవీ సోకినట్లు తేలింది.

# హలో ట్రంప్..

అమెరికా అధ్యక్షుడికి ప్రధాని ఫోన్ ■ ద్వైపాక్షిక సంబంధాలపై వ్యూహాత్మక చర్చ

న్యూఢిల్లీ/వాషింగ్టన్, జనవరి 7: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో భారత ప్రధాని నరేంద్ర మోదీ టెలిఫోన్‌లో మాట్లాడారు. ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలపై వ్యూహాత్మక చర్చ జరిపారు. ఈ విషయాన్ని అమెరికా ఉన్నతాధికారులు ప్రకటించారు. ఫ్లోరిడాలోని మార్ ఏ లాగోలో విశ్రాంతి తీసుకొని, తిరిగి వాషింగ్టన్‌కు వచ్చిన ట్రంప్‌ను మొట్టమొదటిసారి సంప్రదించిన అంతర్జాతీయ నేత మోదీయే కావడం విశేషం. అంతేగాక, ఇరాన్‌లోని రెవల్యూషనరీ గార్డ్స్ జనరల్ ఖాసిం సులేమానీ అమెరికా జరిపిన డ్రోన్ దాడిలో మృతి చెందిన తర్వాత, ఆయనకు ఫోన్ చేసిన ప్రధాని కూడా మోదీనే. భారత విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ అమెరికా సెక్రటరీ ఆఫ్ స్టేట్ మైక్ పొంపెవోతో చర్చలు జరిపిన వెంటనే ట్రంప్‌ను మోదీ టెలిఫోన్ ద్వారా సంప్రదించి, మాట్లాడడం ప్రాధాన్యతను సంతరించుకుంది. కాగా, ఇరువురు నేతలు ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకొన్నారని, రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత పటిష్టం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారని వైట్ హౌస్ అధికారులు తమ ప్రకటనలో తెలిపారు. ఇరాన్‌పై దాడుల కారణంగా గల్ఫ్ ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం నెలకొనగా, పెట్రోలియం ఉత్పత్తుల సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడే ప్రమాదం ఏర్పడింది. ఇది భారత్‌కు ఒక రకంగా సమస్యను సృష్టించే అంశం.

# పాక్‌లో మైనారిటీలు ఎంత మంది?

రెండేళ్లు గడుస్తున్నా తేలని లెక్కలు ■ అసలు సిక్కుల లెక్కే లేదు

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 7: పాకిస్తాన్‌లోని ఇమ్రాన్ ఖాన్ ప్రభుత్వం దేశ జనాభా లెక్కల సేకరణ జరిగి రెండేళ్లు కావస్తున్నా హిందూ, సిక్కు, క్రైస్తవ తదితర మతాలకు చెందిన అల్పసంఖ్యాక ప్రజల వివరాలు మాత్రం వెల్లడించటం లేదు. 2017లో పాకిస్తాన్‌లో జనాభా లెక్కల సేకరణ జరిగింది. విచిత్రం ఏమిటంటే పాక్ ప్రభుత్వం సిక్కుల జనాభా లెక్కలను సేకరించటం మానివేసింది.

కేవలం హిందువులు, క్రైస్తవులు, పార్శీల జనాభా వివరాలు మాత్రమే సేకరించడం గమనార్హం. దేశంలో మొత్తం ఇరవై కోట్ల మంది ప్రజలున్నారని తేల్చిన ప్రభుత్వం ఇందులో హిందూ, క్రైస్తవ తదితర మతాలకు చెందిన మైనారిటీలు ఎంతమంది ఉన్నారనేది మాత్రం ప్రకటించడం లేదు. పాకిస్తాన్‌లో దాదాపు ఇరవై సంవత్సరాల తరువాత 2017లో జనాభా లెక్కల సేకరణ జరిగింది. మెజారిటీ ప్రజలు ఎంతమంది ఉన్నారనేది వెల్లడించిన ప్రభుత్వం మైనారిటీలకు సంబంధించిన వివరాలు మాత్రం వెల్లడించేందుకు అంగీకరించడం లేదు. 1998లో జరిపిన జనాభా లెక్కల ప్రకారం పాకిస్తాన్ మొత్తం జనాభా 13.23 కోట్లు కాగా ఇందులో మైనారిటీల జనాభా 3.72 శాతం మాత్రమే. ముస్లింల జనాభా 12.74 కోట్లు (96.28 శాతం), క్రైస్తవులు 21 లక్షలు (1.59 శాతం), హిందువులు 21.17 లక్షలు (1.60 శాతం). సింధ్‌లో అత్యధికంగా 6.51 శాతం మంది హిందువులు ఉన్నట్లు జనాభా లెక్కలు సూచిస్తున్నాయి. ఇస్లామాబాద్‌లో 4.07 శాతం మంది క్రైస్తవులు ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. మతం ఆధారంగా భారతదేశాన్ని రెండుగా చీల్చినప్పుడు పాకిస్తాన్‌లోని ముస్లిమేతరుల జనాభా 23 శాతం ఉండేది. అంటే యాభై సంవత్సరాల్లో మైనారిటీల జనాభా దాదాపు ఎనభై శాతం తగ్గి 3.7 శాతానికి పడిపోవడం గమనార్హం. పాకిస్తాన్ స్టాటిస్టిక్స్ బ్యూరో లెక్కల ప్రకారం దేశంలో 1951లో నిర్వహించిన మొదటి జనాభా లెక్కల సేకరణ ప్రకారం మొత్తం జనాభా 3.37 కోట్లు. 1961 నాటికి ఇది 4.28 కోట్లకు పెరిగింది. 1972 లెక్కల ప్రకారం 6.53 కోట్లకు చేరగా 1981 లెక్కల ప్రకారం పాకిస్తాన్ జనాభా 8.42 కోట్లు. 1998 జనాభా లెక్కల ప్రకారం పాకిస్తాన్ మొత్తం జనాభా 13.23 కోట్లైతే 2017 జనాభా లెక్కల ప్రకారం ఇది 20.77 కోట్లయింది. పాకిస్తాన్‌లో ముస్లింల జనాభా పెరుగుతుంటే హిందూ తదితర మైనారిటీల సంఖ్య తగ్గుతూ రావడం గమనార్హం. పాకిస్తాన్ ప్రభుత్వం 2017లో నిర్వహించిన జనాభా లెక్కల్లో తేలిన మైనారిటీ ప్రజల జనాభా వివరాలను 2018లో వెల్లడిస్తామంటూ ఇచ్చిన హామీని కూడా ప్రభుత్వం గౌరవించడం లేదని తెహరీక్-ఏ-ఇన్సాఫ్ పార్టీ ప్రజాప్రతినిధి రమేష్‌కుమార్ వంగ్వానీ చెప్పారు. అల్పసంఖ్యాక ప్రజల జనాభా వివరాలు వెల్లడించేందుకు ప్రభుత్వం ఎందుకు అంగీకరించడం లేదనేది తమకు అర్థం కావడం లేదని పాకిస్తాన్ హిందూ కౌన్సిల్ చీఫ్ పాట్రన్ కూడా అయిన వంక్వానీ వాపోతున్నారు. పాకిస్తాన్‌లో దాదాపు ఎనభై లక్షల మంది హిందువులు ఉన్నారని ఆయన చెబుతున్నారు. పాకిస్తాన్ పౌరుల వివరాలను రిజిష్టర్ చేసే జాతీయ డేటాబేస్ అండ్ రిజిస్ట్రేషన్ అథారిటీ (ఎన్‌ఏడీఆర్‌ఏ) లెక్కల ప్రకారం కూడా పాకిస్తాన్‌లోని మొత్తం హిందువుల సంఖ్య దాదాపు 80 లక్షలని ఆయన అంటున్నారు. అనధికార లెక్కల ప్రకారం దేశంలో 50 లక్షల మంది క్రైస్తవులు, 16 వేల మంది సిక్కులు ఉన్నారని వంక్వానీ చెప్పారు. రిజిష్టర్డ్ ఓటర్ల లెక్కల ప్రకారం హిందూ ఓటర్ల సంఖ్య 3.5 శాతం, 3 శాతం మంది క్రైస్తవ ఓటర్లు ఉన్నారని ఆయన అంటున్నారు. ప్రభుత్వం మైనారిటీల పట్ల అనుసరిస్తున్న వివక్షను విడనాడి, వారి జనాభా లెక్కలను వెంటనే విడుదల చేయాలని ముత్తహిదా ఖ్వామీ మూమెంట్-పీకి పార్లమెంటులో ప్రాతినిధ్యం వహిస్తున్న మంగళ శర్మ డిమాండ్ చేశారు.

జనాభా లెక్కల సేకరణ పత్రంలో సిక్కుల వివరాలు సేకరించేందుకు సంబంధించిన కాలమ్ లేనందున తమ జనాభా ఎంత అనేది స్పష్టం కావటం లేదని పాకిస్తాన్ సిక్కు కౌన్సిల్ నాయకుడు రమేష్ సింగ్ చెబుతున్నారు.

# రాజీవ్ హంతకుల విడుదలకు వ్యతిరేకం

■ తమిళనాడు ప్రతిపాదనను అప్పడే తిరస్కరించాం
■ మద్రాసు హైకోర్టుకు తెలిపిన కేంద్రం

చెన్నై, జనవరి 7: మాజీ ప్రధాన మంత్రి రాజీవ్‌గాంధీ హత్య కేసులో మరణ శిక్ష ఖరారయిన మొత్తం ఏడుగురు ముద్దాయిలను విడుదల చేయాలని తమిళనాడు ప్రభుత్వం 2016 మార్చిలో చేసిన ప్రతిపాదనను తాను రెండేళ్ల క్రితమే తిరస్కరించినట్టు కేంద్ర ప్రభుత్వం మంగళవారం మద్రాసు హైకోర్టుకు తెలియజేసింది. అలా విడుదల చేస్తే, అది ఒక 'ప్రమాదకరమయిన పూర్వోదాహరణ'గా నిలుస్తుందని, అందువల్లనే ఆ ప్రతిపాదనను తిరస్కరించినట్టు కేంద్రం వివరించింది. ఈ కేసును దర్యాప్తు చేసిన కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) కూడా తమిళనాడు ప్రభుత్వ ప్రతిపాదనను వ్యతిరేకించిందని కేంద్ర ప్రభుత్వం హైకోర్టుకు గుర్తుచేసింది. తమిళనాడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి 2018 ఏప్రిల్ 18వ తేదీన రాసిన లేఖలో కేంద్ర ప్రభుత్వం తన వైఖరిని వెల్లడించింది. నేర శిక్షాస్మృతి (సీఆర్‌పీసీ)లోని సెక్షన్ 435 ప్రకారం, ఏడుగురు ముద్దాయిల శిక్షను తగ్గించే ప్రతిపాదనను ఆమోదించబోనని కేంద్ర ప్రభుత్వం ఆ లేఖలో స్పష్టం చేసింది. ఏడుగురు ముద్దాయిల్లో ఒకరయిన నళిని శ్రీహరన్ దాఖలు చేసిన పిటిషన్ విచారణ సందర్భంగా అదనపు సొలిసిటర్ జనరల్ జి.రాజగోపాలన్ మంగళవారం న్యాయమూర్తులు ఆర్.సుబ్బయ్య, ఆర్.పొంగియప్పన్‌లతో కూడిన ధర్మాసనానికి కేంద్ర ప్రభుత్వం రాసిన లేఖ ప్రతిని సమర్పించారు. తనను, ఇతరులను విడుదల చేయాలని తమిళనాడు రాష్ట్ర కేబినెట్ సిఫారసు చేసినప్పటికీ, తనను వెల్లూరు జైలులో అక్రమంగా నిర్బంధించారని నళిని తన పిటిషన్‌లో వాదించారు. కేంద్ర ప్రభుత్వం రాసిన లేఖను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం కేంద్ర హోంశాఖ కార్యదర్శిని ప్రతివాదుల జాబితాలో చేర్చింది. అలాగే జనవరి 28వ తేదీలోగా కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని కేంద్ర హోంశాఖ కార్యదర్శిని ఆదేశించింది. అప్పటి వరకు ఈ కేసు విచారణను వాయిదా వేసింది.

# కావాల్సినంత ఉల్లి ఇస్తాం

రండి బాబూ.. రండి ■ రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్ర మంత్రి పాశ్వాన్ సూచన

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 7: కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ప్రజాపంపిణీ శాఖ మంత్రి రాంవిలాస్ పాశ్వాన్ ఉల్లిపాయల విక్రయం చేపట్టారు. ఉల్లిపాయలు కావాలంటూ మొదట గగ్గోలు పెట్టిన రాష్ట్రాలు ప్రజల నుండి డిమాండ్ తగ్గడంతో కేంద్ర ప్రభుత్వం విదేశాల నుండి దిగుమతి చేసుకున్న ఉల్లిపాయలను కొనుగోలు చేసేందుకు ముందుకు రావడం లేదు. దీనితో ముంబయి ఓడరేవుకు వచ్చిన విదేశీ ఉల్లిపాయలు కుళ్లియే ప్రమాదం ఏర్పడింది. దేశంలో ఉల్లిపాయల కొరత ఏర్పడడంతో కేంద్ర ప్రభుత్వం విదేశాల నుండి ఉల్లిపాయలను దిగుమతి చేసుకుంది. ఇప్పుడు ఆ ఉల్లిపాయలను కొనేవారు కనిపించకపోవటంతో రాంవిలాస్ పాశ్వాన్ రంగప్రవేశం చేసి ముందు అడిగినట్లు ఉల్లిపాయలను కొనుగోలు చేయాలని ఆయా రాష్ట్ర ప్రభుత్వాలను కోరుతున్నారు. తక్కువ ధరకు విదేశీ ఉల్లిపాయలు అమ్ముతున్నాం.. కొనుక్కుని ప్రజలకు పంపిణీ చేయాలని ఆయన అన్ని ప్రభుత్వాలకు ఆహ్వానం పంపించారు. ఉల్లిపాయలను వాటి నాణ్యతను బట్టి కిలో 49 నుండి 58 రూపాయలకు విక్రయిస్తామని ఆయన తెలిపారు. రాంవిలాస్ పాశ్వాన్ మంగళవారం తమ కార్యాలయంలో విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసి దేశంలో ఉల్లిపాయల డిమాండ్, లభ్యత, విదేశాల నుండి ఉల్లిపాయల దిగుమతి తదితర అంశాల గురించి వివరించారు. దేశంలో ఉల్లిపాయల కొరత ఏర్పడడం తెలిసిందే. ప్రజల ఉల్లిపాయల డిమాండ్‌ను తట్టుకొనేందుకు 33,139 టన్నుల ఉల్లిపాయలు కావాలని మొదట ప్రతిపాదించిన రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల నుండి డిమాండ్ తగ్గడంతో తమ అవసరాన్ని 14,309 టన్నులకు కుదించుకున్నాయి. అయితే కేంద్ర ప్రభుత్వం అప్పటికే 40 వేల టన్నుల ఉల్లిపాయలను విదేశాల నుండి దిగుమతి చేసుకోవాలని నిర్ణయించడంతోపాటు అంతర్జాతీయ మార్కెట్‌లోకొనుగోలు చేసింది. కేంద్ర విదేశాల నుండి కొనుగోలు చేసిన ఉల్లిపాయాల దిగుమతి ఈ నెలాఖరుకు పూర్తవుతుంది. విదేశాల నుండి కొనుగోలు చేసిన మొత్తం ఉల్లిపాయల నుండి ఇప్పటికి 12వేల టన్నులు ముంబయి ఓడరేవుకు చేరుకున్నాయి.



రాంవిలాస్ పాశ్వాన్ ఇప్పుడీ పన్నెండు వేల టన్నుల ఉల్లిపాయలను రాష్ట్ర ప్రభుత్వాలకు పంపించేందుకు కృషి చేస్తున్నారు. దేశంలో ఉల్లిపాయల ధరలు మరింత పెరగకుండా చూసేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు ముంబయికి వచ్చిన ఉల్లిపాయలను కొనుగోలు చేయాలని ఆయన విజ్ఞప్తి చేస్తున్నారు. మీరు ముందు ప్రతిపాదించినంత ఉల్లిపాయలను కొనుగోలు చేయాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాలను కోరుతున్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం ఉల్లిపాయలు కొనేందుకు ముందుకు రావడం లేదు. తమ తమ రాష్ట్రాల్లో ఉల్లిపాయల డిమాండ్ తగ్గిపోవడంతో కేంద్రం దిగుమతి చేసుకున్న ఉల్లిని కొనుగోలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు వెనుకాడుతున్నాయి. దీనితో విదేశాల నుండి ముంబయి వచ్చిన ఉల్లిపాయలను ఏంచేయాలనేది కేంద్ర ప్రభుత్వానికి అర్థం కావడం లేదు. రాష్ట్ర ప్రభుత్వాలు మొదట తమకు పెద్ద మొత్తంలో ఉల్లిపాయలు కావాలని డిమాండ్ చేసినా ఇప్పుడు తమ డిమాండ్ మేరకు ఉల్లిపాయలను కొనుగోలు చేసేందుకు ముందుకు రావడం లేదు. దీనితో ముంబయి వచ్చిన ఉల్లి కుళ్లిపోయే ప్రమాదం నెలకొంది. ఉల్లిపాయలు కుళ్లిపోకుండా చూసేందుకు రాంవిలాస్ పాశ్వాన్ ఉల్లిపాయల దుకాణం తెరిచి కొనుగోలు చేసేందుకు ముందుకు రావాలంటూ రాష్ట్ర ప్రభుత్వాలను బుజ్జగించడం ప్రారంభించారు.

Printed and Published by T. Venkateswarlu on behalf of Deccan Chronicle Holdings Ltd. Printed at Deccan Chronicle Press situated at Plot No. 9, Alwal Village, Vallabh Nagar Taluk, Medchal Malkajgiri Dist., Telangana and Published at 36, S.D. Road, Secunderabad-3, Chief Editor T.V.Ravi Reddy,
PBX 27803930 (6Lines), Editorial: 27805056, Regd.No.H/SDHO-4/2K RNI Regd.No.5595/60

# మాతృభూమి

పర స్త్రీలను తల్లులుగా
పర ధనమును మట్టివోలె భావించుటయే
పరమోన్నత సంస్కారము
నరకముగా పొందగల్గు సాయుజ్యమిదే

ఆంధ్రభూమి

బుధవారం, 8 జనవరి 2020

I


## బ్లాక్ సాల్ట్ మంచిదేనా?

ఇంట్లో వాడే మామూలు ఉప్పుకి తోడు.. తినే సోడా ఉప్పును కూడా వంటల్లో వాడుతుంటారు. కొన్నిసార్లు నిమ్మ ఉప్పును కూడా వాడతారు. కానీ బ్లాక్ సాల్ట్ అనేదాన్ని అందరూ వాడరు. ఎందుకంటే.. ఇది మామూలు ఉప్పులా అన్ని షాపుల్లోనూ దొరకదు. కానీ దీనికి ఉన్న రుచి, వాసన, ఆరోగ్య ప్రయోజనాల దృష్ట్యా దీనికి పాపులారిటీ పెరుగుతోంది. చాలామంది దీన్ని వాడేందుకు ఇప్పుడిప్పుడే అలవాటు పడుతున్నారు. ఇందులో చాలా రకాలు ఉన్నాయి. పూర్వం ఆయుర్వేద మందుల్లో దీన్ని వాడేవారు. ఇప్పుడు ఆయుర్వేదంతో పాటు.. ఇంట్లో కూడా వాడుతున్నారు.



పేరుకి ఇది బ్లాక్ సాల్ట్ అయినా నల్లగా కాకుండా గులాబీ, గోధుమ రంగుల్లో ఉంటుంది. సాధారణ ఉప్పు కంటే నల్ల ఉప్పు వాడటం మంచిదే అంటున్నారు డాక్టర్లు, ఆయుర్వేద నిపుణులు. ఎందుకంటే.. నల్ల ఉప్పులో తక్కువ సోడియం ఉంటుంది. హైబీపీ ఉన్నవారికి నల్ల ఉప్పు మేలు చేస్తుంది. అయితే బ్లాక్ సాల్ట్ ప్యాకెట్ కొనేటప్పుడు అందులో సోడియం ఎంత ఉందో చూసుకోవాలి. కొన్ని రకాల బ్లాక్ సాల్ట్‌లలో సోడియం ఎక్కువగా ఉంటుంది. కొన్ని రకాల టేబుల్ సాల్ట్‌లలో ప్రమాదకర పొటాషియం అయోడైట్, అల్యూమినియం సిలికేట్ వంటివి ఉంటాయి. సంప్రదాయ బ్లాక్‌సాల్ట్ ఎక్కువ ప్రాసెసింగ్ చేయకుండా ఇతర పదార్థాలను కలుపకుండా ఉంచుతారు. టేబుల్ సాల్ట్‌లో యాంటీ కేకింగ్ ఏజెంట్స్ కలుపుతారు. బ్లాక్‌సాల్ట్‌లో ఇవి ఉండవు. ఎక్కువ ఖనిజాలుంటాయి. కాబట్టి బ్లాక్‌సాల్ట్ మంచిది.

# పర్యావరణహితమే లక్ష్యం!



**పదహారేళ్ల వయసు అమ్మాయి అంటే ఎలా ఉంటుంది? గాలిలో తేలియాడుతూ.. ఊహలతో ఊసులాడుతూ.. ఏ బాధ్యతా లేకుండా.. హాయిగా.. ఆనందంగా గడిపేస్తుంటుంది. కానీ గ్రెటా మాత్రం చిన్న వయస్సులో ఓ బాధ్యతను నెత్తిమీదకు ఎత్తుకుంది.**

**ప**ర్యావరణ పరిరక్షణ కోసం తన చదువును కూడా త్యాగం చేసి ఉద్యమ బాట పట్టిన పదహారేళ్ల గ్రెటా థున్‌బర్గ్ గురించి అందరికీ తెలిసిందే.. స్వీడెన్‌కు చెందిన గ్రెటా 'స్కూల్ స్ట్రైక్ ఫర్ ది క్లైమేట్' పేరుతో ఉద్యమాన్ని మొదలుపెట్టి మేధావులు సైతం హర్షించే విధంగా దానికి సారథ్యం వహిస్తోంది. ఈ ప్రయాణంలో ఆమె ఎన్నో రకాల సమస్యలను ఎదుర్కొంటోంది. అయినా వాటిని లెక్కచేయకుండా సమస్యపై నిజాయితీగా పోరాడుతోంది. పదహారేళ్ల వయసు పిల్ల అంటే ఎలా ఉంటుంది? గాలిలో తేలియాడుతూ.. ఊహలతో ఊసులాడుతూ.. ఏ బాధ్యతా లేకుండా.. హాయిగా.. ఆనందంగా గడిపేస్తుంటుంది. కానీ గ్రెటా మాత్రం చిన్నవయస్సులో ఓ బాధ్యతను నెత్తిమీదకు ఎత్తుకుంది. మనిషి తన సౌకర్యవంతమైన, విలాసవంతమైన జీవనం కోసం ప్రకృతిని నాశనం చేస్తున్నాడు. ఈ భూమిపై బతికే మిగిలిన జీవుల్లా తానూ ఓ జీవిననే విషయాన్ని మర్చిపోయి ఆధునికత పేరుతో పర్యావరణానికి హాని కలిగిస్తున్నాడు. స్వచ్ఛమైన గాలి, నీరు, నేల.. వంటివి లేకుండా భవిష్యత్తు తరాలు ఎలా బతుకుతాయనే కనీస ఆలోచన కూడా లేకుండా ప్రకృతి వనరులను నాశనం చేస్తున్నాడు. వీటివల్ల జరిగే నష్టాల గురించి ప్రజలకు చెప్పి, వారికి అవగాహన కలిగించి పర్యావరణాన్ని రక్షించుకునేందుకు ఎంతో మంది నాయకులు, స్వచ్ఛంద సంస్థలు.. కొన్ని సంవత్సరాలుగా ప్రయత్నిస్తున్నాయి. అయితే ఈ సమస్యను ఎలాగైనా పరిష్కరించాలన్న తపన మాత్రం గ్రెటాలో రోజురోజుకూ పెరుగుతూ వచ్చింది. దాంతో ఆమె పర్యావరణహితం కోసం ఆ సమస్యను తలకెత్తుకుంది. దీనికోసం తన చదువును కూడా త్యాగం చేసింది. గత సంవత్సరం దీని గురించి ఐక్యరాజ్య సమితిలో కూడా తన స్పీచ్ ద్వారా అందరికీ వినిపించింది. ఇలా పర్యావరణ హితం కోరి తన చేస్తోన్న కృషికిగానూ 2019 నోబెల్ శాంతి పురస్కారానికి గ్రెటాను నామినేట్ చేసిన సంగతి కూడా అందరికీ తెలిసిందే.. ఈ క్రమంలో గ్రెటా గురించి తన తండ్రి ఇటీవలే ఒక ఆంగ్ల టీవీ ఛానల్‌తో సంభాషించాడు. ఆ ఇంటర్వ్యూలో భాగంగా ఆయన తన కూతురి భవిష్యత్తు గురించి ఆందోళన వ్యక్తం చేస్తున్నాడు.

2018, ఆగస్టులో గ్రెటా స్వీడిష్ పార్లమెంటు ఎదుట 'స్కూల్ స్ట్రైక్ ఫర్ ది క్లైమేట్' పేరుతో ఉద్యమానికి శ్రీకారం చుట్టింది. గ్లోబల్ వార్మింగ్, వాతావరణంలో వస్తోన్న మార్పులు.. మొదలైన సమస్యల గురించి ప్రపంచ దేశాల నాయకులు చర్చలు జరిపి వీలైనంత త్వరగా పరిష్కార మార్గాలను అమలు చేయాలని డిమాండ్ చేసింది. ఈ సమస్యను పరిష్కరించే వరకు తాను బడికి వెళ్లనని, సమస్య ఒక కొలిక్కి వచ్చే వరకు ఇలా స్ట్రైక్ చేస్తానని ఆమె వివరించింది. ఈ వార్త తెలిసిన వెంటనే ప్రపంచం నలుమూలల నుంచి ఎంతోమంది విద్యార్థులు గ్రెటాకు మద్దతు తెలిపారు. ఈ ఉద్యమంలో పాల్గొనేందుకు వారు కూడా స్కూలుకు వెళ్లడం మానేశారు. ఈ క్రమంలోనే మార్చి 15, 2019న 225 దేశాల్లో దాదాపు 2200 ప్రదేశాల్లో నిరసనలు జరిపారు. ఇందులో పది లక్షల మంది విద్యార్థులు, పెద్దలు పాల్గొన్నారు. అదేవిధంగా సెప్టెంబర్ 27న జరిగిన క్లైమేట్ స్ట్రైక్‌లో ప్రపంచవ్యాప్తంగా 40 లక్షల మంది పాల్గొన్నారు. ప్రపంచ చరిత్రలో ఇంతవరకు జరిగిన అతి పెద్ద క్లైమేట్ స్ట్రైక్ కూడా ఇదే.. ఈ ఉద్యమానికి ప్రపంచస్థాయి గుర్తింపు కూడా లభించింది. అలా పర్యావరణ హితం కోసం గ్రెటా చేస్తోన్న ఈ పోరాటానికి భారీస్థాయిలో ఆదరణ లభిస్తోంది. కానీ గ్రెటా తీరు గురించి ఆమె తండ్రి స్వేవ్ట్ థున్‌బర్గ్ స్పందిస్తూ 'గ్రెటా స్కూల్ స్ట్రైక్‌ను మొదలుపెట్టడానికి మూడు, నాలుగు సంవత్సరాల ముందు నుంచే వాతావరణంలో వస్తోన్న మార్పుల గురించి ఆలోచిస్తూ దిగులు పడేది. కొన్ని సంవత్సరాల తరువాత తను స్కూలుకు వెళ్లడం మానేసింది. ఎవ్వరితో సరిగా మాట్లాడేది కాదు. సమయానికి భోజనం చేసేది కాదు. కూతురిని అలాంటి పరిస్థితుల్లో చూడటం ఒక తండ్రిగా నాకు బాగుండేది కాదు. తనను ఆ స్థితి నుంచి బయటకు తీసుకురావడం కోసం ఎక్కువ సమయం తనతోనే గడిపేవాడ్ని. కొన్ని రోజుల తరువాత నా భార్య కూడా ఇలాగే చేసింది. తన పనులన్నీ పక్కన పడేసి తనతో ఎక్కువ సమయం గడిపేది. ఈ క్రమంలోనే గ్రెటా మాకు వాతావరణ మార్పుల గురించి ఎన్నో విషయాలు చెప్పేది గ్రెటా.. అలా మేమూ పర్యావరణం గురించి తెలుసుకోవడం మొదలుపెట్టాం. అయితే ఈ సమస్యను ఎలాగైనా పరిష్కరించాలన్న తపన మాత్రం గ్రెటాలో రోజురోజుకూ పెరుగుతూ వచ్చింది. దీంతో మేము కూడా తన కోసం పర్యావరణ హితంగా మారిపోయాము. దీనిలో భాగంగానే నా భార్య విమానాల్లో ప్రయాణం చేయడం మానేసింది. నేను శాకాహారిగా మారాను. ఇలాంటి పనులు ఆమెకు మరింత శక్తిని ఇచ్చాయి. ఏ మార్పు అయినా ఇంటి నుంచి మొదలయితే ఆ మార్పు ప్రపంచమంతా వచ్చినట్లే కదా.. కానీ నేను ఏమి చేసినా నా కూతురి కోసమే చేశాను. నాకు ఇద్దరు కూతుళ్లున్నారు. నిజాయితీగా చెప్పాలంటే అన్నింటికన్నా నాకు వాళ్లే ముఖ్యం. వాళ్లు సంతోషంగా ఉండాలనే నేను కోరుకుంటున్నాను. గ్రెటాను అందరూ ఓ గొప్ప ఉద్యమకారిణిగా, సామాజికవేత్తగా, పర్యావరణవేత్తగా చూస్తారు. కానీ నాకు మాత్రం ఆమె ఓ సాధారణమైన, తండ్రి చాటు ఆడపిల్ల. నా ప్రాణానికి ప్రాణమైన నా కూతురు. మిగిలిన వారిలా తను కూడా ఆడుతుంది, పాడుతుంది, నవ్వుతుంది.. సమాజ శ్రేయస్సు కోసం చదువును వదిలేసింది అంతే.. కానీ సమాజం కోసం ఉద్యమకారిణిగా మారడం బాగుంది కానీ.. కొంతమంది నుంచి తను ఎదుర్కొనే ద్వేషాన్ని చూసినప్పుడు మాత్రం ఆందోళన కలుగుతుంది. భయం వేస్తుంది. తన గురించి వచ్చే తప్పుడు వార్తలు, అబద్ధాలు, వ్యక్తిగత కక్షతో చేసే విమర్శలు.. నాలో భయాన్ని కలిగిస్తాయి. గ్రెటా తాను అనుకున్నది సాధించి భవిష్యత్తులో మళ్లీ చదువుకోవాలని నా కోరిక. దీనికోసం తనకు నానుంచి ఎలాంటి సహాయం కావాలన్నా.. చేయడానికి నేను సిద్ధంగా ఉన్నాను.' అంటూ చెప్పుకొచ్చాడు స్వేవ్ట్.





ఆయన కోరిక మేరకు ఈ సమస్య అతి త్వరలోనే పూర్తై గ్రెటా మళ్లీ స్కూలు మెట్లెక్కాలని ఆ తండ్రి తరఫున మనమూ కోరుకుందాం.

**- సన్నిధి**

# మార్పు అనివార్యం



**'మా**రగలిగే సామర్థ్యమే తెలివితేటలకు కొలబద్ద' అన్నారు భౌతిక, తత్వ శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్‌స్టీన్. 'మార్పుకు అనుగుణంగా ఎవరైతే మారగలిగారో వారే తెలివైనవారు' అన్నది నగ్న సత్యం. జీవితం చాలా గొప్పది. అది ఎంతో నేర్పిస్తుంది. ఎన్నో మార్పులు తెస్తుంది. అయితే ఆ మార్పునకు అనుగుణంగా మనలో మార్పులు అవసరం. పుట్టినప్పటినుంచి చివరిదాకా మనిషి నేర్చుకొంటూనే ఉంటాడు. తెలివైనవాడు ఎప్పుడూ నిత్య విద్యార్థిగానే ఉంటాడు. మార్పులు ద్వారా ఇంకా నేర్చుకొంటుంటాడు. జీవితం కూడా నేర్చుకోమని చెపుతుంది. మారమని చెపుతుంది. నిత్యం కొత్తదనంతో కొత్తకోణంలో ఉజ్వల భవిష్యత్తుకై ఆలోచించండి. అలా ఆలోచించేది కూడా పెద్దదిగా ఆలోచించండి. మార్పుకోసం చేసే పయనంలో కొన్ని లోటుపాట్లవల్ల ఒడిదుడుకులు ఎదుర్కోవచ్చు. వాటిని మన సంపత్తితో మరింత ఆలోచనతో సమస్యలను సులభంగా పరిష్కరించుకోవచ్చు.

మహనీయుల విజయగాథలు తెలుసుకొని మారాల్సిన అవసరం ఉందని గుర్తించారు మేధావులు. ఈ కోవలో ఐన్‌స్టీన్ ప్రతిపాదించిన నిస్తాం. కొండలు సముద్రాలు అలాగే వుంటాయి. కాని మనం మాత్రం మారుతుంటాం. పుట్టుక, పెరుగుదల, మరణం మార్పులో భాగమే. అలాగే కొన్ని వస్తువులు తుప్పుపడుతుంటాయి. మరికొన్ని శిథిలమవుతుంటాయి. మారనిది అంటూ ఏదీ లేదు. ఎంతసేపట్లో మారతాయనేదే ప్రశ్న. మార్పుకు పట్టే కాలాన్ని బట్టి కొన్ని అసలు మారనట్లే అన్పిస్తాయి. మార్పుతో ముడిపడి కాలం వున్నది. మనం దీనినే గతం, వర్తమానం, భవిష్యత్తు అని విభజించాం. భౌతిక విజ్ఞానం గతం- భవిష్యత్తునే పేర్కొంది. కాలాన్ని విడిగా చూచిన తీరును ఐన్‌స్టీన్ మార్చేసి, కాలం ప్రదేశం కలిపేడు. ఈ ప్రపంచలో




'ప్రత్యేక సాపేక్షతా సిద్ధాంతం' ఇదే! కాంతికంటే వేగంగా ఏదీ ప్రయాణించలేదని, అది ఎప్పుడూ స్థిరంగానే ఉంటుందని ఐన్‌స్టీన్ గుర్తించాడు.

న్యూటన్ కాలాన్ని ఒక నదీ ప్రవాహంగా భావించాడు. అది వింటిని వదలిన బాణంలాగా గతం నుండి వర్తమానం గుండా భవిష్యత్తు వైపుకు అవిచ్ఛిన్నంగా, ఏక రూపంగా ప్రయాణిస్తుందనీ, దాని గతి ఏ కారణంగానూ మారదని చెప్పాడు. కానీ ఐన్‌స్టీన్ కాలమనే నదీ ప్రవాహం ఏకరీతిగా సాగదని, గ్రహాలూ, నక్షత్రాలు, గెలాక్సీల వంటివాటిలో సమక్షంలో అది వంపు తిరుగుతుందని, వాటి చుట్టూ కాలం వేగంగా సాగడమో లేక నిదానంగా సాగడమో జరుగుతుందని తెలిపాడు. సముద్రంలో ఈదే చేప తన చుట్టుప్రక్కల వున్న నీటిని ఎలా వెనక్కి నెడుతుందో అలాగే ఒక నక్షత్రము లేదా తోకచుక్క లేదా గ్రహము తను ప్రయాణించే అంతరిక్షంలో దాని దిక్కాలలో మార్పును తీసుకువస్తుంది. దిశ, కాలాలు వేర్వేరు కావు. అవి ఒకటి లేకుండా ఒకటి మనలేవు అని ఐన్‌స్టీన్ నిరూపించారు.

మనం చూస్తున్నవాటిల్లో కొన్ని ఎన్నడూ మారనట్లు, నిత్యం తెల్లవారడం పొద్దుకుంగడం, సూర్యోదయం, సూర్యాస్తమయం గమ ఎన్నో వస్తువులు ఉండగా వాటిలో మార్పులు వివిధ రకాలుగా కనిపిస్తున్నవి. సైన్సులోని భిన్న శాఖలు ఆయా రంగాలలోని మార్పుల్ని అధ్యయనం చేసి చెబుతున్నాయి.

ఒకప్పుడు న్యూటన్ ప్రపంచంలో వున్న మనం ఇప్పుడు ఐన్‌స్టీన్ విశ్వంలో అడుగుపెట్టాం. మన భావాలెన్నో మార్చుకోవలసి వస్తుంది. ఖగోళ శాస్త్ర పరిశోధనలు మన సంప్రదాయ ఆలోచనల్ని పూర్తిగా మార్చివేస్తున్నాయి. మార్పు పరిణామంలో ఆధునిక భావాలు ఏర్పడ్డాయి. ఆ క్రమంలో మనమూ మారుతున్నాం.. మారాలి.. మార్పు కోసం మారాలి. వివేకంతో ఎవరైతే మారగలరో వారే అత్యుత్తమ ఫలితాలతో ఘనవిజయాన్ని సాధిస్తారు. మారకపోతే మాత్రం జీవితంలో వారి ఎదుగుదల వుండదు. ఈ సమాజంలో తెలివైనవారుగా గుర్తింపు పొందరు. లేదంటే, గొంగళిపురుగుగా మారుతారు ఎక్కడి గొంగళి అక్కడేలా.. అదే మార్పు వైపు అడుగులు వేస్తే గొంగళిపురుగు దశ నుంచి సీతాకోక చిలుక చందాన పరిణామం చెందుతారు. ఉజ్వల భవిష్యత్తును చవిచూస్తారు.

నాటినుంచి నేటివరకు తెలివైనవారు ఎందరో మారడానికి ప్రయత్నిస్తూనే ఉన్నారు. కాలచక్రంలో, మారుతున్న కాలంతో, ఎన్నో



ఎన్నెన్నో మార్పులు వచ్చాయి. మానవ జీవితాల్లో వెలుగులు నింపడం కోసం వందసార్లు విఫలమైనా పట్టువదలని విక్రమారుడిలా మార్పులు చేస్తూనే, చివరికి తన మేధోసంపత్తితో థామస్ అల్వా ఎడిసన్ బల్బును కనుగొన్నారు. విద్యుత్ కనుగొన్నందున జీవనశైలి మారింది. ఇలా ఒకటేమిటీ ఎన్నో మార్పులు వచ్చాయి... వస్తున్నాయి.. ఇంకా వస్తాయి. తెలివితేటలతో మార్పుకోసం పయనిస్తే మన జీవన విధానంలో ఇంకా అనేక మార్పులు కూడా చోటుచేసుకుంటాయి.

ప్రపంచంలో మార్పులు రావాలని, మార్పులు తీసుకురావాలని ఎన్నెన్నో చెబుతారు. కానీ తనదాకా వచ్చేసరికి దాన్ని ఆచరించరు. మార్చగల సామర్థ్యం ఒకరి తెలివితేటలను నిర్ణయిస్తుందనేది పచ్చి నిజం. మార్పు గొప్ప గుణం. మార్పును స్వీకరించగలిగితే ఏదైనా సాధించవచ్చు. మార్పు రావటం అనేదే తెలివితేటలకు నిదర్శనం. విజయం అనేది అంత సులభం కాదు. కష్టపడితేనే వస్తుంది. తన భవిష్యత్తును చక్కగా తీర్చిదిద్దుకోవాలంటే తన ఆలోచనలను, అలవాట్లను దృక్పథాన్ని మార్చుకోవాలి. పట్టుదల, కృషి వుంటే మార్పుతో అసాధ్యం కూడా సుసాధ్యం అవుతుంది.

నిన్నటిరోజు ఈ రోజు రాదు. అలా వుండదు. కాబట్టి మార్పు అవసరం. మార్పుకు అనుగుణంగా మారాలి. ఈ ప్రపంచంలో ఏదీ శాశ్వతం కాదు. ఒక్క మార్పు తప్ప. కాలక్రమంలో ఈ మార్పులను గుర్తించినవాడే చార్లీస్ డార్విన్. ఆధునిక జీవశాస్త్రంలో డార్వినిజం చాలా మార్పు తెచ్చింది ఆయన జీవ పరిణామ సిద్ధాంతమే భూమి మీది జీవుల పరిణామక్రమాన్ని తెలియజేస్తుంది. భూమిపై జీవజాలం ఏ విధంగా పరిణామక్రమం చెందాయి అనే విషయంపై పరిశోధనలు చేశాడు. జీవపరిణామ సిద్ధాంతాన్ని వర్ణించాడు.

బాబాసాహెబ్ అంబేద్కర్, సర్వేపల్లి రాధాకృష్ణన్, అబ్దుల్ కలామ్ లాంటివారు ఎందరో మార్పుకోసం పాటుపడినవారే. ఇలాంటి మేధావుల విజయగాథలను స్ఫూర్తిగా తీసుకొని మనం మారుతూ.. మారు కోసం కృషి చేస్తూ తెలివైనవాడిగా సమాజంలో గుర్తింపు పొందుతారు.

అభివృద్ధి సాధించాం అంటే.. మార్పు కోరుకోవటమే. ఇపుడు అన్ని రంగాలలోనూ అనేక మార్పులు వచ్చాయి. నాటి తాళపత్ర గ్రంథాల స్థాయి నుంచి పుస్తక ప్రతుల స్థాయికెదిగి తాజాగా అంతర్జాలం వరకు మార్పు చోటుచేసుకొంది.

నేటి సమాజంలో మార్పు రావాలంటే ముందు మనం మారాలి. మన ఆలోచనలు మారాలి. మన ఇంట్లో ఉండేవారు మారాలి. మన చుట్టూ ఉండేవారు మారాలి. ప్రతిఒక్కరిలో మార్పు రావాలి. అప్పుడే సమాజంలో మార్పు వస్తుంది.

మార్పు అనివార్యం. అదే తెలివైనవాడి లక్ష్యం. ఆ లక్ష్యం ఏర్పడాలి. ఆ లక్ష్యమే తెలివైనవారిగా తీర్చిదిద్దుతుంది. అందుకే అందరిలో మార్పును కోరుకుందాం. మారగలిగే సామర్థ్యమే తెలివితేటలకు కొలబద్దగా నిలుద్దాం!

**- కంచర్ల సుబ్బానాయుడు**

# రంగవల్లి



19 చుక్కలు
1 వచ్చే వరకు
సరి చుక్కలు



బద్దుల విజయలక్ష్మి
వనస్థలిపురం, హైదరాబాద్

## ముగ్గులకు ఆహ్వానం

నింగిలోని హరివిల్లులను నేలపైన పేర్చి.. కనులకింపైన రంగుల్ని అందంగా అద్దితే అది రంగుల మాలికవుతుంది. ముంగిట్లో రంగవల్లిక అవుతుంది. ధనుర్మాసం సందర్భంగా తెలుగు ముంగిళ్లలో రంగవల్లులను తీర్చిదిద్దడం ఆనవాయితీ.. ఆ సందర్భంగా ముగ్గులకు ఆహ్వానం పలుకుతోంది మాతృభూమి. ఆసక్తి కలవారు కింది చిరునామాకు ముగ్గులను పంపగలరు.

సూచనలు

★ ముగ్గులను పంపేవారు ఎ4 సైజు తెల్ల కాగితంపై వేయాలి.
★ ముందుగా నల్లని ఇంక్‌తో ఔట్‌లైన్ గీసిన తరువాత అందులో రంగుల్ని నింపాలి.
★ ఎన్ని చుక్కలను పెట్టి ముగ్గులు వేశారో.. అంటే సరి చుక్కలా, బేసి చుక్కలా, సందు చుక్కలా.. అనే విషయం స్పష్టంగా రాయాలి.
★ ముగ్గుతో పాటు, మీ పాస్‌పోర్ట్ సైజు కలర్ ఫొటోను, చిరునామాని జతచేయాలి.
★ డౌన్‌లోడ్ చేసిన ముగ్గులు కాక, స్వయంగా చేతితో వేసిన ముగ్గులనే పంపాలి. అదీ చుక్కల ముగ్గులకు మాత్రమే ఆహ్వానం.

ముగ్గులు పంపాల్సిన చిరునామా:
ఎడిటర్,
ఆంధ్రభూమి దినపత్రిక, 36, సరోజినీదేవి రోడ్,
సికింద్రాబాద్ - 500 003

## సూర్య శతకం - కొడుకుల సూర్యసుబ్రహ్మణ్యం 9492457262

తే.గీ..
మనములకు రోగమంటక మనగవలయు
నంటినను తొలగించుకోమంటిరేల?
స్వస్థతను ( గల్గియుండంగ( బరమ సుఖము
చూడుమో కర్మసాక్షి! యో సూర్యదేవ!

**భావం:** మనసులకు రోగమంటని విధంగా బతకాలి. ఒకవేళ అంటినా వాటిని నయం చేసుకోమని ఎంతో మంది తెగేసి చెప్పేస్తున్నారు. మనసులకు వ్యాధులంటని బ్రతుకు నిజంగా సుఖమయమౌతుందని కర్మసాక్షివైన ఓ సూర్యదేవ! ఈ లోకానికి తెలియుజేయుమయ్యా.

తే.గీ.
ఏల? యూహలపోహలేల? వాటి
వలన( గల్గున దేమున్నదిల( గనంగ
మనసు కలుషితమవరాదు మరువరాదు
చూడుమో కర్మసాక్షి!యో సూర్యదేవ!

**భావం:** అనవసరమైన ఊహలు, అపోహలు దేనికోసం? వాటి వల్ల ఎలాంటి ప్రయోజనం లేదు. కలుషితం కాని స్వచ్ఛమైన మనసులను కల్గియుండి మనుగడ కొనసాగించడం మరవద్దని కర్మసాక్షివైన ఓ సూర్యదేవా నీవైనా ఈలోకానికి ప్రబోధించుము స్వామీ.

# జగదేక సుందరి క్లియోపాత్రా

32 -ధనికొండ హనుమంతరావు

పొగలు కక్కుతూ, రోమన్ ఓడ వచ్చి ఈజిప్షియన్ ఓడల మధ్య పడింది. ఇదేదో ప్రమాదవశాత్తు జరిగి ఉండొచ్చని ఈజిప్షియన్‌లు అనుకున్నారు. రోమన్ ఓడ తగలబడిపోతూంటే వారందరూ మొదట్లో సంతోషపడ్డారు. కాని, ఆ నిప్పు తమ ఓడలను దగ్ధపరచబోతుంటే మేలుకొన్నారు.

దాన్ని ఆర్పేలోగానే మరికొన్ని రోమన్ ఓడలు భగభగా మండుతూ ఈజిప్షియన్ ఓడలను ఢీకొన్నవి. ఈ విధంగా చేయటంవల్ల, రోమన్ సైన్యాలు పిరికిపడి, పారిపోదామన్నా వీలులేని పరిస్థితి ఏర్పడింది. ఎందుకంటే, వారి ప్రయాణాలకు తగినన్ని ఓడలు లేవు.

సముద్రం మీద హలాహలం లేచింది. ఆ మంటల్ని ఆర్పేందుకు సముద్రంలోని నీరు చాలుతుందా అనే సందేహం కలిగింది. ఓడరేవుల్లో నుంచి జ్వాలలు, అలెగ్జాండ్రియా పట్టణ సరిహద్దుల్ని తాకినవి. పట్టణం నలుమూలలా అగ్ని చుట్టుముట్టింది. ఈజిప్షియన్ సైన్యాలు యుద్ధం మాట మరిచిపోయి, ముందు తమ ఆస్తిపాస్తుల్ని కాపాడుకునేందుకు ముందుకురికినవి.

దాదాపు సగం అలెగ్జాండ్రియా తగలపడిపోయింది. ప్రపంచ వింతల్లో ఒకటిగా పరిగణించబడే పుస్తక భాండాగారం కూడా తగలబడిపోయింది. మానవుడు అనేక శతాబ్దాలుగా తన మేధస్సును ఇక్కడ పుస్తకాల రూపాన గుప్తరిచాడు. అందులో చాలా కొద్ది భాగమే రక్షించబడింది. అంతవరకున్న లోక చరిత్ర దాదాపు దగ్ధమైంది.

ఈ వార్త విని విచారించనివారు లేరు. చివరకు సీజర్ కూడా ఎంతో దుఃఖపడ్డాడు. జనక్షయాన్ని మానవుడు పూరించగలడేమో కాని, పోగొట్టుకున్న విజ్ఞానాన్ని తిరిగి సంపాదించటం ఎంత కష్టసాధ్యమో ఆయన గ్రహించకపోలేదు. ఆయన మనస్సు వికలమైంది. ఐతే తాను ప్రశాంతంగా బతుకుదామన్నా బతకనీయని యీ ప్రాపంచిక విధానానికి ఎదురీదలేడు కదా!

ఈ హడావిడిలో సీజర్, అలెగ్జాండ్రియా రేవులోని ఒక భాగంతోపాటు కొంత భూభాగాన్ని కూడా ఆక్రమించుకున్నాడు. ఎలాగైనా యుద్ధం వాయిదా పడితే బాగుండునని ఆయన అనుకుంటున్నాడు. కాని, ఈజిప్షియన్ బలగాలు అధికంగా ఉండటంవల్ల, జయం తమదేననే ధైర్యంతో టాలమీ ప్రభుత్వం పోరాటానికే దారితీస్తోంది.

క్లియోపాత్రా ఎర్ర సముద్ర తీరంలో వున్న తన చిన్న సైన్యాన్ని రమ్మని కబురుచేసింది. మర్నాటికల్లా ఆ సహాయం రానే వచ్చింది. ఐతే అదొక సహాయం కిందనే లెక్క కాదు.

కబుర్లమీద కబుర్లు పోగా మరి రెండు రోజుల్లో సిరియా నుంచి కూడా కొంత సైనిక సహాయం వచ్చింది. ఇంత చేసినా, రోజూ సైనిక క్షయం తప్ప, జయం తమదయే సూచనలు రోమన్‌లకు లేవు. రోజులు గడిపేందుకు మాత్రమే యీ సైన్యం ఉపయోగపడుతోంది.

సీజర్ తన ఆశలన్నిటినీ రోమ్ వైపు తిప్పుకున్నాడు. అంతిమ విజయాన్ని పొందాక సీజర్ రోమ్ వెళ్లనే లేదు. అక్కడ ప్రభుత్వం తన పేరుమీదుగానే కొనసాగుతూన్నదనే వార్తలు తప్ప, అసలేం జరుగుతుందో తెలియటంలేదు. పోతే పాంపేకు సంబంధించినవారు ఆయన కొడుకులు, ఇతర వారసులూ చెల్లాచెదరైన సైన్యాలను సమీకరించు



కొని, ఇక్కడ ఈజిప్టులో చిక్కుపడిపోయిన సీజర్ మీద వొత్తిడి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారనే వార్తలు కూడా వస్తూన్నవి. ఎటూ తోచక, విధి విలాసం ఎటు వున్నదో ఎదురుచూసే స్థితిలో పడ్డాడు సీజర్!

సీజర్, క్లియోపాత్రాల ప్రణయం అధిక భాగం యుద్ధరంగంలోనే రూపొందింది. ఒకవైపు ఘోర యుద్ధం జరుగుతున్నప్పటికీ, మరోవైపు వారి ఘోర ప్రణయం కొనసాగింది. ఏ క్షణాన శత్రువులొచ్చి ముట్టడిస్తారోననే భయంతోనే వారు ఒకర్నొకరు విడవకుండా, ఒకరికి మరొకరు కనురెప్పవలె ఉండిపొయ్యేవారు. రాత్రులు కూడా ప్రశాంతత లేదు. దూరాన ఎక్కడో చావు కేకలు! హెచ్చరికలు!

అవన్నీ వింటూనే, తాము సృష్టించుకున్న యీ భూలోక స్వర్గం క్షణమే ఉండబోతోందనే భయంలోనే వారు ప్రణయారాధన చేశారు.

యుద్ధరంగంలో సీజర్ చండ ప్రచండుడయ్యాడు. పూర్వంవలె ముసలివాడుగా ఆయన కనిపించటంలేదు. ప్రణయామృతాన్ని ఆరగించి, తద్వారా విశేష శక్తిని పొంది, అధికోద్రేకంతో ముందుకు ఉరుకుతున్నాడు. సీజర్‌ను గూర్చి, అతని యుద్ధ కౌశలాన్ని గూర్చి విన్న కథల్లో అతిశయోక్తులేమీ లేవని, ఆయన్ను గమనించిన వారందరూ అనుకుంటున్నారు. ముఖ్యంగా క్లియోపాత్రా దృష్టిలో, ఆయన పురుషోత్తముడయ్యాడు, ప్రియునిగా లాలించే తను ఇప్పుడు వీరుడుగా కూడా ఆయన్ను ఆరాధిస్తోంది. నిజంగానే తన జన్మ సార్థకతను పొందిందని ఆమె నమ్మింది.

క్లియోపాత్రా చాలా తెలివిగలదనేందుకు సందేహం లేదు. అతి త్వరలోనే ఆమె యుద్ధరంగంలో కూడా అనుభవాన్ని సంపాయించింది.

సీజర్‌తోపాటే గుర్రపు స్వారీ చేయగలదు. సైనికులను ఆజ్ఞాపించగలదు. భూమి అదరటాన్ని బట్టి శత్రు సైన్యంలోని అశ్వికదళం ఎంత వస్తున్నదీ చెప్పగల సామర్థ్యం ఆమెకున్నది. రేవులోకి వచ్చిన ఓడల్ని చూడకుండానే అవి ఏ దేశానికి చెందినవో, ఆ తారు వాసనను బట్టి గుర్తించగలదామె! తగిన అశ్వం దొరక్క బాధపడుతూన్న సమయంలో చప్పున ఒక ఉత్తమాశ్వాన్ని ఏరి, సీజర్‌కు అప్పగించల ప్రజ్ఞ ఉన్నదామెకు.

ఈ విధంగా కొద్దివారాల్లోనే ఆమె సైన్యాలను చాకచక్యంతో నడపగల సమర్థురాలైంది. ఇప్పుడామె సీజర్‌కు కేవలం ప్రియురాలు మాత్రమే కాదు, సైన్యాధిపతి, సలహాదారు, మంచి చెడ్డల్ని తర్కించగల వ్యక్తి. ఒకటేమిటి, ఆయన ప్రాణానికి ప్రాణమైంది. కదనరంగంలోనే సీజర్, క్లియోపాత్రాలు ఒకరినొకరు పరిపూర్ణంగా అర్థం చేసుకున్నారు.

అదృష్టవశాత్తు రోమ్ తననింకా గౌరవిస్తూనే వుంది. తాను దూరదేశాల్లో ఇరుకున పడినందుకు, ఇదే సమయమని తన శత్రువులు పాలకులు కాలేదు. పరిపాలనంతా తన పేరుమీదుగానే సాగుతోంది; నాణాలమీద కూడా తన ప్రతిమ ముద్రించబడింది. ఈ అధికారంతోనే ఆయన రోమన్ సైన్యాలను వెనువెంటనే పంపమని ఆజ్ఞాపించాడు. చివరకు రోమన్ ఓడలనిండా సైనికులు బిలబిలలాడుతూ ఈజిప్టు గడ్డపైకి దిగారు.

ఈ యుద్ధంలోని విజయం నిస్సందేహంగా తనదేననే ధైర్యం సీజర్‌కు కలిగింది. ఎక్కువ జనక్షయం లేకుండానే చూశాడాయన. రోమన్ సైనికుల్ని చూసి ఈజిప్షియన్‌లు పిరికిపడ్డారు. అలెగ్జాండ్రియా సింహద్వారాలు తెరుచుకొని, రోమన్‌లకు స్వాగత గీతాలు పాడినవి.

ఈ హడావిడిలో టాలమీ పట్టుపడ్డాడు. అతని అక్క- అంటే క్లియోపాత్రా తరువాతది, తన ప్రియునితో సహా పారిపోతూండగా, రోమన్ సైన్యాధిపతులు చంపివేశారు. కోటంతా రోమన్‌ల వశమైంది. ఈజిప్షియన్ ప్రభుత్వంపోయి, రోమన్ ప్రభుత్వం ఆరంభమైంది.

పూర్వం ఈజిప్టును స్వాతంత్ర్య దేశంగానే రోమ్ గుర్తించింది. కాకుంటే ఈజిప్టు రోమ్‌కు ఋణపడి ఉండబట్టి, ఆ వసూళ్ళకు మాత్రమే వొత్తిడి చేస్తుండేది. పోతే ఈజిప్షియన్ రాజవంశీకుల రక్షణార్థం కొద్ది రోమన్ సైన్యాలు ఈజిప్టులో స్థావరాలు ఏర్పరచుకున్నవి. రోమన్ అధికారాలను తిరస్కరించి యుద్ధంలో ఓడిపోవటంవల్ల ఇపుడు ఈజిప్టు రోమన్ సామ్రాజ్యంలో కలపబడుతుందని ప్రజలు భయపడ్డారు. ఐతే బలమున్నవాడిదే బతుకుగా వున్న రోజుల్లో గరళంవలె తయారైన రోమన్ అధికారాలను భరించక తప్పదనీ, ఎదురు తిరగటమంటే తమ గొంతులకు ఉరితాళ్ళను బిగించుకోవటమేనని ప్రజలు తెలుసుకోగలిగారు.

యుద్ధమేఘాలు విచ్చిపోయి, శాంతిమేఘాలు ఆవరించినవి. ప్రభుత్వంలోని పెద్దలందర్నీ పిలిపించి ప్రజా సమక్షంలో సీజర్ రోమన్ అధికార పత్రాన్ని చదివి వినిపించాడు.

- ఇంకాఉంది



# రాశిఫలం

- గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

● **మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా.)**
విదేశయాన ప్రయత్నాలకు అనుకూలంగా వుంటుంది. ప్రయాణాలెక్కువ చేస్తారు. మెలకువగా నుండుట అవసరం. స్థానచలనమేర్పడే అవకాశాలుంటాయి. ఋణలాభం పొందుతారు. ఎలర్జీతో బాధపడేవారు జాగ్రత్తగా నుండాలి. ప్రయత్న కార్యాలకు ఆటంకాలుంటాయి.

● **వృషభం (కృత్తిక 2, 3, 4పా., రోహిణి, మృగశిర 1, 2పా.)**
ప్రయత్న కార్యాలకు ఆటంకాలెదురవుతాయి. బంధు మిత్రులతో జాగ్రత్తగా మెలగుట మంచిది. ఆకస్మిక కలహాలకు అవకాశముంటుంది. ధననష్టాన్ని అధిగమించుకు ఋణప్రయత్నం చేస్తారు. కుటుంబ విషయాల్లో మార్పులు వుంటాయి.

● **మిథునం (మృగశిర 3, 4 పా., ఆరుద్ర, పునర్వసు 1, 2, 3పా.)**
గౌరవ మర్యాదలకు లోపముండదు. అనవసర వ్యయ ప్రయాసలుంటాయి. వృథా ప్రయాణాలెక్కువ చేస్తారు. మానసికాందోళనతో కాలం గడుపవలసి వస్తుంది. బంధు, మిత్రులతో వైరమేర్పడకుండా జాగ్రత్త వహించాలి. శారీరకంగా బలహీనులవుతారు. విందులు, వినోదాల్లో పాల్గొంటారు.

● **కర్కాటకం (పునర్వసు 4 పా., పుష్యమి, ఆశ్లేష)**
కోపాన్ని అదుపులో నుంచుకొనుట మంచిది. మానసికాందోళనను తొలగించుటకు దైవధ్యానం అవసరం. శారీరక అనారోగ్యంతో బాధపడతారు. కుటుంబ విషయాలు సంతృప్తికరంగా నుండవు. వృథా ప్రయాణాలెక్కువవుతాయి. ధనవ్యయం తప్పదు.

● **సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)**
కొన్ని ముఖ్యమైన పనులు వాయిదా వేసుకుంటారు. మానసిక చంచలంతో ఇబ్బంది పడతారు. సోమరితనం ఆవహిస్తుంది. పిల్లలపట్ల మిక్కిలి జాగ్రత్త వహిస్తారు. కొన్ని మంచి అవకాశాలను కోల్పోతారు. ఆర్థిక పరిస్థితిలో మార్పులుండవు.

● **కన్య (ఉత్తర 2, 3, 4పా., హస్త, చిత్త 1, 2 పా.)**
అనుకూల స్థానచలనం కలిగే అవకాశాలున్నాయి. గృహంలో మార్పును కోరుకుంటారు. ఇతరుల విమర్శలకు లోనవుతారు. స్థిరమైన నిర్ణయాలు తీసుకోలేరు. ఆకస్మిక ధనవ్యయం అయ్యే అవకాశం. బంధు, మిత్రులతో జాగ్రత్తగా నుండుట మంచిది. ఋణప్రయత్నాలు చేస్తారు.

● **తుల (చిత్త 3, 4పా., స్వాతి, విశాఖ 1, 2, 3పా.)**
కుటుంబ విషయాలపై అనాసక్తితో వుంటారు. గృహంలో మార్పులు జరిగే అవకాశాలున్నాయి. తలచిన కార్యాలు నెరవేరతాయి. స్త్రీలతో జాగ్రత్తగా నుండుట మంచిది.

● **వృశ్చికం (విశాఖ 4 పా., అనూరాధ, జ్యేష్ఠ)**
వ్యాపారంలో విశేష లాభాన్ని ఆర్జిస్తారు. మంచివారితో స్నేహం చేస్తారు. అంతటా సుఖమే లభిస్తుంది. ఆకస్మిక ధనలాభముంటుంది. బంధు, మిత్రుల సహాయ సహకారాలు లభిస్తాయి. ఒక ముఖ్యమైన సమాచారాన్ని సేకరిస్తారు. నూతన వస్తు, ఆభరణాలను కొనుగోలు చేస్తారు.

● **ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా.)**
ప్రయత్నం మేరకు స్వల్పలాభముంటుంది. వృథా ప్రయాణాలెక్కువ చేస్తారు. వ్యాపార రంగంలో లాభాలుంటాయి. ఋణప్రయత్నాలు చేయవలసి వస్తుంది. నూతన కార్యాలకు శ్రీకారం చుడతారు. బంధు, మిత్రుల సహకారం ఆలస్యంగా లభిస్తుంది.

● **మకరం (ఉత్తరాషాఢ 2, 3,4పా., శ్రవణం, ధనిష్ఠ 1, 2పా.)**
సంపూర్ణ ఆరోగ్యంగా వుంటారు. కుటుంబంలో సుఖ సంతోషాలు అనుభవిస్తారు. నూతన వస్తు, ఆభరణాలను పొందుతారు. ప్రయత్న కార్యాలన్నింటిలో విజయం సాధిస్తారు. శుభవార్తలు వింటారు. ధైర్యసాహసాలు ప్రదర్శిస్తారు. ఆకస్మిక ధనలాభయోగముంటుంది.

● **కుంభం (ధనిష్ఠ 3, 4పా., శతభిషం, పూర్వాభాద్ర 1,2, 3పా.)**
ప్రయత్న కార్యాలందు దిగ్విజయాన్ని పొందుతారు. ఆకస్మిక ధనలాభముంటుంది. కుటుంబం అంతా సంతోషంగా కాలక్షేపం చేస్తారు. ఒక ముఖ్యమైన పని పూర్తికావడంతో మిక్కిలి ఆనందిస్తారు. కీర్తి ప్రతిష్ఠలు పొందుతారు. శాశ్వత పనులకు శ్రీకారం చుడతారు.

● **మీనం (పూర్వాభాద్ర 4 పా., ఉత్తరాభాద్ర, రేవతి)**
ఆర్థిక ఇబ్బందులుండవు. నూతన వస్తు, ఆభరణాలను ఖరీదు చేస్తారు. స్నేహితులను కలుస్తారు. ఇతరులకు మంచి సలహాలు సూచనలిస్తారు. సంఘంలో గౌరవం పెరుగుతుంది. ధైర్యసాహసాలతో కొన్ని పనులు పూర్తిచేస్తారు. శుభవార్తలు వింటారు.

## మాటాట నిర్వహణ: సుధామ 2139



**అడ్డం — ఆధారాలు — నిలువు**

అడ్డం:
1. ఈజిప్టు రాజధాని
3. ముఖ్యం
5. రేలంగి జతగా ఈ హాస్యనటి
8. దారం
9. అనంతరం, తరువాత
11. ఎప్పుడూ చేసేపని
13. పామువిడిచేది
14. తెలుపుము, పాదరక్ష

నిలువు:
2. జబ్బు పడ్డవాడు
3. జనం
4. బాలవ్యాకరణం రాసిన చిన్నయసూరి రచించినదే ఇదీను
6. నక్షత్రం
7. బంగారం
10. మత్స్యము
11. ఒక విషయం పై విస్తార రచన
12. చేను మేయకూడనిది

**అడ్డం — మాటాట-2138 సమాధానాలు — నిలువు**

అడ్డం: 1. పురస్కారం, 5. జుల్మాన, 7. లులి, 8. ఎద, 10. అమ్మ, 11. అరి, 14. కట్టడి, 15. వరుణుడు

నిలువు: 1. బుజువు, 3. రశ్మి, 4. రంగద, 6. నాలుక, 9. గరిక, 10. అతివ, 12. అడితి, 13. వేణు

# నా చిన్ననాటి భోగి



జంగమ దేవర శంఖపు రవళులు
శంభో శంకర నా దంతో ఊరంతా
అంబ బలుకు జగదంబ బలుకు
వాక్కుతో బుడబుక్కల ఢమ ఢమలు
భోగి వేకువ జాముకు వేకువ కాగ!

చెరువుకు నీళ్లకి నాన్న కావిడితో
మావూరి చెరువేమో తెలిమంచు కప్పుకొని
సూరీడికేదో కబురివ్వాలని రాయబారి
తుషారపు దొంతర్లతో మంతనాలు
ఎంతకీ ఒగదెగవవి ప్రభాత మంతా

తోటి పిల్లలతో దార్లన్నీ తిరిగి ప్రోగేసుకున్న
వరి కర్రలో తుమ్మ పత్తి వేప పుల్లలో
అమ్మవంటకి దాచిన వంట చెరుకో
అన్నిటితో బోగిమంటకు తయ్యారు

అత్తయ్య మామయ్య తాతయ్య నానమ్మలు
ఒళ్లంతా రగ్గులతో చలికి వణుకుతూ
నాన్న తోబుట్టులు నీళ్ల బిందెలతో హాజరు
అమ్మ తోడుకోడళ్లతో వంటలింకా తెమలక

రంగవల్లులు అల్లాలని తొందరలో అక్కావదిన
గొబ్బెమ్మలు బంతిపూల ఏర్పాట్లలో చెల్లి మరదలు
పిన్ని బాబాయి అగ్ని దేవుని ప్రార్థన జేసి నెయ్యేసి
భోగి మంట రాజేస్తే బందు గణమంతా చుట్టూ

మేమంతా భోగిమంట చలి కాచుకుంటుంటే
కొత్త ధాన్యపు బస్తాల బండ్లతో ఇళ్లకు కొందరు
దారంతా రంగుల ముగ్గులు పెడుతూ ఇల్లాలు
అయ్యావారికి దండం బెట్టంటు గంగిరెద్దులోళ్లూ

కాటి కాపరి వస్తే మాత్రం ఏ పురిచాటునో
చటుక్కున ఎక్కడ నుంచి ఏం తీస్తానంటాడొనని
ఊరంతా సందడే! అన్ని మూలలా రంగవల్లులు
హరిదాసులు శ్రీమద్రమణ గోవిందో హరంటూ
బావలు పిట్టల దొరలా కథలు చెబుతుంటే
సినిమా కథలకి పనికొస్తాయని నవ్వుతూ మేము

బోగి మంటన హవిస్సులు ఎంత సమర్పించాలో
ఎప్పుడు మంట నిప్పులు కదపాలో అణచాలో
చుట్టూ చేరి జాగ్రత్తలు జెప్పు పెద్దల జుస్తి
జీవన గమనంలో సుఖదుఃఖాల్లో ఎల్లప్పుడూ
మీ వెంట మేమని అగ్ని సాక్షిగా భరోసా నిచ్చు
నా వారిగ తృప్తిగా రేపటి సంక్రాంతికై జూస్తూ....

- రవి కిషోర్ సెంట్రాల (లండన్)

# కొత్త వసంతం



పాతని వదిలేసి
కొత్తలోకి అడుగు పెట్టబోతున్న
సంవత్సరానికి
స్వాగతం సుస్వాగతం

మనుషుల మధ్య
ద్వేషాలను తుంచి
మమతల ను పెంచి

మనమంతా ఒక్కటే
వసుదైక కుటుంబం అనీ

చేయి కలిపేందుకు వచ్చిన
స్నేహశీలీ స్వాగతం సుస్వాగతం
సాహితీ సౌరభంలో
రెపరెపలాడే అక్షరమై
ఎగరాలని కోరుతూ
పండుగ శుభాకాంక్షలు

పుష్యమీ సాగర్
9010350317

# కోమలుల మేలుకొలుపు

ముప్పది మూడుకోట్ల దేవతలకు ఎపుడైనా ఆపదలుకలిగినట్లయితే ఆ ఆపదలు వారికి కలుగకముందే వారి దగ్గరికి నీవు వెళ్లి వారికి అండగా, తోడునీడగా ఉండే ఓ స్వామీ నేడేమి ఇలా నిద్రనుంచి మేల్కొనడం లేదు. దయచేసి ఓ ఆర్జవము కలవాడా! పరాక్రమము కలవాడా! శత్రువులకు భయజ్వరమును గలిగింపజాలిన నిర్మల మనస్కుడా నిద్రను వీడుము.

స్వర్ణకలశములను బోలిన మృదువైన స్తనములు, ఎర్రని దొండపండువంటి పెదవులు, సన్నని నడుము కలిగిన ఓ నీలాదేవి శ్రీరూపిణివి నీవు అమ్మా ఇక మీరిద్దరూ కూడా నిద్రనుంచి లెమ్ము.

మీ కొరకై ప్రజలంతా నిరీక్షిస్తూన్నారు. మీ దర్శనార్థమై మేము వేచి ఉన్నాం తండ్రీ మీరు త్వరగా మేలుకొనుడు. విసనకర్రను, అద్దాన్ని ఇచ్చి నీ ప్రియునితో మేము స్నానము చేయునట్లు చేయుమని ప్రార్థిస్తున్న పాశుర విశేషమేమంటే -ఆర్జవమే అవిద్య, బలము జగద్భరణమే, స్తనములు అనగా పరభక్తి, పరమ భక్తి, అధరము పరమాత్మ యందు రక్తి, నడుము విరక్తి, విసన కర్ర అనునది నమః అను పదం ఇక అద్దమనగా ఓం అనే ప్రణవం. స్నానం చేయడానికి పోవాలి అంటే పరమాత్మకు సర్వవిధ కైంకర్యం చేయడానికి మేమంతా ఉద్యుక్తులై ఉన్నామని తెలుపడమే.

మనం కూడా నిన్ననే ముక్కోటి ఏకాదశి పర్వాన్ని పురస్కరించుకుని ఆ నారాయణుని దర్శనంతోపాటు అక్కడే ఉన్న ముప్పది మూడుకోట్లమందిని మనం దర్శించుకున్నాం. ఎంతమంది దేవీ దేవతలను చూసినా కృష్ణభక్తులకెపుడు వారి మనసు కృష్ణయ్య చేసిన లీలలందే పరిభ్రమిస్తూ ఉంటుంది.

పుట్టిన నాటి నుంచి కృష్ణుడుగా యశోదనందనుడిగా పెరుగుతూ పెరుగుతూ అటుగోపకన్యల మనసును దోచిన విధమును, ఇటు మహామాయల మారులైన రాక్షసులను చిన్ని ఉపాయాలతోటే పరిమార్చిన విధానాన్ని కథలు కథలుగా చెప్పుకుంటూ వారు ఆనందిస్తున్నారు.

- ఆర్ లక్ష్మణమూర్తి , 7207074899

# మార్గళి గీతాలు

## తిరుప్పావై మూలానికి తెలుగు

- ఆసూరి మరింగంటి శేషగిరాచార్య
8886976760



1. ముప్పదిమూడుకోట్ల సుర
మూర్తుల వామనుండవై
గాచిన కృష్ణ! లెమ్మనిరి
కన్నెలంత యేకమ్ముగ

2. స్వర్ణకలశ సదృశమగు
చన్నుదోయి చారువదన;
సన్నని సుకుమార కటితొ,
చెన్నొందెడి నప్పిన్నమ?

3. వింజామరలతో నూచి
కంజాక్షుని మేల్కొల్పుము,
ముద్దుల ముకురమ్మునందు
ముగ్ధత తన మోము జూచు

4. సంపూర్ణత కలిగినట్టి
జవరాలా! జలజనయన!
కృష్ణయ్యను మా వెంబడి
కృపతో జలకేళికంపు

5. గోపికలును వెంటరాగ
గోదను నేనిటకొచ్చితి
మనస్వామితో గూడి నదిన
మంగళకర స్నానమాడ

6. ఆటంకము కల్గించకు
అతివా! నీవే తీరున,
అనుచు గోద చురకలేసె
అచటేగల నీళమ్మకు

ఇంకా ఉంది

# మనసే మూల కారణం

జీవరాశులన్నింటిలో మానవుడు అధికుడిగా పరిగణింపబడడానికి కారణం కేవలం అతని మానసిక వికాసమే! బుద్ధిజీవి కాబట్టి తాను మనసులో ఇష్టపడినవన్నీ అతను సాధించుకోగలుగుతున్నాడు. తన చంచలమైన మనస్సును కూడా స్వాధీనం చేసుకోగలిగి, అపార భూతదయ కూడా కలిగి ఉంటే 'మనీషి' కూడా అవుతాడు.

'మానసము' అనే పదానికి 'మనస్సు', 'సరస్సు'అనే రెండు అర్థాలున్నాయి. రెండింటికీ పోలికలున్నాయి. రెండూ చంచలమైనవే! సరస్సులో బురద, పాచి, క్రిమికీటకాలున్నట్లే, మనస్సులో కూడా చెడు భావనలు, దురాలోచనలు, రాక్షస భావాలు, అనే కాలుష్యాలుంటాయి. సరస్సులో నీళ్ళు ఎక్కువైతే హద్దు దాటి పైకి వస్తుంది. అలాగే సుఖ సంతోషాలు, దుఃఖ విషాదాలతో మనస్సు పరవళ్ళు తొక్కుతుంది. గ్రీష్మంలో సరస్సు ఎండిపోయినట్లే, దుఃఖ పరితాపంతో మనస్సు కూడా శోకాకులతకు లోనై శూన్యమవుతుంది. సరస్సును ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ ఉంటే ఆహ్లాదకరంగా, అందంగా కళకళలాడినట్లే, మనస్సు కూడా సద్భావనలతో శుద్ధిచేసుకొంటూంటే నిర్మలమై ప్రకాశిస్తుంది. నీటిలోని పడవను ప్రతికూలమైన గాలి లాగా, విషయాసక్తమైన మనస్సును నియంత్రించుకోకపోతే అది మనిషి వివేకాన్ని పెడదారి పట్టిస్తుంది. ''కృష్ణా! చంచలమైనమనస్సును నిగ్రహించడం, గాలిని బంధించడం లాగా చాలా కష్టం కదా?'' అని అర్జునుడు గీతాచార్యునితో అంటాడు. అందుకు కృష్ణుడు ''మనో నిగ్రహానికి అభ్యాస, వైరాగ్యాలే సాధనాలు'' అని చెబుతాడు. అభ్యాసమంటే నిరంతర సాధన. బహుకాల నిరంతరాభ్యాసం వలన మనోనిగ్రహం అలవడి తీరుతుందంటాడు పతంజలి మహర్షి. నెమ్మదిగా, ఓర్పు, నేర్పులతో, పట్టుదలతో మనస్సును స్వాధీనపరచుకోవాలి.

మనస్సు యొక్క చంచల స్వభావాన్ని గురించి ఆదిశంకరాచార్యులు ఇలా అన్నారు: ''సదా మోహాటవ్యం చరతి, యువతీనాం కుచగిరౌనటర్యారౌ శాఖాస్వటతి, ఝుడిత్స్వైర మభిం। కపాలిన్! భిక్షో! మే హృదయ కపి మత్యంత చపలం। దృఢం భక్త్యా బద్ధ్వాశివ, భవదధీనం కురు విభో।''- ఓ ఈశ్వరా! సంసార మోహమనే అడవిలో, స్త్రీల వక్షోజములనే కొండలలో, ఆశలనే కొమ్మలలో, స్వేచ్ఛగా, విశృంఖలంగా, చపలతతో విహరించే, నా మనసనే కోతిని నీ భక్తి పాశంతో దృఢంగా బంధించి, నీ ఆధీనంలో ఉంచుకొనుము. అలాగే, తమ లక్ష్మీనృసింహ కరావలంబస్తోత్రంలో శంకరాచార్యులు మనసునిలా మందలిస్తారు:''చేతో భృంగ భ్రమసి వృథా భవ మరుభూమౌ విరసాయామ్। భజభజ లక్ష్మీ నరసింహా, నఘపద సరసిజ మకరందం।''- ఓ మానస మనెడి భృంగమా, ఈ ప్రాపంచికపు టెడారిలో చిక్కుపడి వృథాగా ఎందుకు పరిభ్రమిస్తున్నావు? శ్రీ లక్ష్మీనరసింహుని పాద పద్మములందలి మకరందమును గ్రోలి నీ జీవితాన్ని ధన్యం చేసుకో!''

ఇలా కోతి లాగా, తుమ్మెదలాగా చపలము, చంచలమైన మనసులోని కల్మషాలను నిర్మూలించుకోగలిగితే, పరిశుద్ధముగావింపబడిన విషపు ప్రాణ రక్షకమైన ఔషధంగా మారినట్లు మనసు మన పురోభివృద్ధికి తోడ్పడుతుంది. త్యాగరాజస్వామి, ''మనసు నిల్పశక్తి లేకపోతే, మధుర ఘంటావిరుల పూజేమి చేయును?'' అని,''మనసు స్వాధీనమైన యా ఘనునకు మరి మంత్ర తంత్రములేల?'' అని ప్రశ్నించారు. చేతిలో జపమాల తిరుగుతూ ఉంటుంది. నాలుక దైవ నామాన్ని పలుకుతూ ఉంటుంది. కానీ, మనస్సు నాల్గుదిక్కుల భ్రమిస్తూ ఉంటే అది సరియైన ప్రార్థనే కాదంటాడు తులసీదాసు.''మన ఏవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః'' బంధానికి గానీ, మోక్షానికి గానీ మూలం మన మనస్సే. బంధకారణమైతే అది మనకు శత్రువు. ముక్తి కారణమైనప్పుడది మన బంధువు. మనసు సంతోషంగా ఉంటే అది స్వర్గం. దుఃఖ వివశమైతే ఆ మనసే ఒక నరకం.

అతి చంచలమైన మనస్సుని నిగ్రహించడం మన వంటి సాధారణ మానవులకు సాధ్యమా? భర్తృహరి కవికి కూడా ఈ సందేహమే కలిగింది.

విశ్వామిత్రుడు, పరాశరుడు వంటి సంయమవరులు ఎవరైతే కందమూలాలు తింటూ, గాలిని స్వీకరిస్తూ, తపోనిష్ఠలో ఉండేవారో, అట్టివారే సుందరీమణుల పొందుకై మనసు చెడగొట్టుకొన్నారు కదా! మరి సన్నబియ్యం, పాలు, పెరుగు, ఉప్పు, కారం, తినే మామూలు మనుష్యులకు ఇంద్రియ నిగ్రహం అలవడడం వింధ్య పర్వతం సముద్రంలో తేలడం మాదిరిగ అసాధ్యమైన విషయం కాదా?

అందుకే సాత్విక, మితాహారం భుజిస్తూ, శరీర కష్టం కొంచెమైనా చేస్తూ, మనస్సులో ఎప్పుడూ దైవ నామస్మరణ చేస్తూ, సాటి వారికి సంతోషం కలిగేలా ప్రవర్తిస్తూ, మంచి గ్రంథాలు చదువుతూ, విరాగ భావనతో, అభ్యాసం చేస్తూ, క్రమక్రమంగా మనస్సును నియంత్రించుకోవాలి.

మనసును జయించలేనివాడు ఎంత గొప్పవాడైనా, వాని గొప్పదనము వ్యర్థమని ప్రహ్లాదునితో హిరణ్యకశిపునికి చెప్పిస్తాడు బమ్మెరపోతన కవి: ''లోకములన్నియున్ గడియలోన జయించిన వాడవింద్రియా/ నీకము చిత్తమున్ గెలువనేరవు, నిన్ను నిబద్ధు చేయునీ/ భీకర శత్రులార్వుర ప్రభిన్నుల చేసిన ప్రాణకోటిలో/ నీకు విరోధిలేడొకడు నేర్పున చూడుము దానవేశ్వరా!''-బయట రాజాధిరాజులను, రాజ్యాలను గెలిచినవాడు, తనలోనే ఉన్న కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలనే ఆరుగురు శత్రువులను గెలువలేడు. ఈ అరిషడ్వర్గాలను విచ్ఛిన్నం చేసుకొనిన వాడికి శత్రువులే ఉండరు. మనసుకు ప్రశాంతత లభించి అది వశమవుతుంది.

- గొల్లాపిన్ని సీతారామశాస్త్రి
9440781236

# శ్రీ సాయి గీత



### ఔదార్యం ఎక్కడ?

సంపద పెరిగినప్పుడు దానికి తగినటువంటి త్యాగము కూడనూ పెరగాలి. ఐశ్వర్యము పెరిగినప్పుడు ఔదార్యము కూడా పెరగాలి. కాని ఈనాడు ఐశ్వర్యము పెరుగుతున్నది కాని ఔదార్యము పెరగడం లేదు.

### నగలంటే..

'హస్తస్య భూషణం దానం
సత్యం కంఠస్య భూషణం
శ్రోత్రస్య భూషణం శాస్త్రం
భూషణైస్త్రైః కరోతి కిమ్?'

హస్తమునకు దానంకంటె మరొక అలంకారము లేదు. మాటకు సత్యమే భూషణం. శాస్త్ర చర్చలే చెవులకు దివ్యమైన సౌందర్యం. ఇట్టి తరగని, పెరగని అలంకారం మానవుని యందుంచుకొని, అనిత్యమైన, అశాశ్వతమైన అలంకారముల నిమిత్తమై ప్రాకులాడుతున్నాడు మానవుడు. ఎంత చిత్రం!

### గణపతి త్యాగం

వ్యాసుడు భారతం వ్రాయటానికి కూర్చున్నాడట. అప్పుడు సహాయం చేస్తారని వినాయకుడు వెళ్ళాడుట. 'వినాయకా! ఎంత దయామయుడవయ్యా! నీవునాకు చాలా ఉపకారం చేయటానికి వచ్చావు', అంటూ వ్యాసుడు 'నేను చెప్పినదంతా ఎక్కడా గంటం ఆపకుండా, మళ్ళీ అడక్కుండా చక్కగా వ్రాయాలని', ఒక షరతు పెట్టాడు. గణపతి మాత్రం తక్కువవాడా! 'నా గంటం నిలువకుండా వ్రాసేట్లు చెప్పాల'ని షరతుపెట్టాడు. వ్రాస్తూ వుండినప్పుడు గంటం విరిగిపోయిందట. అప్పుడు గణపతి చటుక్కున తన దంతము నొకదానిని విరిచి వ్రాయటం మొదలుపెట్టాడుట. ఆనాటినుండి గణపతి 'ఏకదంతుడు' అయినాడు. గణపతి ఎట్టి త్యాగముకైనా ఏమాత్రం వెనుకంజ వేసేవాడు కాదని దీనినిబట్టి తెలుస్తున్నది. 'త్యాగేనైకే అమృతత్వ మానశుః'అని వేదములు కూడా ఘోషిస్తున్నాయి.

### త్యాగపథం

ప్రాచీన శాస్త్రాలలో ఋషులు సాధనను చక్కగా వివరించారు. భగవత్ సృష్టిఅయిన ప్రకృతిని చూసి ఆశ్చర్యానందాలతో వారు భగవానుని లీలలను కీర్తించారు. త్యాగ పథాన్ని అనుసరించి ఆత్మ దర్శనం సాధించేందుకు, శాశ్వతానందాన్ని అందుకొనేందుకు మానవుడు ప్రయత్నంచేయాలన్నదే మహర్షుల ఆదేశం.

### రాముడు-భీష్ముడు

తండ్రి మాట జవదాటని తనయుడు రాముడు. తన సుఖం చూసుకొన్నవాడు కాదు. భీష్ముడుకూడా తండ్రికోసం పెండ్లి మానుకున్నాడు. రాముడు చేసిన త్యాగం కన్నా కూడా భీష్ముని త్యాగం గొప్పది. దశరథుడు తానిచ్చిన మాటకోసం కొడుకును అడవులకు పంపవలసింది పధ్నాలుగేళ్లే కాని శంతనుడు తన ఇంద్రియ సుఖంకోసం కొడుకును ఆజన్మ బ్రహ్మచారిగా వుంచేశాడు!

తండ్రి కోరిక అన్నది యిక్కడ ప్రధానం కాదు. సత్యానికీ, ధర్మానికీ కట్టుబడి వారు చూపిన ఆదర్శం త్యాగం!

### ఘనతకు గీటురాయి

నందిని పందిని, తిమ్మిని బ్రిమ్మిని చేసి గొప్పవాడివై పోవాలని ఆలోచిస్తున్నావేమో! చూడు. ఈ ప్రపంచం నేటికీ గుర్తుంచుకొని గౌరవిస్తున్న వారంతా ఏంచేశారు? వారికి అంత గౌరవం ప్రజలెందుకిస్తున్నారు? ఆలోచించు. త్యాగధనులనే సమాజం గుర్తుంచుకొంటోంది. నివాళులర్పిస్తోంది. ఎంతో దుర్ఘటమైన ఆత్మదర్శనం సాధించిన వారికే ఆరాధన లభిస్తోంది. కాని డబ్బూ దస్కం సంపాదనలో ముందుండటం కాదు ముఖ్యం.

### జనన మరణ చక్రం

పుట్టినప్పుడే మనిషికి రిటర్న్ టిక్కెట్టు రిజర్వయే వుంది. అది జేబులో వుంచుకొనే, సంపాదిస్తున్నాడు, ఖర్చుపెడుతున్నాడు. కిందాపైనా అవుతున్నాడు. ఆటా, పాటా, ఏడుపూ, నవ్వూ అంతా సాగిస్తున్నాడు. కాని, గమ్యం మరిచిపోతున్నాడు. బతుకుబండి సాగేది చివరకు ప్రేతభూమికేనని అతడికి గుర్తులేదు. జనన మరణ చక్రంలో చిక్కుకున్న వ్యక్తి గొప్ప ఏముంటుంది? దానినుండి విడివడటమే గొప్ప.

### అమృతస్య పుత్రః



సంసార చక్రంనుండి ఎప్పుడు బయటపడగలవు? మాయను జయించినప్పుడే! జనన మరణ వలయం నుండి కూడ నీకప్పుడే విముక్తి. ఆ స్థితిని నీవే పేరుతోనన్నా పిలువు. గమ్యాన్ని చేరటం అను; సాయుజ్యం అను; బ్రహ్మసాక్షాత్కారం అను; ఐక్యానుసంధానం అను, ఇంకా, ఏమంటావో నీ యిష్టం! పేరేదైనా కానీ, చేరే దొకచోటికే! 'అమృతస్య పుత్రః'అన్నారు పెద్దలు జీవుడిని. అమృతత్వం నుండి జనించిన జీవాత్మ సాధించాల్సిందేమిటి? అమృతత్వమే!

ఇంకా ఉంది

# నత్కీరుని శరణు.. శరవణుని అభయం



ధూర్జటి ప్రణీతమైన
కావ్యానికి
సరళ సుందర వచనం
శ్రీకాళహస్తి మాహాత్మ్యం
-డా. పాలకోడేటి జగన్నాథరావు

చరవాణి: 9490620512

### నత్కీరుని సుబ్రహ్మణ్య స్వామి రక్షించుట

'తారకాసురుని సంహారం చేసిన వాడూ, మహాశక్త్యాయుధాన్ని చేత ధరించినవాడూ, మయూర వాహనుడూ, దీనజనుల పాలిటి కల్పవృక్షమూ, ఆరుముఖాలతో చేసిన అట్టహాసధ్వని చేత దిగంతాలను పగులగొట్టిన వాడూ, అయిన సుబ్రహ్మణ్యస్వామి ఈ బ్రహ్మరాక్షసుని బట్టి సంహారం చేసి దయతో ఇందలి వారందరిని రక్షించుగాక. తారకాసురుని సంహారం చేసిన మహాప్రతాపశాలియైన ఆ షణ్ముఖుడికి ఈ భూతాన్ని చంపడమన్నది ఏమంత గొప్పవిషయం? వజ్రాయుధాన్ని పోలిన 'శక్తి ఆయుధంతో' క్రౌంచపర్వతాన్ని చీల్చి వేసిన ఆ స్వామికి ఈ కొండ గుహను చెండాడటం ఏమంత ఘనకార్యం? దేవతల బాధలనే తొలగించిన ఆ కరుణామూర్తికి ఈ గుహలో చిక్కిన మనుష్యుల్ని రక్షించడం ఒక పెద్దపనియా?

ఈ ప్రకారంగా అనేక రీతులుగా ఇష్టదేవతా శ్రేష్ఠుడూ, భక్తశరణ్యుడూ అయిన సుబ్రహ్మణ్య స్వామిని ఆ నత్కీరుడు అచట గల బ్రాహ్మణజనహితార్థంగా ప్రార్థించాడు. అంతట కరుణాతరంగి- తాంతరంగుడై ఆ సుబ్రహ్మణ్యస్వామి ఆ భూతాన్ని నేలకొరిగే విధంగా ఎడమచేత చరచి గుహద్వారంలో ఉంచిన రాతిని లాగి వేసి అందున్న వారందరిని బయటకు రండని ఆజ్ఞాపించాడు. అప్పుడు వారంతా మనస్సులలో సంతోషపడుతూ ఇందుశేఖర కుమారుడయిన షణ్ముఖుడికి నమస్కరించి వెళ్లిపోయారు. నత్కీర కవిచంద్రుడు మాత్రం తిరిగి తిరిగి అనేక నమస్కారాల్ని చేస్తూ నిలువబడే యున్నాడు. ఆయనను చూచి ప్రసన్నవదనంతో కుమారస్వామి 'నీవిచ్చటకు రాకారణ మేమిటి?' అని ప్రశ్నించాడు. దానికి నత్కీరుడిలా విన్నవించాడు.

'ఓ శరణాగతవత్సలా! కాశవనంలో (రెల్లువనంలో) జన్మించిన వాడా! దీనుల పాలిట కల్ప వృక్షమా! ఆపదల్ని నాశనం చేయువాడా! పాపపు పర్వతాలను ఛేదించే ఇంద్రుడా ! నన్ను దయ చూడు. నాకు సుఖం కలుగుతుంది. శివుడు నేనొక తప్పుపని చేయడం వలన కుష్ఠరోగవ్యాధి పీడితుడవు కమ్మని శపించాడు. ఆ శాపానికి విమోచనంగా నిజనివాసమైన కైలాసాన్ని దర్శిస్తే కుష్ఠవ్యాధి తొలగి పోతుందని ఆనతిచ్చాడు. ఆ కైలాసమార్గం చాలా దుర్గమమైనది. ఇక నేనేమి చేయగలను? ఆ కైలాసాన్ని నేనేవిధంగా దర్శించగలను? దర్శించిన గాని దుఃఖకరమైన ఈ రోగసముద్రాన్ని ఎలా దాటజాలను.' ఆ నత్కీరుని మాటలు విని పార్వతీ తనయుడు ఈశ్వరుడు కైలాసాన్ని దర్శించమన్నాడే గాని అది దక్షిణ దిశలోనిదా ఉత్తర దిశలోనిదా అని నిర్దేశించలేదు కదా. కాబట్టి దక్షిణకైలాసాన్ని చూచినా చాలు. కుష్ఠవ్యాధి తీరిపోగలదు. అని తన మనస్సులో భావించి అచటకు సులభంగా చేరే ఉపాయాన్ని ఆలోచించాడు. తన మాహాత్మ్యాన్ని కనబడనీయక అచటి కొను మహిమయే అన్నట్లుగా ఆ కొలనులో స్నానం చేయుమని ఆడబోవు తీర్థం ఎదురుకాగలదని శివ కుమారుడు నత్కీరుని ఆదేశించాడు.

### నత్కీరుడు శివసాయుజ్యం పొందుట

సేనాని (కుమారస్వామి) వచనామృతాన్ని అప్పుడు నత్కీరుడు చెవులార గ్రోలి అత్యంత నిష్ఠతో ఆ కొలనులో స్నానార్థం మునిగి తలయెత్తి చూడగా ఎదురుగా సువర్ణముఖరీనది తీరంలో దక్షిణకైలాస పర్వతమైన శ్రీ కాళహస్తి దర్శనమిచ్చింది. అప్పుడా నత్కీరమహాకవికి కుష్ఠవ్యాధి పూర్తిగా తొలగి పోయింది. శివదీక్షాతత్పరుడై అతడు దక్షిణకైలాసంలోని సువర్ణముఖరీనదిలో స్నానమాడి అచటగల గిరిజాధీశ్వరుని స్తుతిస్తూ తమిళ భాషలో నూరు పద్యాల్ని రచించాడు.

ఆ నూరు పద్యాల్ని విని సేనానీ జనకుడునూ, ఆర్తుల పాలిటి చింతామణియూ, సకలవిద్యా నిధియూ, జ్ఞానప్రసూనాంబా నాథుడునూ అయిన శ్రీకాళహస్తీశ్వరుడు మిక్కిలి సంప్రీతుడై ప్రత్యక్ష మయి సాహిత్య శ్రీవర! నీ జన్మ ధన్యమయ్యింది. నీకిష్టమైన వరాన్ని కోరుకో. నీకు అభయ మిస్తున్నాను. అన్నాడు. వెంటనే నత్కీరుడు పరంజ్యోతి అయిన శివునకు మ్రొక్కి సంతోష మనస్కుడై నత్కీరుడు ఫాలతలంపై (నుదురు) అంజలి ఘటించి ఒడలిపై గగుర్పాటు కలుగగా వణుకుతున్న కంఠంతో శివుని ఇలా స్తుతించాడు.

''దేవా! ఈ సంసారం ఆనందాన్ని పోలిన దుఃఖానికి నిలయం. దీనిని విడిస్తే ఏ బ్రహ్మానందం కలుగుతుందో నాకా బ్రహ్మానందాన్ని అనుగ్రహించు కృతార్థుడనౌతాను.'' అని ప్రార్థించిన నంతనే భక్తుల పాలిట కల్పవృక్షమూ, అజ్ఞానమనే త్రాటికి కొడవలి వంటివాడూ, సంసార జీవితమనే వస్త్రాన్ని ఛేదించే కత్తెర వంటివాడూ, కైవల్యరూపమైన అమృతాన్నాన్ని దానం చేసే మహాచింతామణి రత్నమూ- గిరిజాదేవితో కూడి సంపన్నమైన పవిత్రమైన గార్హస్థ్య జీవనభాగ్యం కలవాడూ అయిన శ్రీకాళహస్తీశ్వర మహాదేవుడు నత్కీరుడికి సాయుజ్య సుఖాన్ని అనుగ్రహించాడు.

ఈ విధంగా యాదవనరేంద్రునికి శివుడు నత్కీరమహాకవి



వృత్తాంతాన్ని వివరించగా ఆతడు ఈశ్వరుని పూజించి ఈ శ్రీకాళహస్తిలో మోక్షాన్ని పొందిన మహాభక్తులింక ఎందరెందరున్నారు? తెలుపుమని ప్రార్థించాడు. దానికి సమాధానంగా శివుడీవిధంగా పలికాడు.

- ఇంకావుంది...

## సత్యం శివం సుందరం

### సృ స్థి ల (సృష్టి స్థితి లయ) 2 వ భాగం

- సాంధ్య శ్రీ 8106897404

వెనుక జన్మాంతర స్మృతి
వెంటదెచ్చి
మాయ బంధమ్మునన్ ద్రోసి
పారజూచు
సూత్రమలాగు తార్కిక సూక్ష్మయుక్తి
గోచరము కాని
హృదయ నిగూఢ శక్తి..
ఎంత తీయని బాధకీ ఎడము తోచె
చేరువను తాకు దూరమౌ చింత నూని
మరల దివసాంత వేళ విమర్శ చేసి
సిత నిశాంత ప్రఫుల్లమై స్నిగ్ధమౌను..
విరహ నైరాశ్య నీలిమ కరడుగట్టి
ఆవృతిగ నిల్చు అనుభూతి కాకరమ్ము
తెల్లవారును విషయము తేటపడదు
ఆత్మ పాలిటి రాహువు అసలు విద్య..
సూర్య శిశువు ప్రాచీ మాతృగర్భంలోంచి వచిచ్చనట్లు
మానవ జీవిత మహాకావ్య మరంద ప్రవాహంలోంచి
అక్షర బిందువునై అవతరించాను..
ఇక్కడి నదులు- అడవులు - పర్వతాలు- పీఠభూములు
రాజకీయ కుట్రకు బలియై రక్తాశ్రువులు రాలుస్తున్నాయి
కావాత్మ కర్తవ్య దీక్షగా నా భుజమెక్కిన

ఇంకాఉంది

# జ్ఞానార్జనే తరుణోపాయం

పరమాత్మ జ్ఞానశక్తికి పరిధులు లేవు. కాని, ప్రకృతి నుండి సంక్రమించిన తామసగుణముయొక్క ఆవరణ శక్తి, జీవాత్మ జ్ఞానశక్తిని కప్పిపుస్తున్నది. ''అజ్ఞానేనావృతం జ్ఞానం తేన ముహ్యంతి జంతవః'' (ప్రాణుల జ్ఞానము, అజ్ఞానముచే కప్పబడి ఉన్నందువలన వారు మోహితులౌతున్నారు- భ.గీ.5-15).

అజ్ఞానము, జ్ఞానప్రాప్తితో తొలగిపోతుందని స్పష్టముచేయటానికి, దృష్టాంతముగా రాహుగ్రస్త సూర్యబింబము ప్రస్తావించబడింది. గ్రహణ సమయములో రాహుగ్రహము సూర్యునకు అడ్డముగా వచ్చి బాధించినా, కొద్ది వ్యవధిలోనే ఆ దుష్టశక్తి అంతమౌను. అట్లే, మానవుని అవివేకము తామసగుణ నివృత్తితో జ్ఞానసాధన ద్వారా నాశనమై పోవును. దృఢ సంకల్పముతో జ్ఞానార్జన తప్ప, అజ్ఞాన నివృత్తికి వేరొక ఉపాయము లేదు.

**142. తిరోభూతే స్వాత్మ న్యమలతర తేజోవతి పుమాన్
అనాత్మానం మోహాదహమితి శరీరం కలయతి।
తతః కామక్రోధ ప్రభృతిభి రముం బన్ధకగుణైః
పరం విక్షేపాఖ్యా రజస ఉరుశక్తి ర్వ్యథయతి॥**

స్వతఃసిద్ధముగా అత్యంత నిర్మలము, తేజోమయ స్వరూపమైనది జీవాత్మ. అయినప్పటికీ తమోగుణము ఆవృతమై ఉండగా అజ్ఞాని, శరీరమే నేను అనే అపోహతో ప్రవర్తించును. అంతేకాక, రాజస గుణముయొక్క విక్షేప శక్తిచే ప్రభావితమైన కారణంగా కామక్రోధాది గుణములు ఆ వ్యక్తిని పునఃపునః సంసారబంధములో పడవేసి, వాని జీవితమును దుర్భరము చేయును. స్మృతి దీనినే ఇలా బోధిస్తున్నది-

**“సత్త్వాత్ సంజాయతే జ్ఞానం రజసో లోభ ఏ వచ।
ప్రమాదమోహౌ తమసో భవతో జ్ఞానమేవచ॥”**

(సత్త్వగుణమువలన జ్ఞానము, రజోగుణమువలన లోభత్వము, తామస గుణమువలన ప్రమాదమోహాదులూ, అజ్ఞానము ఉత్పన్నమగుచున్నవి- భ.గీ.14-17).



జగద్గురు శ్రీశంకరాచార్య విరచిత
వివేక చూడామణి
ప్రతిపదార్థ తాత్పర్య వ్యాఖ్యాన సహితము
వ్యాఖ్యాత
ఆచార్య శ్యామశాస్త్రి
9573672695

**143. మహామోహ గ్రాహగ్రసన గలితాత్మావగమనో
ధియో నానావస్థాః స్వయ మభినయం స్తద్గుణతయా।
అపారే సంసారే విషయ విషపూరే జలనిధౌ
నిమజ్జ్యోన్మజ్జ్యాయం భ్రమతి కుమతిః కుత్సితగతిః॥**

అవిద్యారూపమైన మోహమనే మొసలి మ్రింగగా, ఆత్మ యథార్థ జ్ఞాన స్వరూపమును పోగొట్టుకొని, ఉపాధి వశమున వచ్చిన తామస రాజస గుణములతో ఆవృతమైన బుద్ధితో, ఇక్కట్లుకుపాలై మానవుడు వ్యవహరించును. మనోనిగ్రహము కోల్పోయి, కుత్సిత బుద్ధికారణంగా హీనకర్మలు చేయుటకు కూడ వెనుకాడడు.

రాహుగ్రస్తమైన సూర్యుడు, తన తేజోరూపమును గ్రహణకాలములో కోల్పోయినట్లు, విషయములనే విషప్రవాహమైన సంసారమనే దాట శక్యముకాని సముద్రములో పడిపోవగా, అవివేకి దానినుండి బయటపడలేక, మునుగుతూ-తేలుతూ, అత్యంత దుఃఖమయ జీవితమును అనుభవించును.

**144. భానుప్రభా సంజనితాభ్రపంక్తి
ర్భానుం తిరోధాయ యథా విజృమ్భతే।
ఆత్మోదితాహంకృతి రాత్మతత్త్వం
తథా తిరోధాయ విజృమ్భతే స్వయమ్॥**

సూర్యరశ్మల ద్వారా ఉత్పన్నమైన మేఘముల పంక్తి (మేఘమాల) సూర్యకాంతిని అడ్డుకొని విజృంభించిన రీతిలో, ఆత్మప్రకాశముతో అహంకారము విజృంభించి, ఆత్మతత్త్వమును కనుమఱుగు చేస్తూ, తానే ఆత్మగా అభాసరూపములో ప్రకటితమౌతున్నది. యథార్థతః అహంకారమునకు ఆత్మగుణములేవి లేనేలేవు. అయినా, ఆత్మను కప్పిపుచ్చి తాను విజృంభించి, 'నేనుగా' వ్యవహరిస్తున్నది.

### ఆవరణ విక్షేప శక్తులు

**145. కబలితదిన నాథే దుర్దినే సాన్ద్రమేఘై
ర్వ్యథయతి హిమఝంఝావాయు రుగ్రో యథైతాన్।
అవిర తమసాత్మన్యావృతే మూఢబుద్ధిం
క్షపయతి బహుదుఃఖై స్తీవ్ర విక్షేపశక్తిః॥**

కారుమబ్బులు సూర్యుని కమ్ముకొనగా, దుర్దినములో తీవ్రమైన మంచుగాలులతో జనులు ఎట్లు క్లేశమును అనుభవింతురో, అట్లే పెరిగిన తామసగుణము ఆవరించగా, మూర్ఖపు బుద్ధిగలవానిని తీవ్ర విక్షేపశక్తి దుర్గతిపాలుచేసి నాశనము చేయును.

''తథా ప్రలీనస్తమసీ మూఢయోనిషు జాయతే'' (తామస ప్రవృత్తిగల మనిషి మరణానంతరము మరల పశుపక్ష్యాది హీనజన్మనే పొందును- భ.గీ.14-15). వివేకశూన్యుడైన మూర్ఖుడు, జీవితకాలము దుఃఖమును అనుభవిస్తూ, ఏనాడూ జనన మరణవలయమునుండి బయటపడలేడు.

**146. ఏతాభ్యా మేవశక్తిభ్యాం
బన్ధః పుంసః సమాగతః।
యాభ్యాం విమోహితో దేహం
మత్వాత్మానం భ్రమత్యయమ్॥**

అజ్ఞానమునకు మూలమైన తామస, రాజస గుణముల ఆవరణ విక్షేపశక్తులు రెండూ చేరగా మనిషి బద్ధుడై పోవును. ఈ రెండు శక్తుల మోహజాలములోపడి, దేహమే ఆత్మ అనే అపోహతో, జనన మరణ చక్రంలో చిక్కుకొని క్రిందకూ-మీదకూ (అధో లోకాలకు- ఊర్ధ్వలోకాలకు) పరిభ్రమిస్తూ ఉంటాడు.నిత్యానిత్య జ్ఞానం లేని అవివేకి జనన మరణములను అధిగమించలేక, పాపకర్మల కారణంగా నరకాది అధోలోకములకు పోవలసి వచ్చును.

పాపక్షయముకాగా మరల ఈ లోకంలో జన్మించి, పుణ్యకర్మల ఫలితంగా స్వర్గాది ఊర్ధ్వలోకాలకుపోయినా మరల పుణ్యఫలము క్షీణించగా తిరిగి ఈ లోకానికి రాకతప్పదనే స్మృతి నిర్ధారిస్తున్నది (భ.గీ.9-21).

- ఇంకావుంది...

ఆంధ్రభూమి

# చిత్రభూమి

జీవితమొక నటనయనే
వివేకమును ప్రోదిజేసి విందుగ పరచే
నవరసముల సినిమాయై
అవిరళముగ ముదమునిచ్చుటద్భుతమేగా!

బుధవారం 8, జనవరి 2020 IV

# 22.. శివకు హిట్టే

డైరెక్షన్ డిపార్ట్‌మెంట్‌లో నాతో కలిసి వర్క్ చేసిన శివ -22 చిత్రంతో దర్శకుడు కావడం హ్యాపీ అనిపించేది. ఇప్పుడు సినిమా ఫస్ట్‌లుక్ గ్లిప్స్ చూసిన తరువాత -బేసిగ్గా శివ మీదున్న నమ్మకం రెట్టింపైంది. 22తో హిట్టుకొట్టి పెద్ద దర్శకుడు కావాలని ఆకాంక్షిస్తున్నా అని పూరి జగన్నాథ్ అన్నారు. మా ఆయి ప్రొడక్షన్స్‌లో రూపేష్‌కుమార్, సలోని మిశ్రా జోడీగా డెబ్యూ డైరెక్టర్ బి శివ తెరకెక్కించిన చిత్రం -22. కొండా కృష్ణంరాజు నిర్మాత. చిత్రానికి సంబంధించిన ఫస్ట్‌లుక్ గ్లిప్స్‌ను దర్శకుడు పూరి విడుదల చేస్తూ, చిత్రబృందానికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో నిర్మాత కొండా కృష్ణంరాజు మాట్లాడుతూ -పర్ఫెక్ట్ ప్రీప్రొడక్షన్, షూట్ ప్లానింగ్‌తో 35 రోజుల్లో టాకీ పార్ట్ పూర్తి చేశాడు దర్శకుడు శివ. ప్రాజెక్టును నిర్మాణ కోణంలో ప్లాన్ చేసి డైరెక్టర్‌గా మంచి అవుట్‌పుట్ తీసిన శివకు మంచి భవిష్యత్తు ఉండాలని ఆకాంక్షిస్తున్నా అన్నారు. సీనియర్ పీఆర్వో బిఏ రాజు మాట్లాడుతూ -టెంపర్ షూటింగ్ టైంలోనే మీ అబ్బాయి శివలో స్పార్క్ ఉంది, త్వరగా డైరెక్టరవుతాడని పూరి చెప్పినపుడు సంతోషం కలిగింది. అయితే, మనసు తృప్తికోసం ఇలాగే చెబుతారులే అనుకున్నా. ఒకరోజు హీరో రూపేష్‌ను తీసుకొచ్చి, సినిమాకు ప్లాన్ చేశామని చెప్పినపుడు ఆశ్చర్యంతో కూడిన ఆనందం కలిగింది. ఇప్పుడు నాకు బర్త్‌డే గిఫ్ట్‌గా సినిమా ఫస్ట్‌లుక్ గ్లిప్స్ విడుదల చేయడం తండ్రిగా మరింత ఆనందంగా వుంది. ప్రేక్షకుల అభిమానాలే కాదు, ఆశీర్వాదాలు కూడా నా కొడుక్కి కావాలి. 22 సినిమాకు విజయం చేకూరుస్తారని ఆశిస్తున్నా అన్నారు. హీరో రూపేష్ మాట్లాడుతూ -నా తొలి సినిమా టీజర్ పూరి చేతులమీదుగా విడుదలవ్వడం హ్యాపీ. కథ వినకుండానే దర్శకుడు శివతో సినిమాకు రెడీ అవ్వడం -అతనిపై నాకున్న నమ్మకం అన్నారు. దర్శకుడు బి శివకుమార్ మాట్లాడుతూ -పూరి, వినాయక్, మారుతిలాంటి సీనియర్ డైరెక్టర్ల నుంచి నేర్చుకున్న విద్యే ఇది. టీజర్ బావుందని అంతా అటుంటే -వాళ్ల నమ్మకాన్ని నిలబెట్టానని అనిపిస్తోంది. ముఖ్యంగా సాయికార్తీక్ బ్యాగ్రౌండ్ స్కోర్‌ను పూరి బాగా ఎంజాయ్ చేశారు. నామీద నమ్మకంతో పెద్ద అవకాశం ఇచ్చిన హీరో రూపేష్‌కు, అడిగింది ఏదీ కాదనకుండా ఇచ్చిన నిర్మాతలకు ధన్యవాదాలు అన్నాడు. కార్యక్రమంలో కెమెరామెన్ రవికిరణ్, ఆర్ట్ డైరెక్టర్ పెద్దిరాజు తదితరులు మాట్లాడారు. విక్రంజీత్‌విర్క్, జయప్రకాష్, రవివర్మ, రాజశ్రీనాయర్, పూజారామచంద్రన్ తదితరులు కార్యక్రమానికి హాజరయ్యారు.



22 చిత్రానికి సంబంధించి ఫస్ట్‌లుక్ గ్లిప్స్ విడుదల కార్యక్రమంలో సినిమాటోగ్రాఫర్ రవికిరణ్, మ్యూజిక్ డైరెక్టర్ సాయికార్తీక్, దర్శకుడు శివ, హీరో రూపేష్, బిఏ రాజు, నిర్మాత కొండా కృష్ణంరాజు

## నీకై.. అభిసారికనై..



నూతన నటులు సాయిబాబు, ఆశీరాయ్, సురయ పర్వీన్ ప్రధాన తారాగణంగా అనీషా క్రియేషన్స్ పతాకంపై వెంకట్‌రామ్ పల్లా దర్శకత్వంలో సుగుణ ఓ రూపొందిస్తున్న చిత్రం -నీకై అభిసారికనై. ఈ చిత్రానికి సంబంధించిన ముహూర్తపు సన్నివేశం హైదరాబాద్‌లో చిత్రీకరించారు. రవి కనకాల క్లాప్‌నివ్వగా, మద్దినేని కెమెరా స్విచ్చాన్ చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు వెంకట్‌రామ్ పల్లా మాట్లాడుతూ -కొత్తవారితో రూపొందిస్తున్న చిత్రం ఏకబిగిన 15 రోజులపాటు మొయినాబాద్ పరిసర ప్రాంతాల్లో షూటింగ్ చేయనున్నాం. రాజ్‌కిరణ్ సంగీతం సమకూరుస్తున్న చిత్రానికి సంబంధించిన ఐదు పాటలు ఇప్పటికే రికార్డు చేశాం. అన్ని కార్యక్రమాలు పూర్తిచేసి ప్రేక్షకుల ముందుకు రావడానికి సన్నాహాలు చేస్తున్నాం అన్నారు. కార్యక్రమంలో చిత్ర యూనిట్ పాల్గొని విశేషాలు తెలిపారు. నెహ్రూబాబు, బాలాజీ, నాగభూషణ్, రామచంద్రారెడ్డి, పుట్టాగిరి తదితరులు నటిస్తున్న చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే, పాటలు, ఎడిటింగ్, దర్శకత్వం వెంకట్రామ్ పల్లా.

## స్పెషల్ సాంగ్ స్పెషల్ అట్రాక్షన్



తోలుబొమ్మలు చిత్రాలు బ్యానర్‌పై డెబ్యూ డైరెక్టర్ కొమారి జానకీరామ్ ప్రొడక్షన్ నెం 1 చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఆనందకృష్ణ, స్వాతిమండల్ జోడీగా నటిస్తోన్న ఈ చిత్రం -స్పెషల్ సాంగ్ చిత్రీకరణతో షూటింగ్ పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా దర్శకుడు జానకిరామ్ మీడియాతో మాట్లాడుతూ -బాచుపల్లి దగ్గర వేసిన ప్రత్యేక సెట్‌లో స్పెషల్ సాంగ్ చిత్రీకరించాం. దీంతో షూటింగ్ పూర్తైంది. శ్రష్టి వర్మ డ్యాన్స్ పెర్ఫార్మెన్స్ ఈ పాటకు ప్రత్యేక ఆకర్షణ. మందు బానిసలకు సందేశాన్నిచ్చే ఈ పాట అన్ని వర్గాల ప్రేక్షకులను ఉర్రూతలూగిస్తుందని నమ్మకం ఉంది. పోస్ట్ ప్రొడక్షన్స్‌లోవున్న ఈ కామెడీ హారర్ థ్రిల్లర్ -ఆడియన్స్‌ని ఎంటర్‌టైన్ చేస్తుందన్న నమ్మకముంది. అశోక్, యాంకర్ ఇందు, వెంకటేష్, పూజ సుహాసిని, నందు, ఇంజల్‌వాణి, జూనియర్ సంపు నటిస్తోన్న చిత్రానికి డి యాదగిరి సినిమాటోగ్రఫీ, యువి నిరంజన్ సంగీతం సమకూరుస్తున్నారని అన్నారు.



## మరో థ్రిల్లర్‌తో..

రెజీనా లీడ్‌రోల్‌లో యాపిల్ ట్రీ స్టూడియోస్ బ్యానర్‌పై డైరెక్టర్ కార్తీక్‌రాజు ఓ ప్రాజెక్టు తెరకెక్కించనున్నాడు. సంక్రాంతి సీజన్‌లో జనవరి 13నుంచి ప్రాజెక్టుని సెట్స్‌పైకి తీసుకెళ్తున్నారు. ఈ సందర్భంగా నిర్మాత రాజశేఖర్ వర్మ మాట్లాడుతూ -కార్తీక్‌రాజు కథ విన్న తరువాత ప్రేక్షకుడిగా ఆనందించా. ఇప్పటివరకు తెరకెక్కని ఔట్‌స్టాండింగ్, సర్‌ప్రైజింగ్ ఎలిమెంట్స్‌తో వున్న కథ అందరినీ ఎంటర్‌టైన్ చేస్తుందనటంలో సందేహం లేదు. దక్షిణాది చిత్రాల్లో హీరోయిన్ సెంట్రిక్ చిత్రాలు చాలా తక్కువగా ఉన్నాయి. తాజాగా 'ఎవరు'తో రెజీనా నటన అందరినీ ఆకట్టుకుంది. కొత్త థ్రిల్లర్ కోసం రెజీనా మంచి ఎఫర్ట్ పెట్టనున్నారు. రెజీనా చేయనున్న ఆర్కియాలజిస్ట్ క్యారెక్టర్‌కు ఆడియన్స్ బలంగా కనెక్టవుతారన్న నమ్మకం ఉంది. డూప్ లేకుండా యాక్షన్ ఎపిసోడ్స్ చేసేందుకు ఆమె ప్రత్యేకంగా శిక్షణ తీసుకుంటున్నారు కూడా. ఈనెల 13న సినిమాను ప్రారంభించి, మంచి లొకేషన్స్‌లో సినిమా చిత్రీకరించనున్నాం. త్వరలోనే ఫస్ట్‌లుక్ విడుదల చేసి, మరిన్ని వివరాలు వెల్లడిస్తామని అన్నారు.





# సెలబ్రేషన్‌కు గ్యాప్ ఇవ్వను

అల్లు అర్జున్ -పూజా హెగ్డే జోడీగా దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ తెరకెక్కించిన చిత్రం -అల వైకుంఠపురములో. హారిక అండ్ హాసిని క్రియేషన్స్, గీతా ఆర్ట్స్ బ్యానర్లపై ఎస్ రాధాకృష్ణ, అల్లు అరవింద్ నిర్మించిన ఈ సినిమా జనవరి 12న థియేటర్లకు రానుంది. ప్రీ రిలీజ్ ఫంక్షన్‌కు బదులుగా సంగీతానికి ప్రాముఖ్యతనిస్తూ నిర్వహించిన 'మ్యూజికల్ కాన్సర్ట్' హైదరాబాద్‌లో అద్భుతంగా సాగింది. ఈ సందర్భంగా హీరో అల్లు అర్జున్ మాట్లాడుతూ -సరైనోడు, డీజే, నాపేరు సూర్య.. చిత్రాల తరువాత ఓ సరదా సినిమా చేయాలనిపించింది. ఆ ఆలోచనతో ఎన్ని కథలు విన్నా నచ్చలేదు. చివరకు కథ సెట్టవ్వడానికి, త్రివిక్రమ్ రెడీ అవ్వడానికి, సినిమా చేయడానికి ఇంత టైమ్‌పట్టింది. ఈ గ్యాప్ రిలీజ్‌లో ఉంటుందేమోగానీ, సెలబ్రేషన్‌లో ఉండదు. చాలా పాటల్లానే సామజవరగమనా.. ఆలోచన కూడా మామూలుగానే మొదలైంది. ముందు తమన్ బాణీ.. సిరివెన్నెల సాహిత్యం.. సిద్‌శ్రీరాం గాత్రం.. పిఎస్ వినోద్ దృశ్యం.. ఆలోచననిచ్చిన త్రివిక్రమ్.. ఇలా ఎవరికివాళ్లు పాట స్థాయిని ఎక్కడికో తీసుకెళ్లారు. ఆ పాట ఇప్పుడొక సెన్సేషన్. అదొక్కటే కాదు, అన్ని పాటలూ ఆ స్థాయిని అందుకున్నాయి. అందుకు ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు చెప్పుకుంటున్నా. టెక్నీషియన్స్, ఆర్టిస్టులు.. ఇలా ప్రతి ఒక్కరూ తమ ప్రతిభను ఫణంగా పెట్టటంతో సినిమా ఈ స్థాయికి వచ్చేసింది. వాళ్లకు పేరు పేరునా థాంక్స్ చెబుతున్నా. టెక్నీషియన్లు, ఆర్టిస్టులు టూల్స్, కలర్స్ అయితే ఈ రెంటితో అద్భుతమైన చిత్రాన్ని గీసేవాడు దర్శకుడు. త్రివిక్రమ్ గీసిన అద్భుతమైన బొమ్మ మీకు నచ్చుతుందనే అనుకుంటున్నా. ఇక -నేను నాన్నయిన తరువాతే మా కోసం మా నాన్న ఎంత కష్టపడ్డారో అర్థమవుతుంది. సభాముఖంగా ఆయనకు ఏరోజూ చిన్న థాంక్స్ కూడా చెప్పలేదు. ఇప్పుడు థాంక్స్ చెప్పడమే కాదు, సినిమా ఇండస్ట్రీకి ఆయన చేసిన సేవలు చూసి 'పద్మశ్రీ'కి సిఫార్స్ చేయమని రెండు ప్రభుత్వాలకు రిక్వెస్ట్ చేస్తున్నా. ఇక చిరంజీవి తరువాత నేను ఇష్టపడే గొప్ప వ్యక్తి రజనీకాంత్. సంక్రాంతి సీజన్‌లో వస్తోన్న ఆయన సినిమా దర్బార్ గొప్ప విజయాన్ని అందుకోవాలి. ఆయనతోపాటు 'సరిలేరు నీకెవ్వరు' అంటూ వస్తున్న మహేష్, 'ఎంత మంచివాడవురా' అంటూ వస్తున్న కల్యాణ్ సినిమాలూ మంచి హిట్లుకావాలి. ఆయా చిత్రబృందాలకు ఆల్ ది బెస్ట్. ఈ సంక్రాంతి అందరికీ బావుండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా అన్నారు.

చిత్ర దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ మాట్లాడుతూ -పాట ఓ ఫ్రెండ్. పాట ఒక లవర్. పాట ఒక మాస్టర్. పాటకు పెద్ద విలువుంది. అలాంటి పాటల్ని ఈ సినిమా కోసం అందించిన రచయితలు, సంగీతకారులు, గాత్రధారులు, మొత్తం టీంని గౌరవించుకునే ప్రయత్నమే -ఈ మ్యూజికల్ నైట్. ఈ ఆలోచనకు మూలం మాత్రం హీరో బన్నీ. జులాయిలో పెళ్లికాని పిల్లాడిగా తెలిసిన బన్నీ, ఇప్పుడు ఇద్దరు పిల్లల తండ్రిగా ఎంతో మెచ్యూరిటీని చూపిస్తుంటే ఆనందంగా ఉంటుంది. ఆనందాన్ని ఎల్లకాలం అందించే అభిలషణీయమైన చిత్రాన్ని తీయాలన్న బన్నీ ఆలోచనను నేను కథారూపంగా ఆచరణలో పెడితే, నిర్మాణపరంగా నిర్మాతలు మాకు వెన్నుముక అయ్యారు. అడిగిందల్లా ఇచ్చారు. ఒక విభాగమనే కాదు, అన్ని విభాగాల నుంచీ ఈ సినిమాకు పనిచేసినోళ్లంతా ఏదోక సందర్భంలో నా మనసుకు దగ్గరైనవాళ్లే. వాళ్లందరికీ కృతజ్ఞతగా నేను చెప్పే మాట ఒక్కటే -వాళ్లందరితో నేను ప్రేమలో ఉన్నాను. ముగింపుగా చెప్పే మాట -ఈ సినిమాకు మొదలు, చివర మాత్రం హీరో అల్లు అర్జున్. ఈ సినిమాలో స్టార్లు అల్లు అయాన్, అర్హ కూడా నటించారు. అదొక స్పెషల్. ఈ సినిమాకు పండుగకు వస్తుంది. జనవరి 12న అంతా కలిసి పండగ చేసుకుందాం. అల.. వైకుంఠపురములో ప్రేక్షకులు అందరికీ స్వాగతం పలుకుతుంది అన్నారు.

సంగీత దర్శకుడు ఎస్‌ఎస్ తమన్ మాట్లాడుతూ -బన్నీకి తానూ ఫ్యాన్ కనుక, మంచి దర్శకుడు త్రివిక్రమ్ నుంచి వచ్చిన కథ కనుక అందుకు తగిన సంగీతాన్ని అందించే అవకాశం తనకు దక్కిందన్నారు. హీరో సుశాంత్ మాట్లాడుతూ -కథ వినకముందే సినిమా చేయాలని ఫిక్సయ్యాను. అందుక్కారణం బన్నీ, త్రివిక్రమ్. త్రివిక్రమ్ నన్ను ప్రజెంట్ చేసిన విధానం చూసిన తరువాతే -నన్ను నేనే కొత్తగా చూసుకుంటున్నట్టు ఫీలవుతున్నా. గొప్ప ఆర్టిస్టులు, టెక్నీషియన్లతో కలిసి పనిచేసే అవకాశమిచ్చిన నిర్మాతలు, దర్శకుడు, బన్నీకి కృతజ్ఞతలు అన్నాడు. కమెడియన్ సునీల్ మాట్లాడుతూ -థియేటర్‌లోకి అడుగు పెట్టిన ప్రేక్షకులకు సినిమా ఓ ఫీస్ట్. పండుగ సందర్భంగా మేమంతా మీ ఇంటికొచ్చినట్టే ఫీలవుతారు అన్నాడు. హీరోయిన్ నివేదా పేతురాజ్ మాట్లాడుతూ బన్నీతో కలిసి పనిచేసే అవకాశం రావడం హ్యాపీగా ఉందన్నారు.

నటి టాబూ మాట్లాడుతూ -ఇలాంటి సినిమా కోసమే తెలుగులో ఇంత గ్యాప్ వచ్చిందేమో. కుటుంబ సభ్యుల్లాంటి వీళ్లందరితో కలిసి రీఎంట్రీ సినిమా చేయడం చాలా హ్యాపీగా ఉంది. సినిమా పెద్ద సక్సెస్ అవుతుంది అన్నారు. నిర్మాత అల్లు అరవింద్ మాట్లాడుతూ -చిన్న కథను అద్భుతంగా తెరకెక్కించిన విడుదలకు ముందే హిట్ చేశాడు దర్శకుడు త్రివిక్రమ్. ఇక సినిమాకోసం కష్టపడిందంతా నిర్మాత రాధాకృష్ణే. 2019కి వీడ్కోలుగా ప్రతిరోజూ పండగే సినిమా, 2020కి వెల్‌కమ్‌గా అల వైకుంఠపురములో చిత్రాలకు సంగీతమిచ్చిన తమన్‌కు థాంక్స్ అన్నారు.

## సెట్స్‌పైకి పవన్‌లేని పింక్?



పింక్ కోసం పవన్ ఫ్యాన్స్ ఎదురు చూస్తున్నారు. సినిమాలకు గ్యాప్‌నిచ్చి రాజకీయాల్లో బిజీ అయిపోయిన తరువాత -పవన్ మళ్లీ స్క్రీన్‌కు వస్తాడా? అన్న అనుమానాలు ఫ్యాన్స్‌ని ముసిరాయి. అయితే, పాలిటిక్స్‌ని బ్యాలెన్స్ చేస్తూనే పవన్ మళ్లీ స్క్రీన్స్‌కు రానున్నాడన్న కథనాలు నిజమై -ఎట్టకేలకు 'పింక్'దగ్గర ఫుల్‌స్టాప్ పడింది. అప్పటి నుంచీ ఫ్యాన్స్ మళ్లీ పింక్ రీమేక్ ఎప్పుడు మొదలవుతుందా? అని ఆశగా చూడటం కనిపిస్తున్నదే. పింక్‌తో పవన్ రీఎంట్రీ కన్ఫర్మ్ అయిపోవడంతో -సినిమాను నిర్మించనున్న దిల్‌రాజు అందుకు తగిన సన్నాహాలు చకచకా చేస్తున్నాడట. వేణు శ్రీరామ్ దర్శకత్వం వహించనున్న ఈ సినిమా -జనవరి 20నుంచి సెట్స్‌పైకి వెళ్లే అవకాశం ఉందని తెలుస్తోంది. ముందుగా పవన్ క్యారెక్టర్, ఆయన పాత్రతో చేయాల్సిన కాంబినేషన్ సీన్స్‌ని పక్కనపెట్టి, మిగతా సినిమాను పూర్తి చేయడానికి దిల్‌రాజు సన్నాహాలు చేస్తున్నట్టు టాక్. పవన్ షెడ్యూల్ ఫిక్స్ చేసుకున్న తరువాత -అతని పాత్ర, కాంబినేషన్ సీన్స్‌ని షూట్ చేస్తారని తెలుస్తోంది. అంటే -పవన్ రీఎంట్రీ ప్రాజెక్టు పింక్ రీమేక్ కోసం దిల్‌రాజు ఆతృత చూపిస్తున్నాడన్న మాట. బాలీవుడ్‌లో మంచి విజయం అందుకున్న పింక్, తమిళ రీమేక్‌తోనూ సక్సెస్‌ను నిలబెట్టుకుంది. కథాబలం ఉన్న చిత్రానికి పవన్ రీఎంట్రీ అనే బోనస్ చేరింది కనుక -తెలుగు రీమేక్‌పైనా భారీ అంచనాలే కనిపిస్తున్నాయి.



## జాను ఫస్ట్‌లుక్

రెండేళ్ల క్రితం తమిళంలో సెన్సేషన్ సృష్టించిన సినిమా -96. ఈ సినిమాతో త్రిష మళ్లీ స్టార్ హీరోయిన్ల రేస్‌లోకి వచ్చింది. పైగా పన్నెండు అవార్డులు కొల్లగొట్టిన సినిమా కూడా. అందుకే -తనకొచ్చిన అవార్డులతో త్రిష తీయించుకున్న ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ సినిమా విజయ్ సేతుపతికీ అంతే పేరు తెచ్చింది. దర్శకుడిగా సి ప్రేమ్‌కుమార్ పేరు మార్మోగింది. బాక్సాఫీస్ సక్సెస్‌తోపాటు క్రిటిక్స్ అప్లాజ్ అందుకున్న సినిమా రీమేక్ రైట్స్‌ని దిల్‌రాజు చేజిక్కించుకోవడం తెలిసిందే. సమంత- శర్వానంద్ కాంబోలో తెరకెక్కనున్న రీమేక్‌నీ ప్రేమ్‌కుమారే తెరకెక్కించనున్నాడు. ఈ రీమేక్ నుంచి తాజాగా ఓ అప్‌డేట్ వచ్చింది. అదే -జాను. టైటిల్ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను తాజాగా చిత్ర బృందం బయటకు వదిలింది. ఎడారిలో వరుసలో నడుస్తున్న ఒంటెల మందను తాడుతో లాగుతున్న శర్వాను రివీల్ చేశారు. ఎల్లలులేని ఎడారి ప్రేమను సింబాలిక్‌గా టైటిల్ పోస్టర్‌పై చూపించటం -ఆసక్తిని రేకెత్తిస్తోంది. మంచి కథాలోచన దర్శకుడి బుర్రకు తడితే ఎంత బలమైన బావోద్వేగాల సినిమా తీయొచ్చో ఇప్పటికే 96 నిరూపించింది. ఆ బిగి దెబ్బతినకుండా తెలుగు రీమేక్‌ను 'జాను'గా దర్శకుడు తెరకెక్కిస్తున్నాడన్న విషయం పోస్టర్‌తో అర్థమవుతుంది. తెలగు రీమేక్‌ల సక్సెస్ శాతం తక్కువన్న సెంటిమెంట్‌వున్నా, గతేడాది 'రాక్షసుడు' చిత్రం రీమేక్‌లకు కొత్త ఉత్సాహాన్నిచ్చింది. దర్శకుడు ప్రేమ్‌కుమార్ -'జాను'తో ఆ నమ్మకాన్ని మరింత ముందుకు తీసుకెళ్తాడన్న నమ్మకాలు లేకపోలేదు. ఇదిలావుంటే, సాహో తరువాత ప్రభాస్ చేస్తున్న చిత్రం టైటిల్ కూడా 'జాను' అన్న ప్రచారంలో ఉంది. ఇప్పుడు ఆ టైటిల్ శర్వా చిత్రానికి ఫిక్సైంది కనుక -ప్రభాస్ ఎలాంటి టైటిల్‌తో వస్తాడో చూడాలి.